www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఏపీ పోలీసులకు
పతకాల పంట
రాష్ట్రపతి మెడల్ సహా 19 సేవా పతకాలు
దేశవ్యాప్తంగా 982 మందికి శౌర్య, సేవా పతకాలు
కేంద్ర హోం శాఖ ప్రకటన
9



సోమవారం | 26-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 320 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి రా.9.18 తదుపరి నవమి, నక్షత్రం: అశ్విని మ.12.33 తదుపరి భరణి, వర్జ్యం: ఉ.8.43-ఉ.10.15, రా.9.35-11.05, దుర్ముహూర్తం: మ.12.50-1.34, మ.3.04-3.49, అమృతఘడియలు: శేషం. ఉ.7.11, తె. 6.37 మొదలు, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 6.03 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు..
నోరి దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్



నటులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్‌కు పద్మశ్రీ

- ఏపీకి చెందిన సాహితీవేత్త వెంపటి కుటుంబ శాస్త్రికి పద్మశ్రీ
- గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు మరణానంతరం ఆ పురస్కారం
- 2026 పద్మ పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ అవార్డులు
- ఏపీకి చెందిన నలుగురికి.. తెలంగాణ నుంచి ఏడుగురికి!
- కృష్ణాజిల్లా వాసి నోరికి అమెరికా కోటాలో పద్మభూషణ్
- మొత్తంగా 14 మంది తెలుగువారికి పద్మ పురస్కారాలు
- కేరళలో ముగ్గురికి పద్మవిభూషణ్.. అచ్యుతానందన్, సుప్రీం మాజీ జడ్జి జస్టిస్ థామస్, సీపీఐ నేత నారాయణన్
- ధర్మేంద్రకు పద్మ విభూషణ్, మమ్ముట్టికి పద్మభూషణ్


వెంపటి కుటుంబ శాస్త్రి
గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడును ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ పురస్కారం వరించింది! 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏటి పద్మ పురస్కారాలను ఆదివారం ప్రకటించింది. విద్య, వైద్యం, సాహిత్యం, కళలు, సామాజిక సేవ..

మిగతా 11వ పేజీలో...

ఊపిరి ఉన్నంత వరకు సంస్కృతాభివృద్ధికి సేవ
భారతదేశ అస్తిత్వానికి సంస్కృతమే మూలం
భాషలో పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు
'ఆంధ్రజ్యోతి'తో వెంపటి కుటుంబ శాస్త్రి



శుభాంశు శుక్లాకు అశోక చక్ర
అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు

కల్లోల ప్రపంచంలో భారత్ శాంతిదూత
మహిళా శక్తి పునాదిగా దేశాభివృద్ధి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
10

వెండి రీసైక్లింగ్‌లోకి ఎంఎంటీసీ

న్యూఢిల్లీ: వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో సరఫరా-డిమాండ్ మధ్య తీవ్ర అంతరం నిరోధించడం లక్ష్యంగా ఎంఎంటీసీ-పీఏఎంపీ వెండి రీసైక్లింగ్ చేపట్టాలని నిర్ణయించాయి. మరో మూడు నెలల్లో ప్రయోగాత్మక ప్రాతిపదికన తమ స్టోర్‌లో వెండి రీ సైక్లింగ్ ప్రారంభించనున్నామని కంపెనీ ఎండీ, సీఈఓ సమిత్ గుహ తెలిపారు. డిమాండు పెరుగుతున్నప్పటికీ ప్రపంచ స్థాయిలో గనుల ఉత్పాదక సామర్థ్యం పెరిగే ఆస్కారం ఏమీ కనిపించని కారణంగా వెండి రీ సైక్లింగ్‌కు ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో రీసైకిల్ చేసిన వెండి సరఫరా లోటును తీర్చడంలో కీలకంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ గృహస్థుల వద్ద 25,000 టన్నుల బంగారం, దానికి పది రెట్లు అధికంగా వెండి నిల్వలున్నాయని అంచనా అని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో స్టోర్ల సంఖ్య రెట్టింపు చేయాలని భావిస్తున్నట్టు గుహ తెలిపారు. వెండి రీ సైక్లింగ్ ప్రారంభించడానికి ముందు స్టోర్లలోని పరికరాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉన్నదని, వెండిని ఒక లోహంగా గుర్తించేలా వాటిని సిద్ధం చేయాల్సి ఉన్నదని చెప్పారు. అలాగే సిబ్బందికి కూడా కొంత శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు.

పెట్టుబడికి వెండి సానుకూలం: వెండి తక్కువ స్థాయిలో పెట్టుబడులకు అనుకూల సాధనమని గుహ అన్నారు. గత ఏడాది కాలంలో బంగారం ధర 75% పెరిగితే వెండి, ప్లాటినం 130-140% పెరిగాయని చెప్పారు. గత 12 నెలలుగా బంగారంతో పోల్చితే వెండి రెట్టింపు రాబడిని అందించిందన్నారు. బంగారం ర్యాలీని మిస్ అయిన ఇన్వెస్టర్లు ఇప్పుడు వెండిని అనుకూలమైన పెట్టుబడిగా భావిస్తున్నారని చెప్పారు. తక్కువ మొత్తంలో పెట్టుబడికి వెండి సానుకూలం కావడమే ఇందుకు కారణమని గుహ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ



హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	490
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	143
వరంగల్	140	గుంటూరు	150
కరీంనగర్	140	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	132
కర్నూలు	140	నెల్లూరు	137
విశాఖపట్నం	135	అనంతపురం	137
గోదావరి	143		



ఉదయ్ కోటక్‌కు పద్మ భూషణ్

ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశ ఆర్థిక, బ్యాంకింగ్ రంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా ఉదయ్ కోటక్‌ను 2026 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 1982లో కోటక్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ (అనంతరం కోటక్ మహీంద్రా ఫైనాన్స్) పేరుతో ఒక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ని స్థాపించి 2003లో దాన్ని పూర్తి స్థాయి ప్రైవేట్ బ్యాంకుగా మార్చి అనేక ఆర్థిక సేవల రంగాల్లోకి కార్యకలాపాలను విస్తరించారు. 2014లో ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్‌ను కొనుగోలు చేయటంలో ఉదయ్ కోటక్ కీలక పాత్ర పోషించారు. అనంతరం కోటక్ గ్రూప్ 2015లో సాధారణ బీమా వ్యాపారంలోకి అడుగుపెట్టింది. కాగా బ్యాంక్ సీఈఓ పదవి నుంచి తప్పుకున్నా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇప్పటికీ కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు ఉదయ్ కోటక్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు.



టీటీకే ప్రెస్టీజ్ జగన్నాథన్‌కు పద్మశ్రీ

కిచెన్ మొఘల్‌గా ప్రసిద్ధి చెందిన టీటీకే ప్రెస్టీజ్ గ్రూప్ చైర్మన్ ఎమిరెటస్ టీటీ జగన్నాథన్ ఈ ఏడాది పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. మరణానంతరం ఆయనకు ఈ పురస్కారం ప్రకటించారు. గత ఏడాది అక్టోబరులో ఆయన 77 ఏళ్ల వయసులో కన్నుమూశారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా జగన్నాథన్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రెస్టీజ్ బ్రాండ్ పేరుతో తీసుకువచ్చిన ప్రెజర్ కుక్కర్స్‌తో పాటు భారతీయ కుక్‌వేర్‌కు అంతర్జాతీయంగా ప్రాచుర్యం తీసుకురావటంలో ఆయన విశేష కృషి చేశారు. ఐఐటీ మద్రాస్ నుంచి గోల్డ్ మెడల్ అందుకున్న ఆయన కార్నెల్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలు ఆయన టీటీకే ప్రెస్టీజ్ సారథ్య బాధ్యతలు నిర్వర్తించారు. కాగా మహారాష్ట్రకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త డీఏఎస్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎండీ అశోక్ ఖాడే, సోలార్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు సత్యనారాయణన్ నువాల్‌కు కూడా పద్మశ్రీ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది.

రూపాయి పతనంపై దిగుమతిదారుల బెంబేలు

న్యూఢిల్లీ: డాలర్‌తో రూపాయి పతనం ఆర్థికవేత్తలతో పాటు ప్రభుత్వాన్నీ కలవర పరుస్తోంది. శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం రేటు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.92 స్థాయికి పడిపోయింది. దీంతో మన దేశానికి ప్రధాన దిగుమతులపైన ముడి చమురు, బంగారం, వెండి, వంటనూనెలు, రసాయన ఎరువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు మరింత భారం కానున్నాయి. విదేశీ విద్య, విదేశీ ప్రయాణాలపైనా మరింత ఖర్చు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతిదారులకు లాభం: డాలర్‌తో రూపాయి పతనంపై దిగుమతిదారులు లబోదిబో మంటుంటే, ఎగుమతి కంపెనీలు మాత్రం ఖుషీ ఖుషీగా ఉన్నాయి. దీంతో తాము అందుకునే డాలర్లకు మరిన్ని రూపాయలు సొమ్ము చేసుకోవచ్చని భావిస్తున్నాయి. అయితే ప్రధాన ముడి పదార్థాల కోసం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడిన ఎగుమతిదారులకు మాత్రం ఈ విషయంలో పెద్దగా లాభం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో చతికిల పడిన వస్త్ర, ఆభరణ, మత్స్య ఎగుమతులకూ కూడా రూపాయి పతనం పెద్దగా లాభించక పోవచ్చని అంచనా. అయితే ఐటీ కంపెనీలకు మాత్రం ఇది బాగానే కలిసి వస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

విమానాల తయారీలోకి అదానీ గ్రూప్

బ్రెజిల్ కంపెనీ 'ఎంబ్రాయర్'తో జట్టు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా వాణిజ్య విమానాల తయారీకి సిద్ధమవుతోంది. ఇందుకోసం బ్రెజిల్ కేంద్రంగా పనిచేసే విమానాల తయారీ కంపెనీ 'ఎంబ్రాయర్'తో జట్టు కడుతోంది. ఈ నెల 27న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో రెండు కంపెనీల ఉన్నతాధికారులు దీనికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందం కింద ఎంబ్రాయర్ కంపెనీకి చెందిన వాణిజ్య విమానాల తుది అసెంబ్లింగ్ లైన్ (ఎఫ్ఏఎల్) కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తారు. అయితే ఇది జాయింట్ వెంచరా లేక పూర్తిగా అదానీ నిర్వహణలో ఉండే ప్రాజెక్టా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

ఎందుకంటే ?

మన దేశంలో పౌర విమానయానం వేగంగా పుంజుకుంటోంది. ఇండిగో, ఆకాశ ఎయిర్‌లైన్స్‌తో పాటు టాటాల నిర్వహణలోని ఎయిర్ ఇండియా ఇప్పటికే 1,200కుపైగా కొత్త విమానాల కోసం ఎయిర్ బస్, బోయింగ్ కంపెనీలకు ఆర్డర్లు పెట్టాయి. ప్రాంతీయ విమానయానం కోసం వచ్చే 20 ఏళ్లలో దేశీయ విమానయాన సంస్థలు మరో 500 విమానాల వరకు ఆర్డర్ పెట్టనున్నాయి. అదానీ గ్రూప్ ఇప్పటికే విమానాశ్రయాల నిర్వహణలో ఉంది. పెరుగుతున్న ఈ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ముందుగా విమానాల అసెంబ్లింగ్, తరువాత వాటికి అవసరమైన విడిభాగాల ఉత్పత్తిలోకి ప్రవేశించాలని అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు సమాచారం.

నేడు మార్కెట్లకు సెలవు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్.. వెల్త్ ఫరెవర్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ పాలసీ 99 సంవత్సరాల వరకు జీవిత బీమా రక్షణను అందిస్తుంది. పాలసీ తీసుకున్న మూడేళ్ల తర్వాత ఉచిత ఆరోగ్య పరీక్షలను అందిస్తుంది. నామినీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలసీ సొమ్ము బదలాయిస్తుంది.
- ఇసుజు మోటార్స్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్‌లో తన నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా అనంతపురంలో కొత్త సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. సంస్థకు రాష్ట్రంలో ఇది 8వ సెంటర్
- తైవాన్ టెక్ దిగ్గజం ఆసుస్.. 2025లో దక్షిణాది రాష్ట్రాల్లో మంచి పనితీరును కనబరిచింది. గత ఏడాది కంపెనీ అమ్మకాల్లో 25 శాతం వృద్ధిని సాధించి ఇక్కడి పీసీ బ్రాండ్స్ మార్కెట్లో శరవేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలిచింది.

25,400 పైన బుల్లిష్

(జనవరి 27-30 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ: 25,049 (-645)

నిఫ్టీ గత వారం 26,653-25,025 పాయింట్ల మధ్యన కదలాడి 645 పాయింట్ల నష్టంతో 25,049 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా ఎగువన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,793, 25,925, 25,599, 25,143 వద్ద ఉన్నాయి. ఇవి సూచీకి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,400
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,700
నిరోధ స్థాయిలు: 25,250, 2,5350, 25,450 (25,150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,850, 24,750, 24,650 (24,950 దిగువన బేరిష్)

25,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ 25,000 వద్ద మైనర్ రికవరీ సాధించినా నిలదొక్కుకోలేక ఆటుపోట్లు ఎదుర్కొని చివరికి ముందు వారంతో పోల్చితే 645 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. గత కొద్ది రోజులుగా మార్కెట్ నిట్టనిలువుగా దిగజారినందు వల్ల తక్షణ అప్‌ట్రెండ్‌కు విరామం ఇచ్చినట్టే కనిపిస్తోంది. గత కొద్ది రోజుల్లో నిఫ్టీ 1,300 పాయింట్లు నష్టపోయింది. సానుకూలత కోసం 25,000 స్థాయిలో మద్దతు తీసుకుని కన్సాలిడేట్ కావలసి ఉంది. కాగా గత వారంలో మిడ్ క్యాప్-100 సూచీ 2,720 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 1,000 పాయింట్లు నష్టపోయాయి. గత కొద్ది నెలల్లో ఏర్పడిన భారీ నష్టం ఇదే కావడం వల్ల మార్కెట్ ఏ స్థాయిలో మద్దతు తీసుకుంటుందో వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే మైనర్ నిరోధ స్థాయిలు 25,150, 25,300. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. ఆ పైన నిరోధ స్థాయి 25,500.

బేరిష్ స్థాయిలు: మార్కెట్ ప్రస్తుతం ప్రధాన మానసిక అవధి 25,000 సమీపంలో ఉంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 24,400, 24,300.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ సైతం గత వారంలో 1,620 పాయింట్ల మేరకు దిగజారి 58,470 వద్ద బలహీనంగా ముగిసింది. కీలక స్థాయి 60,000 వద్ద సుదీర్ఘ పరీక్ష అనంతరం పోరాటాన్ని విరమించినట్టు కనిపిస్తోంది. ఇది స్వల్పకాలిక బలహీనత సంకేతం. టెక్నికల్ రికవరీ సాధించినట్టయితే ప్రధాన నిరోధం 59,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. దిగువన మద్దతు స్థాయి 58,000.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 200 డీఎంఏ వద్ద పరీక్షకు సిద్ధం అవుతోంది. స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ పొజిషన్‌లోకి అడుగు పెడుతున్నందు వల్ల రికవరీకి ఆస్కారం ఉంది. మార్కెట్ ప్రస్తుతం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలిచి ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,150, 25,300
మద్దతు	24,950, 24,800



విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్

రోహిత్, హర్మన్, సవితలకు పద్మశ్రీ



ప్రవీణ్, సవిత

న్యూఢిల్లీ: దిగ్గజ టెన్నిస్ ఆటగాడు విజయ్ అమృత్‌రాజ్‌కు ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ అవార్డు దక్కింది. అలాగే క్రికెటర్లు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రం ఆదివారంనాడు పద్మ అవార్డులను ప్రకటించింది. దేశ అవార్డుల్లో మూడో అత్యున్నతమైన పద్మభూషణ్ ఈసారి క్రీడారంగం నుంచి విజయ్ అమృత్‌రాజ్‌ను వరించింది. అమృత్‌రాజ్‌కు 1983లో పద్మశ్రీ, అంతకుముందు 1974లో అర్జున పురస్కారాలు ప్రదానం చేశారు. ఇక రోహిత్ శర్మ తన సారథ్యంలో 2024 టీ 20 వరల్డ్ కప్‌ను భారత్‌కు అందించాడు. అలాగే గత ఏడాది హిట్‌మ్యాన్ కెప్టెన్సీలో టీమిండియా 50 ఓవర్ల చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది. టెస్టులు, టీ20లకు గుడ్‌బై చెప్పిన రోహిత్ ప్రస్తుతం వన్డేలలో మాత్రమే కొనసాగుతున్నాడు. అలాగే గత సంవత్సరం హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో మహిళల జట్టు వన్డే వరల్డ్ చాంపియన్‌గా ఆవిర్భవించింది. పారా ఒలింపిక్స్ హైజంప్‌లో పసిడి పతకం సాధించిన ప్రవీణ్ కుమార్, భారత మహిళా హాకీ జట్టు గోల్ కీపర్ సవితా పూనియా, హాకీ వెటరన్ కోచ్ బల్‌దేవ్ సింగ్, సంప్రదాయ యుద్ధ విద్య సిలంబట్టమ్ కోచ్ పజనివేల్ (పుదుచ్చేరి), బుందేలి యుద్ధ కళ కోచ్ భగవాన్ దాస్ రైక్వార్ (మధ్యప్రదేశ్)లకు పద్మశ్రీ ప్రకటించారు. జార్జియాకు చెందిన దివంగత రెజ్లింగ్ కోచ్ వ్లాదిమిర్ మెస్త్‌విర్షివిలీను మరణానంతరం పద్మశ్రీకి ఎంపిక చేశారు. పదేళ్లపాటు భారత రెజ్లింగ్ కోచ్‌గా పనిచేసిన వ్లాదిమిర్ యోగేశ్వర్ దత్, బజ్‌రంగ్ పూనియాకు శిక్షణ ఇచ్చాడు.

ఇదిగో మా జట్టు..

అయినా...ఆడతామో లేదో

- బీరాలుపోతున్న పాక్ సెలెక్టర్లు

లాహోర్: బంగ్లాదేశ్‌ను తప్పించినందుకు నిరసనగా.. తామూ వరల్డ్ కప్‌నుంచి వైదొలగుతామని బీరాలు పలుకుతూనే మెగా టోర్నీలో పాల్గొనే జట్టును పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రకటించింది. ఆదివారం ఎంపిక చేసిన 15 మందితో కూడిన జట్టుకు సల్మాన్ ఆఘా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా తామూ ప్రపంచ కప్‌నుంచి వైదొలుగుతామని, ఈ విషయమై ప్రధాని షహబాజ్ షరీఫ్ నిర్ణయం తీసుకుంటారని పీసీబీ చీఫ్ మొహిసిన్ నక్వీ శనివారం చెప్పాడు. అయితే ఐసీసీ ఆంక్షల హెచ్చరికలతో 24 గంటల్లో పాక్‌జట్టును సెలెక్టర్లు ప్రకటించడం గమనార్హం.

100 శాతం ఆడతామని కాదు..: జట్టును ప్రకటించినంత మాత్రాన తాము నూరుశాతం టోర్నీ బరిలో దిగుతున్నట్టు కాదని సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ వెల్లడించాడు. 'సెలెక్టర్లుగా జట్టును ఎంపిక చేయడం మా విధి. గడువు తేదీ (జనవరి 30) దగ్గర పడడంతో జట్టును ప్రకటించాం. మేము టోర్నీలో ఆడేదీ లేనిదీ ప్రభుత్వ నిర్ణయిస్తుంది' అని ఆకిబ్ చెప్పాడు.

పాకిస్థాన్ జట్టు

సల్మాన్ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రాఫ్, ఫఖర్ జమాన్, నయాఫ్ (కీపర్), మహ్మద్ నవాజ్, సల్మాన్ మీర్జా, నసీమ్ షా, షాహిబ్‌జాదా ఫర్హాన్ (కీపర్), సాయిమ్ అయూబ్, షహీన్ షా అఫ్రీది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్ (కీపర్), ఉస్మాన్ తారిఖ్.

సూర్య ఫైర్ అభిషేక్ వైల్డ్‌ఫైర్



అభిషేక్ శర్మ (20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 నాటౌట్)

మూడో టీ20లో కివీస్‌పై భారత్ ఘనవిజయం

3-0తో సిరీస్ కైవసం

1 టీ20ల్లో 25 అంతకంటే తక్కువ బంతుల్లోనే ఎక్కువ (9) 50+ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా అభిషేక్
ఈ ఫార్మాట్‌లో 3.1 ఓవర్లలోనే 50 పరుగులు చేయడం భారత్‌కిది తొలిసారి.

2 భారత్ తరపున పొట్టి ఫార్మాట్‌లో వేగంగా (14 బంతుల్లో) హాఫ్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా అభిషేక్. యువరాజ్ (12) ముందున్నాడు.
టీ20 పవర్‌ప్లేలో తమ రెండో అత్యధిక స్కోరు (94/2)ను సాధించిన భారత్. గతేడాది ఇంగ్లండ్‌పై 95/1 స్కోరుతో టాప్‌లో ఉంది.

4 టీ20ల్లో తొలి బంతికే అవుటైన నాలుగో భారత బ్యాటర్‌గా శాంసన్. గతంలో రాహుల్, పృథ్వీ షా, రోహిత్ ఉన్నారు.

గువాహటి: టీ20 వరల్డ్‌కప్ ఆరంభానికి ముందు టీమిండియా ఆడుతున్న తీరు ప్రత్యర్థి జట్ల వెన్నులో వణుకు పుట్టిస్తున్నదనడంలో సందేహం లేదు. శుక్రవారం 209 పరుగుల ఛేదనను భారత్ 15.2 ఓవర్లలో ముగించి వహ్వా అనిపించింది. ఇక ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో 154 పరుగుల లక్ష్యాన్ని అంత సులువుగా వదులుతారా?.. అభిషేక్ శర్మ (20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 నాటౌట్), సూర్యకుమార్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 నాటౌట్) సునామీ ఇన్నింగ్స్‌తో కేవలం పది ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించ డం విశేషం. ఇరు జట్లు కనీసం డ్రింక్ విరామం కూడా తీసుకోలేదంటే వీరి విధ్వంసహోరు అర్థమవుతుంది. 8 వికెట్ల తేడాతో నెగ్గిన భారత్ మరో రెండు మ్యాచ్‌లుండగానే 3-0తో సిరీస్‌ను దక్కించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 153 పరుగులు చేసింది. ఫిలిప్స్ (48), చాప్‌మన్ (32), శాంట్నర్ (27) మాత్రమే రాణించారు. బుమ్రాకు మూడు, బిష్ణోయ్, హార్దిక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 10 ఓవర్లలో 2 వికెట్లకు 155 పరుగులు చేసి నెగ్గింది. ఇషాన్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28) రాణించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జస్‌ప్రీత్ బుమ్రా నిలిచాడు.



సూర్యకుమార్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 57 నాటౌట్)

ఏమా బాదుడు?: ఓ మాదిరి ఛేదనలో కివీస్ బౌలర్లకు ఓపెన్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ చుక్కలు చూపించారు. ఉన్నకాసేపు ఇషాన్ సైతం బ్యాట్ ఝుళిపించడంతో స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే ఓపెనర్ శాంసన్‌ను పేసర్ హెన్రీ గోల్డెన్ డకౌట్ చేసినా.. ఇషాన్ వచ్చీ రావడంతోనే 6,6,4తో తొలి ఓవర్‌లోనే 16 రన్స్ అందించాడు. అటు అభిషేక్ తానెదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి మరింత ఊపు తెచ్చాడు. నాలుగో ఓవర్‌లో ఇషాన్ వెనుదిరిగాక సూర్య ప్రతాపం ఆరంభమైంది. ఆరో ఓవర్‌లో అభిషేక్ 4,4,6తో 14 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా.. అదే ఓవర్‌లో సూర్య సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 94/2 స్కోరుతో అదరగొట్టింది. పదో ఓవర్‌లో సూర్య 6,4,4తో 25 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయడమే కాకుండా మ్యాచ్‌ను కూడా ముగించాడు.

తడబాటుతో ఆరంభం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ భారత బౌలర్ల ధాటికి పరుగుల కోసం చెమటోడ్చింది. మధ్య ఓవర్లలో కాస్త ఫర్వాలేదనిపించినా, ఆరంభంతో పాటు డెత్‌ఓవర్లలో చతికిలపడింది. బిష్ణోయ్, బుమ్రా కట్టడి చేశారు. దీంతో అతికష్టంగా 150 రన్స్ దాటగలిగింది. ఫిలిప్స్, చాప్‌మన్ మాత్రమే దీటుగా ఎదుర్కొన్నారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ కాన్వే (1)ను పేసర్ హర్షిత్, రెండో ఓవర్‌లో రచిన్ (4)ను హార్దిక్ దెబ్బతీశాడు. కాసేపటికే ఓపెనర్ సీఫర్ట్ (12)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో కివీస్ 36/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. ఈ దశలో ఫిలిప్స్‌కు చాప్‌మన్ జత కలిశాడు. అయితే ఈ జోడీ జాగ్రత్తగా ఆడడంతో 5-8 ఓవర్ల మధ్య కనీసం ఫోర్ కూడా నమోదు కాలేదు. కానీ కుల్దీప్ వేసిన ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో చాప్‌మన్ 6,4 ఫిలిప్స్ 6తో 19 రన్స్ సమకూరాయి. చక్కగా కుదురుకున్న ఈ జోడీని బిష్ణోయ్ విడదీశాడు. 12వ ఓవర్‌లో తను చాప్‌మన్‌ను అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే మిచెల్ (14), ఫిలిప్స్ వరుస ఓవర్లలో వెనుదిరగ్గా కివీస్ కష్టాలు ఆరంభమయ్యాయి. శాంట్నర్ బ్యాట్ ఝుళిపించినా సహకారం కరువైంది. చివరి ఐదు ఓవర్లలో జట్టు నాలుగు వికెట్లు కోల్పోయింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: కాన్వే (సి) హార్దిక్ (బి) హర్షిత్ 1, సీఫర్ట్ (బి) బుమ్రా 12, రచిన్ (సి) బిష్ణోయ్ (బి) హార్దిక్ 4, ఫిలిప్స్ (సి) ఇషాన్ (బి) బిష్ణోయ్ 48, చాప్‌మన్ (సి) శాంసన్ (బి) బిష్ణోయ్ 32, మిచెల్ (సి) ఇషాన్ (బి) హార్దిక్ 14, శాంట్నర్ (సి) అభిషేక్ (బి) బుమ్రా 27, జేమిసన్ (బి) బుమ్రా 3, హెన్రీ (రనౌట్) 1, సోధీ (నాటౌట్) 2, డఫీ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 5, మొత్తం: 20 ఓవర్లలో 153/9. వికెట్ల పతనం:** 1-2, 2-13, 3-34, 4-86, 5-112, 6-112, 7-132, 8-134, 9-144. **బౌలింగ్:** హర్షిత్ 4-0-35-1, హార్దిక్ 3-0-23-2, బిష్ణోయ్ 4-0-18-2, బుమ్రా 4-0-17-3, కుల్దీప్ 3-0-32-0, దూబే 2-0-24-0.

భారత్: అభిషేక్ (నాటౌట్) 68, శాంసన్ (బి) హెన్రీ 0, ఇషాన్ (సి) చాప్‌మన్ (బి) సోధీ 28, సూర్య (నాటౌట్) 57; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 10 ఓవర్లలో 155/2. వికెట్ల పతనం:** 1-0, 2-53. **బౌలింగ్:** హెన్రీ 2-0-28-1, డఫీ 2-0-38-0, జేమిసన్ 1-0-17-0, సోధీ 2-0-28-1, శాంట్నర్ 2-0-28-0, ఫిలిప్స్ 1-0-16-0.

స్పోర్ట్స్

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ముంబై X బెంగళూరు (రా. 7.30)



క్వార్టర్స్‌లో అల్కారజ్, సబలెంక

మెద్వెదెవ్, ఆండ్రీవా అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: టాప్‌సీడ్లు కార్లోస్ అల్కారజ్, అర్యానా సబలెంక ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లారు. మరోవైపు ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ ఆడకుండానే ముందంజ వేశాడు. అల్కారజ్ 7-6 (6), 6-4, 7-5తో టామీ పాల్‌పై, మూడో సీడ్ జ్వెరెవ్ 6-2, 6-4, 6-4తో సెరెండులోపై, ఆరోసీడ్ డిమినార్ 6-4, 6-1, 6-1తో బబ్లిక్‌పై, టీన్ 6-4, 6-0, 6-3తో 11వ సీడ్ మెద్వెదెవ్‌పై విజయంతో రౌండ్-8కు చేరారు. ఇక సోమవారంనాటి నాలుగో రౌండ్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్వాలిఫయర్ జాకబ్ మెన్సిక్‌తో జొకో తలపడాల్సి ఉంది. కానీ పొత్తి కడుపు గాయంతో జాకబ్ వైదొలగడంతో నొవాక్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో టాప్ సీడ్ సబలెంక 6-1, 7-6 (1)తో 17వ సీడ్ ఎంబొకోపై, మూడో సీడ్ కొకొ గాఫ్ 6-1, 3-6, 6-3తో 19వ సీడ్ ముచోవాపై, 12వ సీడ్ స్విటోలినా 6-2, 6-4తో ఎనిమిదో సీడ్ ఆండ్రీవాపై నెగ్గారు.

ముగిసిన భారత్ పోరు.: ఇక, జూనియర్ విభాగంలో భారత్ పోరు ముగిసింది. బాలికల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాయా రాజేశ్వరన్ 4-6, 1-6తో అనా పుష్కరేవా చేతిలో, బాలుర సింగిల్స్‌లో అర్నావ్ పపార్కర్ 3-6, 4-6తో విహాన్ రెడ్డి (అమెరికా) చేతిలో ఓడారు.

చాంపియన్‌కు ఆంధ్ర షాక్

రషీద్ శతకం
8 వికెట్లతో విదర్భ ఓటమి



రషీద్

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): రంజీ ట్రోఫీ చాంపియన్ విదర్భకు ఆంధ్ర షాకిచ్చింది. రషీద్ (132 నాటౌట్) అజేయ శతకంతో అదరగొట్టిన వేళ 8 వికెట్లతో విదర్భను చిత్తు చేసింది. 259 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ 93/1 స్కోరుతో కొనసాగించిన ఆంధ్ర 259/2తో నెగ్గింది. రికీ భుయ్ (64 నాటౌట్), భరత్ (43) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 295, ఆంధ్ర 228 రన్స్ చేయగా, పర్యాటక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 191 పరుగులకు ఆలౌటైంది. ఈ గెలుపుతో 8 జట్ల గ్రూపులో ఆంధ్ర (28 పాయింట్లు) టాప్‌లో నిలిచింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 26-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

దేశంలోనే అతి పెద్ద దోపిడీ?!

400 కోట్ల నగదు ఉన్న 2 కంటెయినర్లు మాయం.. కర్ణాటకలోని బెళగావి పరిధిలో ఘటన

తనను కిడ్నాప్ చేసినట్లు ఓ వ్యక్తి నాసిక్‌లో ఫిర్యాదు.. ఆ కంటెయినర్ల వెంట అతడు ఉన్నట్లు అనుమానాలు.. దర్యాప్తునకు సహకరించాలని కర్ణాటక పోలీసులకు మహారాష్ట్ర సిట్ లేఖ

ఇప్పటికే ఐదుగురి అరెస్టు.. బెళగావి జిల్లా ఎస్పీ ప్రెస్‌మీట్‌తో ఆలస్యంగా వెలుగులోకి 10

మీడియాలో ప్రచారంతో విస్తృత చర్చ.. నగదు ఎంత? ఎవరిది? దేనిపైనా స్పష్టత లేని వైనం



టీడీపీ ఎంపీలతో భేటీ అయిన సీఎం చంద్రబాబు. చిత్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, మంత్రి లోకేశ్

నిధులు రాబట్టాలి!

మీకు అప్పగించిన శాఖలతో సంప్రదింపులు జరపాలి

టీడీపీ ఎంపీలకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి చట్టబద్ధత బిల్లు ఈ పార్లమెంటు సమావేశాల్లోనే

మంత్రి, అధికారులతో టచ్‌లో ఉండండి

తెలంగాణ ప్రాజెక్టులకు మనం అభ్యంతరం చెప్పలేదు

నల్లమలసాగర్‌పై ఆ రాష్ట్ర వాదన కరెక్టు కాదు

పార్లమెంటులో స్పష్టంగా తెలియజేయండి

కలెక్టర్ల సదస్సుకూ వర్చువల్‌గా హాజరు కావాలి

టీడీపీపీ భేటీలో ఎంపీలకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లోనే మోదీ ప్రభుత్వం బిల్లు పెట్టనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దీనిపై కేంద్రంలోని సంబంధిత మంత్రి, అధికారులతో టచ్‌లో ఉండాలని టీడీపీ ఎంపీలకు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో

మిగతా 12వ పేజీలో...

ఇకపై ఎంపీలతోనూ బాబు ముఖాముఖి!

వారు కూడా పార్టీ కార్యాలయానికి రావాలి


మీలో కొందరి తీరుపై అధినేత సంతృప్తిగా లేరు

వారిని పిలిపించి మాట్లాడాలని నిర్ణయం

నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ఎమ్మెల్యేల బంధం మరింత బలపడేలా ఎంపీలు వ్యవహరించాలి: లోకేశ్

అనంతలో జల సంరక్షణ భేష్!

9



కరువు జిల్లాలో ప్రజలు, యంత్రాంగం సంయుక్త కృషితో నీటి వనరుల అభివృద్ధి

7 వేలకు పైగా మొక్కలు కూడా నాటారు

'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు



అనంతపురం జిల్లాలో విస్తరించిన ఇసుక మేటలు



రైతులు సాగుచేసిన సపోటా పంట

ఎడారీకరణ.. నియంత్రణ!

అనంతపురం జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో ఇసుక మేటల విస్తరణకు కట్టడి

కుంటల నిర్మాణాలతో భూగర్భ జలాల పెంపు

కరువు కట్టడికి జల సంరక్షణ చర్యలు 9

మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకం

అనంత జల సంరక్షణ సాధ్యమైందిలా..

రాయలసీమ అంటే ఒకప్పుడు కరువు సీమగా చెప్పేవారు! ఉమ్మడి అనంతపురం జిల్లాలో అయితే పరిస్థితులు మరింత దారుణంగా ఉండేవి!! కాలం మారే కొద్దీ పరిస్థితులూ మారుతున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో అధికారులు కరువు నియంత్రణకు చర్యలు చేపట్టారు. కుంటల నిర్మాణాలతో జల సంరక్షణ చర్యలు చేపడుతూ.. భూగర్భ జలాలను పెంచేందుకు కృషి జరుగుతోంది.

నేటి నుంచి ఫుడ్, గ్రాసరీ యాప్స్ క్లోజ్

క్యాబ్స్, ఈ-కామర్స్, లాజిస్టిక్ సేవలూ బంద్

నేటి నుంచి ఆన్‌లైన్ షట్‌డౌన్

సమస్యలు లేవనెత్తితే అకస్మాత్తుగా తొలగింపు 10

మహిళా వర్కర్లపై లైంగిక వేధింపులు.. వివక్ష

డెడికేటెడ్ కేంద్ర చట్టం తేవాలని గిగ్ వర్కర్ల డిమాండ్



హెచ్-1బీ వీసాదారులకు మరో షాక్..!

వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027కు వాయిదా 10

అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్స్ భారీగా పెండింగ్

ఆందోళనలో భారతీయ వృత్తి నిపుణులు

బంగ్లాలో మరో హిందూ యువకుడి హత్య

రాత్రి వేళ నిద్రిస్తుండగా పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

సజీవ దహనమైన చంచల్ చంద్ర భౌమిక్ 10



మహారాష్ట్రలోని నాందేడ్ గురుద్వారా సందర్శన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం అజిత్ పవార్

త్యాగంతో ధర్మపరిరక్షణ సాధ్యం

2

గురుతేజ్ బహదూర్ సింగ్ త్యాగం స్ఫూర్తిదాయకం

350వ షహీదీ సమాగమంలో పవన్ కల్యాణ్ ప్రార్థనలు

నాందేడ్‌లో ఘన స్వాగతం పలికిన మహారాష్ట్ర ప్రభుత్వం



మనాలీలో మంచు వర్షం కారణంగా స్తంభించిన ట్రాఫిక్ 10

మనాలీలో పర్యాటకుల నరకయాతన

గడ్డకట్టే చలిలో 24 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్

అభిషేక్, సూర్య విధ్వంసం



154 పరుగుల్ని ఊదేసిన భారత్

10 ఓవర్లలోనే మ్యాచ్ ముగింపు

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదుర్స్

మూడో టీ20లో గెలుపు 11

కివీస్‌పై 3-0తో సిరీస్ కైవసం






కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడులో డ్రోన్ కెమెరాలో చిక్కిన పులి, అటవీ శాఖ అధికారులు తెప్పించిన బోను

ఆగని పులి పంజా

- మరో మూడు పశువులు బలి
- హడలెత్తుతున్న కొయ్యలగూడెం ఏజెన్సీ వాసులు
- డిప్పకాయలపాడులోని జొన్నతోటలో పులి తిష్ట
- డ్రోన్‌తో గాలించి పులి జాడ గుర్తింపు
- పట్టుకునేందుకు బోన్లు సిద్ధం చేసిన అటవీ అధికారులు

కొయ్యలగూడెం/ బుట్టాయగూడెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను పెద్ద పు హడలెత్తిస్తోంది. ఐదు రోజుల వ్యవధిలో పది పశువులను చంపింది. తాజాగా.. ఆదివారం తెల్లవారుజామున బుట్టాయగూడెం మండలం రావిగూడెంలో తెల్లం రవి అనే గిరిజనుడికి చెందిన గేదె దూడను చంపేసింది. ఉదయాన్నే రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో పులి అడుగు జాడలను బట్టి గాలించారు. డ్రోన్ కెమెరాతో గాలించారు. డ్రోన్ శబ్దంతో పులి పెద్దగా గాండ్రించడంతో సిబ్బంది, రైతులు పరుగులు తీశారు. డిప్పకాయలపాడులోని ఒక రైతుకు చెందిన మొక్కజొన్న తోటలో తిష్ట వేసి ఉన్నట్టు గుర్తించారు. ఆ తోట చుట్టూ ముళ్లకంచె ఉండటంతో బయటకు వచ్చే అవకాశం లేక అక్కడే ఉంది. ఆదివారం రాత్రి వరకు పులి కదలికలను అధికారులు పరిశీలించారు. తోట చుట్టూ ట్రాప్ కెమెరాలను అమర్చారు. పులిని బంధించేందుకు అధికారులు బోనులను ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, పులిని బోనులో బంధించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిలుక వచ్చేసింది.. క్షేమంగా!

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



కాట్రేనికోన, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'రామ్మా చిలకమ్మా'! అంటూ 'ఆంధ్రజ్యోతి' పిలుపునిచ్చింది. ఫలితంగా తప్పిపోయిన చిలుక చేరవలసిన చోటికి చేరింది! ఇదేం విడ్డూరం అని ఆశ్చర్యపోకండి! అసలు విషయం ఇదీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో బండారు దొరబాబు అనే వ్యక్తి వస్త్ర వ్యాపారం చేస్తుంటారు. ఆయన రూ.80వేలు పెట్టి.. ఆఫ్రికన్ గ్రే ప్యారట్ జాతి చిలుకను కొని ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నారు. స్వగ్రామం కొత్తపాలెంలోని ఇంట్లో పెంచుకుంటున్న ఆ చిలుక పది రోజుల క్రితం ఎగిరిపోయింది. ఆ చిలుక కొత్తపాలెంలోనే మరొకరి ఇంటి వద్ద ఉందన్న సమాచారంతో దొరబాబు అతడిని కలిసి చిలుకను ఇవ్వాలని కోరారు. అతడు ససేమిరా అనడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని ఈ నెల 24న(శనివారం) 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనం వచ్చిన నేపథ్యంలో.. ఆదివారం అయినవిల్లి మండలం మాగాం నుంచి ఓ వ్యక్తి దొరబాబుకు ఫోన్ చేసి.. చిలుక తన వద్ద ఉందని తెలిపాడు. తాను ఒక తాగుబోతు వద్ద నుంచి చిలుకను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నాడు. వేరే వ్యక్తితో చిలుకను పంపి దొరబాబుకు అందించాడు. దీనిపై దొరబాబు స్పందించారు. మీడియా మిత్రులు, సోషల్ మీడియా మిత్రులు కృషి వల్లే చిలుక తన వద్దకు వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తూ.. అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఏడు వాహనాలపై ఏడు కొండలవాడి వైభవం



భానుడి కిరణాల కోసం సూర్యప్రభ వాహనంపై వేచి ఉన్న మలయప్ప స్వామి

- తిరుమలలో ఘనంగా రథసప్తమి వాహన సేవలు
- వరుస సెలవులతో భారీగా తరలివచ్చిన భక్త జనం

తిరుమల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తయిన మలయప్పస్వామి ఏడు ప్రధాన వాహనాలపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించి భక్త కోటిని కటాక్షించారు. శని, ఆదివారంతో పాటు సోమవారం గణతంత్ర దినోత్సవ సెలవు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో కొండకు చేరుకున్నారు. ఆదివారం వేకువజాము 5.30 గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి బయల్దేరి ఆలయ వాయవ్య మూలలోకి వేంచేశారు. 7.10 గంటల తర్వాత హారతి సమర్పించి వాహన సేవను కొనసాగించారు. అనంతరం చిన్న శేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్ర ప్రభ వాహనాలపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. రాత్రి చంద్రప్రభ వాహనం వరకు రద్దీ కొనసాగింది.

రాంభగీచా వద్ద దూసుకొచ్చిన భక్తులు

ఆదివారం వేకువజాము సమయానికే మాడవీధులు భక్తులతో నిండిపోవడంతో ఎక్కడికక్కడ గేట్లు మూసివేశారు. రాంభగీచా గేటు వద్ద భక్తులు లోపలకు వెళ్లేందుకు దూసుకొచ్చారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేసిన సందర్భంలో కొంతమంది భక్తులు కిందపడిపోయారు.



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు



అరసవల్లిలో భక్తుల రద్దీ

అరసవల్లిలో ఘనంగా రథసప్తమి వేడుకలు

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. ఫలితమివ్వని ముందస్తు ఏర్పాట్లు
- పోలీసుల తీరుపై భక్తుల అసహనం

శ్రీకాకుళం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు.. ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అరగంటలోనే స్వామివారి దర్శనం పూర్తిచేస్తామని.. సామాన్య భక్తులకే అత్యంత ప్రాధాన్యమిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధుల ముందస్తు ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. భక్తులను క్యూలైన్లలోకి పంపేందుకు పోలీసులు ఎక్కడికక్కడ రోడ్లపై నియంత్రించడంతో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఏ దర్శనానికి ఏ లైన్లలోకి వెళ్లాలనే సమాచారంలో అస్పష్టత ఏర్పడింది. క్యూలైన్లను నేరుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. సుమారుగా 2 లక్షల మందికిపైగా దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. స్వామివారిని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తదితరులు దర్శించుకున్నారు.

కర్నూలులో



కర్నూలు కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలోని సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య సన్నిధిలో, శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ పర్యవేక్షణలో 2,106 భక్తులతో సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణాలు వైభవంగా కొనసాగాయి. మూలమూర్తికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్య జలాభిషేకం, అరుణ పారాయణ పూర్వకంగా నిర్వహించారు. అరుణ హోమం, సూర్య పంచాతన హోమం మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సప్త వాహనాలపై చెన్నకేశవుడి దర్శనం

మార్కాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా మార్కాపురం జిల్లా మార్కాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్న కేశవస్వామి నాలుగు మాడవీధుల్లో సప్త వాహనాలపై ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల తరహాలో ఇక్కడ జరిగే వేడుకలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తుల రాకతో శ్రీశైల పుర వీధులు కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి క్యూలైన్లలో వేచి ఉన్న సర్వ దర్శనం భక్తులకు దర్శనానికి ఐదు గంటల సమయం పడుతుండగా శీఘ్ర అతిశీఘ్ర దర్శనాలకు మూడు, నాలుగు గంటల సమయం, ఆన్‌లైన్ స్పర్శ దర్శనం భక్తులకు రెండు గంటల సమయం పడుతోంది. హైదరాబాద్ వైపు వచ్చి వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



వాహన సేవలో జస్టిస్ ఎస్వీ భట్టి, జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్టి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హారి, మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. రథసప్తమి సందర్భంగా నిర్వహించిన వాహన సేవల్లోనూ న్యాయమూర్తులు పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

శ్రీబగళాముఖి సేవలో జస్టిస్ హరిహరనాథ్ శర్మ



జస్టిస్ హరిహరనాథ్ శర్మకు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ ఈవో నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవధానం హరిహరనాథ్ శర్మ కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత పేరు ప్రఖ్యాతులు కలిగిన శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తే దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని వీఐపీ విజిటర్స్ డైరీలో ఆయన సూచించారు. జస్టిస్ హరిహరనాథ్ శర్మ దంపతులను ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఘనంగా సత్కరించారు.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ సుజాత



కప్ప స్తంభం వద్ద జస్టిస్ సుజాత

సింహాచలం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు దేవాలయ పర్యవేక్షణాధికారి బి.సత్య శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మ వారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో జస్టిస్ సుజాతను సత్కరించి స్వామివారి చిత్ర పటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఇప్పుడు గవర్నర్లే ప్రతిపక్షం!

- అసెంబ్లీ నుంచి వాకౌట్లు చేస్తున్నారు
- న్యాయవ్యవస్థతో రాజ్యాంగానికి ముప్పు
- నియోజకవర్గాల పునర్విభజనతో ఉత్తరాదిన పెరిగే సీట్లు 158
- దక్షిణ భారతంలో పెరిగేది 24 స్థానాలే
- సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వెల్లడి

విజయవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యవస్థలో భాగంగా ఉన్న గవర్నర్లే ఇప్పుడు శాసనసభల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆక్షేపించారు. సాధారణంగా గవర్నర్లు ప్రసంగాలు చేసేటప్పుడు ప్రతిపక్షాలు వాకౌట్, నిరసన తెలపడం చేస్తాయని.. నేడు వాటిని గవర్నర్లే చేసి చూపిస్తున్నారని విమర్శించారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ), ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'భారత రాజ్యాంగం-సవాళ్లు' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జేవీవీ ప్రచురించిన 'భారత రాజ్యాంగం-ముఖ్యాంశాలు' పుస్తకాన్ని ఆయన, 'రాజ్యాంగ నిర్మాణం-పీఠిక' పుస్తకాన్ని జేవీవీ వ్యవస్థాపకుడు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే దానికి రకరకాల సవాళ్లు విసురుతున్నాయన్నాయని, వీటిలో న్యాయ వ్యవస్థ కూడా ఉందన్నారు. 'ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో గవర్నర్ ఏమీ చదవకుండా వాకౌట్ చేశారు. కర్ణాటక గవర్నర్ ప్రసంగంలోని మొదటి వాక్యం, చివరి వాక్యం చదివి వెళ్లిపోయారు. కేరళ గవర్నర్ ఏకంగా తాను రాసుకున్నదే చదువుతానని చెప్పారు. రాజ్యాంగాన్ని పది రెట్లు పెంచినా, తగ్గించినా.. పాలనా విధానాల ద్వారానే దాని మౌలిక స్వరూపం పూర్తిగా ధ్వంసమవుతుందని అంబేడ్కర్ ఆనాడే చెప్పారు. ఇప్పుడదే జరుగుతోంది' అని తెలిపారు. తమిళనాడులోని మదురైలో దీపం వివాదాన్నీ ప్రస్తావించారు. పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం ఏ బిల్లు ప్రవేశపెడుతుందో చివరి క్షణం వరకు ఎంపీలకు తెలియడం లేదన్నారు. ఎజెండాలో లేని అంశాలను స్పీకర్ అనుమతితో సప్లిమెంటరీ అంశంగా ప్రవేశపెడుతున్నారని.. ఈవిధంగానే 'వీబీ:జీరామ్‌జీ' బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. ఇలాంటి విధానాలతో సమాఖ్య వ్యవస్థకు ప్రమాదమని హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ఎవరికోసమని మాజీ న్యాయమూర్తి నిలదీశారు. నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్‌కు కూడా నోటీసులివ్వడాన్ని ప్రశ్నించారు. కేంద్రం చేయబోతున్న పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ మేలు జరుగుతుందని తెలిపారు. 'కేంద్రం లోక్‌సభ నియోజకవర్గాలను 821 స్థానాలకు పెంచబోతోంది. యూపీలో ఇప్పుడున్న 80 స్థానాలు 2031లో 137కి పెరుగుతాయి. ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న 204 స్థానాలు 362కి చేరతాయి. అంటే 158 సీట్లు పెరుగుతాయి. అదే దక్షిణాదిన 153కు పెరుగుతాయి. ఇక్కడ పెరుగుదల 24 స్థానాలే' అని తెలిపారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిషన్ ఏర్పడినప్పుడు.. హిందీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, బిహార్, యూపీ రాష్ట్రాలు కొత్త సమస్యను సృష్టిస్తాయని అంబేడ్కర్ చెప్పారని అన్నారు. ఒక్క ఓటు తేడాతోనే హిందీ అధికార భాష అయిందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, కార్యదర్శి నల్లూరి మాధవరావు, విట్ న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ చక్కా బెనర్జీ, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం వివిధ అంశాలపై ప్రసంగించారు.



ఆదివారం విజయవాడ సభలో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి. వేదికపై ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు, ఐలూ కార్యదర్శి నల్లూరి మాధవరావు తదితరులు



'ఏ గ్లింప్స్ ఇన్ టు ది క్రిమినల్ మేజర్ యాక్ట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ వెంకటేశ్వర్లు, న్యాయాధికారులు

24వేల క్రిమినల్ తీర్పులతో పుస్తకం అభినందనీయం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు నిమ్మగడ్డ
- 'ఎ గ్లింప్స్ ఇన్ టు ది క్రిమినల్ మేజర్ యాక్ట్స్' పుస్తకావిష్కరణ
- న్యాయాధికారి రాజావెంకటాద్రికి ప్రశంస

ఒంగోలు(రూరల్), జనవరి 25(ఆంధ్రజ్యోతి): 24 వేల క్రిమినల్ తీర్పులను పుస్తక రూపంలో పొందుపరచడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు నిమ్మగడ్డ అన్నారు. ప్రకాశం జిల్లా అదనపు న్యాయాధికారి టి. రాజా వెంకటాద్రి రచించిన 'ఎ గ్లింప్స్ ఇన్ టు ది క్రిమినల్ మేజర్ యాక్ట్స్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరు వద్ద ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ న్యాయవిద్య అభ్యసించే విద్యార్థులు, లాయర్లు, న్యాయమూర్తులు ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదవాలని సూచించారు. న్యాయాధికారిగా రాజావెంకటాద్రికి 30 ఏళ్ల అనుభవం ఉందని, తన అనుభవాలను, దేశంలోని కోర్టులు ఇచ్చిన క్రిమినల్ తీర్పులను అధ్యయనం చేసి 24 వేల తీర్పులను ఒక పుస్తకం రూపంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఇది ఎంతో కష్టతరమైన, ఖర్చుతో కూడిన పని అని తెలిపారు. పుస్తక రచయిత, జిల్లా అదనపు న్యాయాధికారి రాజావెంకటాద్రి మాట్లాడుతూ ఈ పుస్తక రచనకు ఆరేళ్ల ఒక నెల సమయం పట్టిందని చెప్పారు. కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇలాంటి పుస్తకం రాయగలిగానని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి టి.రాజ్యలక్ష్మి, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, న్యాయకళాశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్స్‌పాల్ కె.నటరాజకుమార్ పాల్గొన్నారు.



పార్వతీపురం కలెక్టరేట్‌లోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో అర్జీదారుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

రాష్ట్రవ్యాప్తంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ఏర్పాటు

- ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటాం: జస్టిస్ మానవేంద్రనాథ్
- పార్వతీపురం జిల్లా కలెక్టరేట్‌లో ప్రారంభం

పార్వతీపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వంతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటామని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ పేర్కొన్నారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై పలువురు అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలని న్యాయసేవా సహాయకులకు ఆదేశించారు. అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ.. 'పార్వతీపురం మన్యం జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమం చేపట్టిన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అభినందనీయులు. లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్ కేసులను రాజీ చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు. కాగా, రథసప్తమి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం పార్వతీపురం శివారులో ఉన్న సూర్యపీఠంలో జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదిత్యునికి పట్టు వస్త్రాలు అందించి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

సన్మార్గంతోనే లోకకల్యాణం

- కడప ఇస్తేమాలో ధార్మిక పండితుల స్పష్టీకరణ

కడప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శాంతి, సహనం, ఓర్పుల మేళవింపుతో కూడిన సన్మార్గమే లోకకల్యాణానికి నాంది పలుకుతుందని ఢిల్లీ నిజాముద్దీన్ మర్కస్ జాతీయ ధార్మిక పండితుడు మౌలానా యూసుఫ్ సార్ద్ కాందలవి పేర్కొన్నారు. కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లో తబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయస్థాయి ఇస్తేమా ఆదివారం ముగిసింది. చివరి రోజు ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంగణం కిటకిటలాడింది. ఇస్తేమాకు 5లక్షలకుపైగా జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాజ ఐక్యత, దేశ శాంతి, యువత సన్మార్గం, మహిళల గౌరవ పరిరక్షణ కోసం గంటసేపు సామూహిక ప్రార్థన నిర్వహించారు. 60 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు.



మహారాష్ట్రలోని నాందేడ్ గురుద్వారాలో కానుకలు సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

త్యాగంతో ధర్మపరిరక్షణ సాధ్యం

గురుతేజ్ బహదూర్ సింగ్ త్యాగం స్ఫూర్తిదాయకం.. 350వ షహీదీ సమాగమంలో పవన్ కల్యాణ్ ప్రార్థనలు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తల్వార్‌తోనే కాదు త్యాగంతోనూ ధర్మ పరిరక్షణ సాధ్యమని చాటిన మహనీయుడు గురుతేజ్ బహదూర్ సింగ్ అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనియాడారు. తనది కాని ధర్మం కోసం శిరస్సును త్యాగం చేసిన మహనీయుడని, ఆయన త్యాగం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురుతేజ్ బహదూర్ సింగ్ 350వ షహీదీ సమాగమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో కలిసి సచ్‌ఖండ్ గురుద్వారాను సందర్శించారు. సిక్కుల 10వ మత గురువు గురుగోవింద్ సింగ్ సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చాదర్‌ను సమర్పించి నమస్కరించారు. గురుద్వారా ఎదుట నిషాన్ సాహిబ్ వద్ద ఏర్పాటు చేసిన ధ్వజానికి మొక్కారు. వీరికి గురుద్వారా చైర్మన్ డాక్టర్ విజయ్ సత్వార్ సింగ్ ఆధ్వర్యంలో సాదరంగా స్వాగతం పలికారు. గురుద్వారా గ్రంథీలు పవిత్ర వస్త్రాన్ని వేసి వీరిని ఆశీర్వదించారు. గురుద్వారా జ్ఞాపికను, సిక్కులు ధరించే పవిత్ర ఆయుధం కిర్పాన్‌ను బహూకరించారు. దర్శనం అనంతరం ఫడణవీస్‌తో కలిసి గురుద్వారా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ డొనేషన్ మెషీన్‌ను పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ షహీదీ సమాగమంలో పాల్గొనడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నాందేడ్‌లో పవన్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలికింది. ఆ రాష్ట్ర మాజీ సీఎం, రాజ్యసభ సభ్యుడు అశోక్ చవాన్, ఎమ్మెల్యే రాజార్ కర్, కలెక్టర్ రాహుల్ ఖర్డలే ఘన స్వాగతం పలికారు.




నాందేడ్ గురుద్వారాలోకి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో కలిసి వెళ్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పవన్‌కు కృపాణాన్ని బహూకరిస్తున్న దృశ్యం

1.11 కోట్ల మంది చిన్నారులకు ఆల్బెండజోల్

» నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీకి ఆరోగ్యశాఖ ఏర్పాట్లు

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణకు రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇవ్వాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 17న మాత్రల పంపిణీ చేస్తామన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు ఉన్న 1,11,63,762 మందికి ఈ మాత్రలు ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లలు రాష్ట్రంలో 23 లక్షల మంది ఉన్నారని, మిగిలిన వారు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారని వివరించారు. మహిళా, శిశు సంక్షేమ, ఇతర శాఖల సమన్వయంతో వీరందరికీ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆల్బెండజోల్ మాత్రల వాడడం వల్ల చిన్నారుల్లో రక్తహీనత అదుపులోనికి వస్తోందని, ఇతర ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. మాత్రల పంపిణీపై ఇప్పటికే ఎఎన్‌ఎం, ఆశా, అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ప్రతి ఏడాది రెండు సార్లు ఈ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యుటీఎఫ్ నాయకులు

ఊరి బడిని కాపాడుకుందాం

» బడి అంటే నాలుగు గోడలు, పరీక్షలు, ర్యాంకులే కాదు

» పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాం

» యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు భరోసా

విజయవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బడి ఈడు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కృషి చేయాలని యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడలోని యుటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, బడి అంటే ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాలుగు గోడలు, సిలబస్, పరీక్షలు, ర్యాంకులు మాత్రమే కాదని చుట్టూ సమాజం కూడా ఉంటుందని అన్నారు. సమాజ అవసరాలను తీర్చగలిగే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నేర్పాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, దేశభక్తి, సమానత్వ భావన అలవడతాయని చెప్పారు. ఫిబ్రవరి 1, 8 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం చొరవ చూపకపోతే రానున్న ఐదేళ్లలో పాఠశాలల సంఖ్య మరింత తగ్గే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

టీటీడీ జేఈవోగా శరత్ బాధ్యతల స్వీకరణ



బీఆర్ నాయుడికి పుష్పగుచ్ఛమిస్తున్న శరత్

తిరుమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ జేఈవోగా నియమితులైన శరత్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇన్‌స్టాలో పరిచయమైన యువతిపై అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడు మాయ మాటలుచెప్పి... దళిత యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది.పోలీసుల కథనం మేరకు...కడప జిల్లా బద్వేలుకు చెందిన వీర యశ్వంత్ (21) చిత్తూరులో బీటెక్ చదువుతున్నాడు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన 19 సంవత్సరాల యువతితో ఇన్‌స్టాగ్రామ్‌లో అతనికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది.ఈ నేపథ్యంలో 21న తిరుపతికి వచ్చిన యశ్వంత్ హోటల్లో దిగి యువతిని ఆహ్వానించాడు.ఆమె రాగా మద్యం సేవించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అలిపిరి పోలీసులు కేసు నమోదుచేసి హోటల్ గదిలో ఆధారాలు సేకరించారు. అలాగే యువతికి రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.



కాలమే వసంతాలను వాగ్దానం చేస్తుంది

సూర్యోదయం..
ఓ ప్రాకృతిక ప్రసవ వేదన
సూర్యాస్తమయం..
రేపటి ఉదయానికై పరితపించే శోధన

ఉదయాస్తమయాల లీలలు
జ్వలనాజ్వలన దగ్ధకేళీ కీలలు
కాలగతుల కల్లోల చలనాలన్నీ
కార్యకారక సంబంధ బింబ ప్రతిబింబాలు

చీకటికి చిందులాటల తొందరెక్కువ
వెలుగును మింగానని తెగ రంకెలేస్తుంటది

నిశాంత సంకేత స్థలి సాక్షిగా
తిమిరం కడుపుని చీల్చిన కిరణాల కథను
ఎప్పటికప్పుడు వర్తమానం
కొత్తగా చెబుతుంది

ఆకురాలు కాలం అశాశ్వతమే
కాలమే వసంతాలను వాగ్దానం చేస్తుంది
కొంత నీరు.. కొంత నిప్పు తోడవ్వాలి

రాయి రాయి రాసుకునే రాపిడిలోని
నిప్పును కప్పి ఉంచిన ప్రకృతే
రాలిపడిన గింజల్లో రాతిగోడల్ని
చీల్చుకొని మొలకెత్తే
జీవ లక్షణాన్ని దాచి ఉంచింది

నదికి నడవడమొక్కటే తెలుసు
నేరుగానో.. లేదంటే
అడ్డంకులను అధిగమిస్తూ అటూఇటుగానో

ఎంత పరుగులెత్తే నదైనా
అనివార్యతల ఆనకట్టలు ఎదురైనప్పుడు
గతిని శృతి చేసుకోవాలి
గమనానంతర గాయాలకు విశ్రాంతినివ్వాలి

వరద భీకర రౌద్రై ఎదురెక్కినప్పుడు
బంధించిన తలుపులు
బార్లా తెరుచుకుంటాయి
రువ్వడి రువ్వడిగా పరవళ్ళు తొక్కిన నది
బీడు భూములను
బీజ భూములుగా మార్చుతుంది

అలలు ఎగిసిపడలేక అలసిపోతుంటే
కలలుకనే కనులు కలత నిదురలో జోగుతుంటే
నవవసంతాలు నయాగరా జలపాతాలై
తుళ్ళి పడుతుంటే
రుతువులన్నీ ఘనీభవించిన స్మృతులవుతుంటే

లిప్తపాటు సమయం
సంయమన రాగమాలాపించాలి

గాయపడి నెత్తురోడిన కాలం
వేల బాహువులతో వేడుకోలు పలికే
ఏడవ రుతువు కోసం ఎదురు చూడాలి

■ గాజోజు నాగభూషణం
✆ 98854 62052



ఏది ఉత్తమ చారిత్రక నవల?

కొన్ని సంవత్సరాల క్రితం ఓ పాత పుస్తకాల షాపులో కురుతలైన్ హైదర్ అనే రచయిత్రి ఉర్దూలో రాసిన 'ఆగ్ కా దర్యా' అనే నవల తెలుగు అనువాదం 'అగ్నిధార' చదువుతుంటే ఆ పుస్తకంలో మార్జిన్స్‌లో ఒకచోట కనిపించిన మాట "Retrospective falsification". గతాన్ని తలుచుకొని వగచడం అని అనుకోవచ్చు దాని అర్థం. తెలుగులో చారిత్రక నవల గురించి ఆలోచించినప్పుడు నాకు ఇదే మాట గుర్తు వస్తుంది.

అసలు చారిత్రక నవల అంటే ఏంటి? దాని అవసరం ఏంటి? అని ఒక చరిత్ర విద్యార్థిగా నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు– చరిత్ర అంటే మానవాళి చేసిన ఓ గొప్ప ప్రయాణం తాలుకూ కథ అనిపిస్తుంది. దానిని తెలుసుకోవడానికి అకడమిక్ చరిత్ర పుస్తకాలు ఇబ్బడిముబ్బడిగా దొరుకుతాయి. కానీ, చరిత్ర పుస్తకాలతో వచ్చిన సమస్య ఏంటంటే అవన్నీ సంవత్సరాలు, తేదీలు, సంఘటనలుగా విభజించబడిన ఒక బోరింగ్ సబ్జెక్టుగా కనిపిస్తుంది. అలాంటప్పుడు సామాన్య జనాలకి లేదా పాఠకులకి చరిత్ర మీద ఆసక్తి కలిగించడానికి చారిత్రక నవలలు, సినిమాలు చాలా ఉపయోగపడతాయి. అయితే ఈ సందర్భంలో సినిమాలని పక్కనపెట్టి నవలల గురించి మాట్లాడుకుంటే తెలుగులో చారిత్రక నవల అనగానే మొదటగా అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, ముదిగొండ శివప్రసాద్ పేర్లు గుర్తొస్తాయి. అయితే వీళ్ళందరి రచనల్లోనూ ఉండే ఒక లక్షణం– గతకాలపు వైభవాన్ని, మనం కోల్పోయిన గొప్ప జీవితాన్ని మనకు అంటే పాఠకులకు ఒక విధంగా చూపిస్తూ పాఠకులకు కొంత ఖైమరపునూ, "అయ్యో, ఆ కాలంలో మనం లేకపోయామే" అన్న బెంగనూ కలిగించే విధంగా ఉంటాయి. చరిత్ర మీద ఆసక్తి కలిగించడానికి ఈ తరహా నవలలు మొదట్లో కొంత ఉపయోగపడ్డా, ఇవే చరిత్ర అనుకొని పొరబడే ప్రమాదం కూడా ఉంది. గోనగన్నారెడ్డి గజదొంగగా మారి రుద్రమదేవికి సాయం చేశాడని నేను చాలాకాలం నమ్మాను. అది అడివి బాపిరాజు గారి చమత్కారం అని తర్వాత తెలిసింది. ఒకనాటి తెలుగు పాఠకులందరికీ గుర్తు ఉన్న చారిత్రక నవల తెన్నేటి సూరి 'చంఘిజ్‌ఖాన్'. ఆ నవల ఆంధ్ర పత్రికలో సీరియల్‌గా వస్తున్నప్పుడు, ఎవరో పాఠకులు అడిగారట "నువ్వు చంఘీజ్ ఖాన్ కథ రాస్తున్నావా? లేదా వారం వారం ఈ దేశంలో జరిగే రాజకీయాలు రాస్తున్నావా?" అని. మంగోలియా ప్రజలకు తెలుగువారి జీవన విధానం గురించి ఏమీ తెలిసి ఉండకపోవచ్చు గానీ తెలుగు పాఠకులకి మధ్యయుగాల నాటి మంగోల్ ప్రజల జీవన విధానం గురించి చాలా బాగా తెలుసు అంటే అది తెన్నేటి సూరి గొప్పతనం అనే చెప్పుకోవాలి.

ఈ మధ్య వేరే భాషలకి చెందిన కొన్ని విశిష్టమైన చారిత్రక నవలల తెలుగు అనువాదాలు చదివాను. వాటిలో ముఖ్యమైనవి మరాఠీలో శరణ్ కుమార్ లింబాలే రాసిన 'సనాతన్', కన్నడలో వసుధేంద్ర 'తేజో తుంగభద్ర', తమిళంలో జయమోహన్ 'వెళ్లయానై (తెల్ల ఏనుగు)', రా. ముత్తునాగు 'సులుంతీ' నవలలు. వీటిలో 'సనాతన్' నవల మహారాష్ట్ర ప్రాంతంలో జరిగిన చరిత్రాత్మక బీమా కోరేగావ్ యుద్ధానికి ముందు ప్రారంభమై, స్వాతంత్ర్యోద్యమం వరకూ నడుస్తుంది. 'తేజో తుంగభద్ర' విజయనగర సామ్రాజ్య కాలంలో భారత, యూరోప్ దేశాలను కలిపిన వ్యాపారం నేపథ్యంగా నడుస్తుంది. జయమోహన్ 'తెల్ల ఏనుగు' నవల మద్రాస్ నగరం నేపథ్యంలో, 1870లలో బెంగాల్ నుంచి మద్రాస్ వరకూ వ్యాపించిన భయంకరమైన కరువుని కళ్ళకి కట్టినట్టుగా చూపిస్తుంది. రా. ముత్తునాగు 'సులుంతీ' నవల 17వ శతాబ్దంలో మధురై నాయకరాజుల పాలనలో అక్కడ తలెత్తిన రాజకీయ పరిణామాలను చూపిస్తూ, మాధవుడు అనే ఓ మంగలి ప్రధాన పాత్రగా నడిచే కథ.

ఈ కథ వస్తుపరంగానూ, రచనాపరంగానూ ఎంతో విశిష్టమైనది. వీటన్నింటిలోనూ పాఠకుడు తనని తాను చూసుకుంటాడు. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు కాస్త మంచి కాలంలోనే బతుకున్నాం అనే ఓ అవగాహన కలుగుతుంది.

> చారిత్రక నవలా రచన అనేది అంత సులువైన పని కాదు. నిశిత చరిత్ర పరిశోధనతో పాటూ అద్భుతమైన కాల్పనిక శక్తి కూడా ఉండాలి. ప్రస్తుతం తెలుగులో చరిత్ర ఆధారంగా వస్తున్న రచనలు చాలా తక్కువ. దాదాపు లేవనే చెప్పాలి. అప్పుడప్పుడూ బండి నారాయణస్వామి లాంటివారు ఆశ కలిగిస్తూ ఉంటారు.

ఆ కోవకి చెందిన నవలలు తెలుగులో ఉన్నాయా? అని వెతికితే, నాకు వెంటనే గుర్తు వచ్చేది, బండి నారాయణస్వామిగారి 'శప్తభూమి' నవల. పద్దెనిమిదవ శతాబ్దపు రాయలసీమ చరిత్రనూ ప్రజల సుఖదుఃఖాలనూ కళ్ళకు కట్టినట్టు చూపించిన నవల అది. నవల చివరిలో కథానాయకుడు బిల్లే ఎల్లప్ప చేసే ప్రాణత్యాగాన్ని పాఠకులు అంత సులభంగా మర్చిపోలేరు. ఈ నవలను పాఠకులు కూడా ఎంతో ఆదరించారు. మళ్ళీ అదే రచయిత నుంచి చరిత్రలో మరికొంత వెనక్కి వెళ్ళి రాసిన నవల 'కడపటి యుద్ధం'. విజయనగర సామ్రాజ్య పతనానికి కారణమైన 'కడపటి యుద్ధం', చరిత్రలో 'తళ్ళికోట యుద్ధం'గా, 'రక్కసి తంగడి యుద్ధం'గా పేర్కొన్న యుద్ధం. యుద్ధానికి ముందు విజయనగర పట్టణం లోపల, ఆ కాలపు అంతఃపురాల నేపథ్యంగానే కాక, పంచమవాడలు, వేశ్యావాటికలు, వర్తకబజారులు, రాజులు, బంటులు, బానిసలు సానులు, వ్యాపారులు ప్రధాన పాత్రలుగా ఎంతో ఆసక్తికరంగా ఆరువందల పేజీల నిడివితో రచయిత మనల్ని చెయ్యి పట్టుకొని తనవెంట ఆ కాలానికి తీసుకుపోతారు.

ఇలాంటివే తెలుగులో మరికొన్ని రచనలను ఉదహరించుకోవచ్చు. పండరంగని అద్దంకి శాసనం ఆధారంగా కరణం బాలసుబ్రమణ్యం పిళ్ళై రాసిన 'బోయకొట్టములు పండ్రెండు' మంచి చారిత్రక నవల. చాళుక్యుల, పల్లవుల రాజకీయాల మధ్య ఒక చిన్న రాజ్యం ఎలా నలిగిపోయింది, అసలు ఒక రాజ్యం ఎలా పుడుతుంది, దాని నిర్మాణం ఎలా జరుగుతుంది, అభివృద్ధి ఎలా జరుగుతుంది, అలాగే ఎలా పతనం అవుతుందనే అంశాలను ఈ నవలలో రచయిత ఎంతో నేర్పుతో వివరిస్తారు.

చారిత్రక కథల సంకలనాలు తెలుగులో అరుదు. ప్రస్తుత కాలంలో తెలుగులో చారిత్రక కాల్పనిక రచనకి ఎంతో కృషి చేస్తున్న రచయిత సాయి పాపినేని. ఆయన రాసిన 'ఆంధ్రపథం' తెలుగువారి అందరి ఇళ్లలోనూ ఉండదగ్గ పుస్తకం. నేటి తరం యువతకి అసలు ఒక జాతిగా తెలుగువారి మూలాలను బృహత్శిలాయుగం (megalithic period) నుంచి 1953లో తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేవరకూ రకరకాల కాలాలలో, దాదాపుగా ప్రాంతానికి ఒక కథ చొప్పున రాసిన అద్భుతమైన రచన ఇది.

ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, ఏది ఉత్తమ చారిత్రక నవల?

చాలామంది 'హిస్టారికల్ ఫిక్షన్' అనే దానిని విరోధాభాస (paradox) అంటారు. అంటే, చరిత్రే ఓ కల్పన, మళ్ళీ చరిత్ర ఆధారిత కాల్పనిక నవలా? అని. "Re constructing the past with the scientific methods" అనేది చరిత్ర అనేదానికి అకడమిక్ స్కాలర్స్ ఇచ్చే నిర్వచనం.

ఉత్తమ చారిత్రక నవల అనే దానికి నిదర్శనంగా నాకు అనిపించింది ఏంటంటే– గతకాలపు వైభవాన్ని, గతచరిత్రను పాఠకులకి తెలియజేయడంతో పాటూ, మొత్తం మానవ సమాజంగా ఎన్ని అవాంతరాలను దాటుకొని నేడు మనం ఈ స్థితికి చేరుకున్నాం అని తెలియజేసేది. తనకు తెలియని కాలంలో తనకు సంబంధం లేని మనుషుల మధ్య జరిగిన కథగా కాకుండా, కాలం ఏదైనా జరుగుతున్నది తన కథగానే పాఠకుడు భావించాలి. కథలో తనని తాను చూసుకోగలగాలి. ఎందుకంటే మనుషులు అందరినీ సమానం చేసేవి ఎమోషన్స్, అవి ప్రాంతాలకు కాలాలకు అతీతం. అయితే చారిత్రక నవలా రచన అనేది అంత సులువైన పని కాదు. నిశిత చరిత్ర పరిశోధనతో పాటూ అద్భుతమైన కాల్పనిక శక్తి కూడా ఉండాలి. ప్రస్తుతం తెలుగులో చరిత్ర ఆధారంగా వస్తున్న రచనలు చాలా తక్కువ. దాదాపు లేవనే చెప్పాలి. అప్పుడప్పుడూ బండి నారాయణస్వామి లాంటివారు ఆశ కలిగిస్తూ ఉంటారు. ఆయన లాంటి మరింత మంది రచయితలు, మరిన్ని రచనలు రావాల్సిన అవసరం తెలుగు సాహిత్యానికి, సమాజానికీ ఉంది.

■ ప్రసాద్ సూరి
✆ 91336 08072

మఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కారం

మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార (2026) ప్రదాన సభ ప్రభుత్వ సిటీ కళాశాల (హైదరాబాద్) గ్రేట్ హాల్‌లో జనవరి 27 ఉ.10.30గంటలకు జరుగుతుంది. పురస్కారాన్ని అఫ్సర్ స్వీకరిస్తారు. అధ్యక్షత కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విప్లవ్ దత్ శుక్ల, ముఖ్య అతిథి గోరటి వెంకన్న, అతిథులు కవి యాకూబ్, వేణు ఊడుగుల, కె. ఆనందాచారి, పి. శాంతి. సమన్వయకర్తలు కోయి కోటేశ్వరరావు, జె నీరజ.

మఖ్దూమ్ అవార్డు కమిటి

'అహానికి ఆవల' కథా సంపుటి

జి. ఉమామహేశ్వర్ కథా సంపుటి 'అహానికి ఆవల' పరిచయ సభ ఫిబ్రవరి 1 ఉ.10.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో ఉంటుంది. దాసరి అమరేంద్ర, కె.పి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొంటారు.

పాలపిట్ట బుక్స్

వెన్నెల సాహితీ పురస్కారం

పై కోసం 2024, 2025 సంవత్సరాల్లో ప్రచురించిన కవితా సంపుటాలు 4 ప్రతులు ఫిబ్రవరి 28లోపు చిరునామా: పర్కపెల్లి యాదగిరి, ఇం. నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, సిద్ధిపేట-502375, ఫోన్: 92999 09516కు పంపాలి.

పర్కపెల్లి యాదగిరి

సోమవారం 26 జనవరి 2026

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

గ్రంథాలయ ఉద్యమ బస్సు యాత్ర


మరో గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నుండి అమరావతి వరకు బస్సు యాత్ర జరుగుతుంది. ఫిబ్రవరి 1న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ వద్ద నుంచి ప్రారంభమయ్యే యాత్రలో మీరు పాల్గొని మరో గ్రంథాలయ ఉద్యమం అభివృద్ధిలో భాగస్వాములు కండి. వివరాలకు: కవి యాకూబ్: 98491 56588, మంచికంటి: 99495 35695.

మంచికంటి

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు

'రావి రంగారావు సాహిత్య పీఠం' నిర్వహిస్తున్న జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు (2025)కు ఎంపికైన రచనలు ఇళ్ల మురళీధరరావు పద్య సంపుటి 'శతకాలు', నాగజ్యోతిశేఖర్ కవితా సంపుటి 'చిగురించే పేజీలు', రాధేయ కవితా సంపుటి 'పావుకోళ్ళు', కుందుర్తి కవిత కవితా సంపుటి 'జస్ట్ ఏ హౌస్ వైఫ్'. ఫిబ్రవరి 5 సా.6గంటలకు గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదిక మీద ఎంపికైన వారికి రూ.3 వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది.

నర్రా ప్రభావతి



కవిత్వానికి కొత్త జోళ్లు!

'నా పాఠకుడు మూడో తరగతి విద్యార్థి' అని నిగర్వంగా ప్రకటిస్తారు ఎండ్లూరి సుధాకర్. అవును, చిన్న పదాలతో సరళమైన వాక్య నిర్మాణం వారిది. మెత్తని పదాలతో గట్టి భావాన్ని పలికించగల దిట్టకవి. ఆయన కవిత్వంలో తన జాతి పట్ల ప్రేమ ఉంటుంది. సమాజంలో అనాదిగా వేళ్ళునుకున్న అంటరానితనం, అసమానతల పట్ల వేదన ఉంటుంది.

'కొత్తగబ్బిలం' కవిత్వ సంపుటిలో ఎండ్లూరి తన ఆలోచనలకు, సంఘటనాత్మక పరిశీలనలకు కవితాత్మక సొబగులద్ది జాషువా గబ్బిలాన్ని కొత్తగా ముస్తాబు చేసి రాజమండ్రి నుంచి హైదరాబాద్ దాకా ప్రయాణం చేయిస్తారు. తెల్లని ట్యూబ్‌లైట్ గదిలోకి నల్లబ్యాడ్జీతో వచ్చిన కుర్ర గబ్బిలాయి కన్నుల్లో కవికోకిల వారసత్వాన్ని పసిగట్టిన ఈ కవి, గబ్బిలాన్ని ప్రేమగా వాటేసుకొని, దాని గొడుగు రెక్కలు సవరించి తన గుండె గోడు వినిపిస్తారు. దాని మదిని మొత్తం దళిత జాతి చైతన్యంతో నింపి ఆకసానికి ఎగరేస్తారు.

ఈ పుస్తకంలో 'కొత్త గబ్బిలం – కొంత నేపథ్యం' అని రాసిన తన మాటలో రచనకు దారి తీసిన పరిణామాల గురించి చెప్పుకొచ్చారు. 1995 సెప్టెంబర్ 28 నుంచి ఆ సంవత్సరం అంతా దేశవ్యాప్తంగా మహాకవి గుర్రం జాషువా శత జయంతులు జరిగాయి. ఆ శతజయంతి సందర్భంగా వినుకొండకు ప్రత్యేక ఆహ్వానాన్ని అందుకొని 37 చోట్ల ప్రధాన వక్తగా ఉపన్యసించారు ఎండ్లూరి సుధాకర్. జాషువా పుట్టి పెరిగిన చాట్రగడ్డపాడును, జాషువా తల్లిదండ్రుల బంధువులను, జాషువా 'నా కథ'లో వర్ణించిన వాతావరణాన్ని చూశారు. జాషువా మునిమనవళ్ళ రూపాలలో జాషువా ప్రతిబింబాన్ని పసిగట్టే ప్రయత్నం చేశారు. అప్పుడే వారిలో 'కొత్తగబ్బిలం' ఆలోచన అంకురించింది. గబ్బిలాన్ని తలుచుకొని మనసులో దీపం ముట్టించారు.

1990లో ఉద్యోగం కోసం ఇద్దరు కూతుళ్ళతో హైదరాబాద్‌ను వదిలి రాజమండ్రి వెళ్లారు సుధాకర్. వెళ్లిన కొత్తలో ఇంటి కోసం వెదికేటప్పుడు "మీరేవుట్లు?" అని అడిగేవారట. కులం అన్ని రంగాల్లో మన అస్తిత్వాన్ని నిర్ధారిస్తుందని, దానికి ఎవరూ అతీతులు కారని చెప్తూ 'కొత్త గబ్బిలం'లో "నా విన్నవి, నేను కన్నవి, నాకున్నవి కవితాత్మకంగా వివరించే ప్రయత్నం చేశాను" అంటారు.

"తండ్రీ! ఇది రాజమండ్రి/ కులం కలుగులోంచి బయటకురాని ఎండ్రి/ ఇక్కడి గోదావరి వేదంలా కాదు../ పచ్చి అవకాశవాదంలా/ సలసల కాగిన సీసంలా/ దళితుల చెవుల్లో ప్రవహిస్తుంది./ ఇక్కడ నీళ్లలో రకరకాల జల గుణాలున్నాయి/ ఈ రక్తంలో శతాబ్దాల మను కణాలున్నాయి" – ఇంత పదునైన కవిత్వం ఊరికే ఎవరూ రాయలేరు. ఎంతో లోతైన గాయాలు గుండెలో ముల్లులా గుచ్చుకుంటే తప్ప. అవమానాల్ని, అసమానతలని ఎదుర్కొని గాయపడిన నిషేధ మానవుని ఘోష ఇది. అట్టడుగుజాతుల బాధల్ని, గాథల్ని గుర్తించి ప్రశ్నించడంలో కవి సఫలీకృతుడయ్యాడు.

పాఠకులదెప్పుడూ రసదృష్టి, కవులది ఎప్పుడూ రససృష్టి అంటారు. 'కొత్త గబ్బిలం'లో ఎన్నో భాషా విశేషాలు, సంఘటనాత్మక సన్నివేశాలు ఉన్నాయి.

"ఈ దేశం చెప్పును మింగేసింది/ ఈ దేశం డప్పును కోసేసింది/ ఇప్పుడు తిరగబడిన చెప్పులు జండాలై పైకి లేచాయి/ కవిత్వం నా కులవృత్తిలోని/ చర్మ తత్వ రహస్యం/ గబ్బిలమా!/ నీ పాదాలకు నా కవిత్వపు/ కొత్తజోళ్ళు తొడుగుతున్నాను/ ఇవి కన్నీళ్ళతో కుట్టిన నా గుండె జోళ్ళు/ కళంకిత అలంకారాలు"

– సమాజంలో మనుషులందరూ మనుషులుగానే చూడబడాలని, కుల మత వర్గ లింగ వైషమ్యాలు తొలగిపోవాలని ఆకాంక్షిస్తూ పేదవాడి ముఖంలో సంతృప్తి కోసం కలవరించి, పలవరించారు ఎండ్లూరి సుధాకర్. 'కొత్తగబ్బిలం'లోని ప్రతి వాక్యం బరువుగానే ఉంటుంది. తన ఆగ్రహాన్ని, ఆవేదనను, దగ్ధ దళిత ఆక్రోశాన్ని గుండె లోపల నుంచి ఆవిష్కరిస్తున్నట్లే ఉంటుంది. గౌతముడి జీవన సూత్రాలను, అంబేద్కర్ తాత్వికతను ఆకళింపు చేసుకున్న వైనం ఈ కవిత్వంలో కనబడుతుంది.

"గబ్బిలమా! నా మనోబలమా!/ నువ్వు ఈ దేశ శ్వేతపత్రం మీద నల్లసంతకానివి/ తిరుగు ప్రయాణంలో/ మరొక్కమారు రహస్యంగా/ తథాగతున్ని కలిసిరా../ నా కలల రాజ్యానికి కొత్త సూత్రం చెబుతాడేమో/ అక్కడికి సమీపంలోనే/ రాజ్యాంగ పిత అంబేద్కర్/ నిలువెత్తు/ నమ్మకంలా నిలుచుంటాడు."

1959 జనవరి 21వ తేదీన నిజామాబాద్ జిల్లా పాములబస్తీలో జన్మించారు ఎండ్లూరి. హైదరాబాద్‌లోని నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్యనభ్యసించి ఎంఏ, ఎంఫిల్ ఉస్మానియా యూనివర్సిటీలోనూ, పీహెచ్‌డీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ అభ్యసించారు. 1990 అక్టోబర్ 6 నుంచి రాజమండ్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠం ప్రాంగణంలో అసోసియేట్ ప్రొఫెసర్ గానూ, పీఠాధిపతిగానూ బాధ్యతలు నిర్వహించారు. 2018 నుంచి చివరి వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా కొనసాగారు. ఆయన రచనలు 'వర్తమానం' (కవితా సంపుటి), జాషువా 'నా కథ' మీద ఎంఫిల్ పరిశోధన, 'జాషువా సాహిత్యం–దృక్పథం–పరిణామం'పై పీహెచ్‌డీ, 'కొత్త గబ్బిలం' (దీర్ఘకావ్యం), 'మల్లెమొగ్గల గొడుగు' (మాదిగల ఆత్మకథలు), 'నల్ల ద్రాక్ష పందిరి', 'వర్గీకరణీయం', 'ఆటా జనికాంచె' (అమెరికా యాత్ర కవితలు) మొదలైనవి.

"ఆగ్రహం రాని అక్షరం జ్వలించదని/ ఆర్ద్రత లేని వాక్యం ఫలించదని/ నా అనుభవం నేర్పిన కవిత్వ పాఠం/ నాలుగు మెతుకులే నా అక్షరాలు/ నాలుగు మనుషులే నేను చదివిన ప్రబంధాలు/ నా బాల్య దృశ్యాలే నేను చూసిన అలంకార శాస్త్రాలు/ ఆకలి రసం నాలోని రచనా రహస్యం/ అవమాన విషం/ నా కంఠంలోని నీలామృత విశేషం/ మా బీద బస్తీలే నన్ను కవిని చేశాయి/ నాలోని భావుత్వానికీ/ బాధల తత్వానికీ బీటలు వేశాయి/ మా వీధి కుక్కలు జీవితాన్నీ జీవించడాన్నీ నేర్పాయి."

2022 జనవరి 28వ తేదీన– ఎవరో పిలిచినట్లు, ఇంకేదో పని ఉన్నట్లు, రాస్తూ రాస్తూనే పెన్ను, కాగితాలు పక్కనపెట్టి హడావిడిగా వెళ్లిపోయారు సుధాకర్. ఒక జ్వలన కవితాశిఖరం అర్థాంతరంగా నేలకొరిగింది. ఆయన సాధారణంగా కనిపించే అసాధారణ వ్యక్తి. దయ, కరుణ, ప్రేమ, ఆత్మీయత మెండుగా కలిగిన నిండైన వ్యక్తి. భాష, సాహితీ పరిజ్ఞానం, గంభీరమైన కంఠస్వరం కలిగిన గొప్ప వక్త. అక్షరంతో అనేకమంది ఆత్మీయులని సంపాదించుకున్న ఈ సుకవి ప్రజల నాలుకలపై చిరకాలం సజీవంగా ఉంటారు!

(జనవరి 28 ఎండ్లూరి సుధాకర్ వర్ధంతి)

■ గంగవరపు సునీత
✆ 94940 84576



మామిడి పిందెల కల

నేను అమ్మకు రాసిన ఉత్తరం
ఇంకా అందిందో లేదో
దామెర చెరువు కాడ అలుగు
తెగిపోయిందని రాత్రి కల వచ్చింది

ఆ ఇంట్లో చీకటి ముసుగు దొంగలా
ఎప్పుడూ కాపు కాసే వుందని తానెరగదు కదా
బుజ్జికి తెచ్చిన పట్టీల మామిడి పిందెలు
అక్కడక్క రాలిపోయాయని
ఆ ఆకాశపు చుక్కలల్లో
మూడు కాళ్ళ జీవి వెతుకుతునే వుంది.

నిన్న పడమరకెళ్ళిన పక్షులు
నేడు తూరుపు వాకిట్లోని
వరికంకుల మీద వాలుతాయో లేదో
కవి రాసిన అక్షరాలు పోగేసిన వెన్నెల
ఆ గుడిసె ముందు దీపకాంతి పూలై మెరుస్తున్నాయి

నిన్నటి నిశబ్ధం గడప దాటి
కొత్త వేకువ చిగురిస్తుందన్న ఆశ నిజమో కాదో
వడలిన దేహం వాడిపోయిన చెట్ల కింద
అడవి చిగురించాలని నీళ్ళు పోస్తుందా ప్రాణం

తోకలేని పక్షి మనసు వాకిట్లో వాలి
గుస గుసగా చెవిలో
చెప్పిన ఊసులన్నీ నిజమో అబద్ధమో
అన్న మీమాంసలోనే వుంది
నాన్న పొలం నుండి తెచ్చిన ధాన్యం
నుదుట పూసిన సూర్య బింబంలో చూసుకుంటుంది
కల తీయగా మూలుగుతూ
వాసం మీది కొక్కెం ఎక్కి ముడుచుకుంటుంది

■ వజ్జీరు ప్రదీప్
✆ 99895 62991

వేరు కథ అవసరమే!

తెలంగాణ కథ పేరిట మరో సంకలనం **ధరణికోట రమేష్ కుమార్** సంపాదకత్వంలో గత ఏడాది సెప్టెంబర్‌లో వెలువడింది. తెలంగాణ కథకులు రాసిన ఈ పదకొండు కథల సంకలనం 'కందిలి' పేరుతో వచ్చింది. ఈ సందర్భంగా పుస్తక సంపాదకుడితో ముఖాముఖి.

విడిపోయాం, వేర్వేరుగా పాలించుకుంటున్నాం. 'తెలంగాణ కథ' అనే వేర్పాటు ఇంకా అవసరమా?

రాజకీయంగా విభజన జరిగిపోయినా సాంస్కృతికంగా ఆధిపత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణకు తనదైన ప్రత్యేకత ఉంది. స్థానిక భాష, సాంప్రదాయాలు, సమస్యలు కథల్లో ప్రతిబింబిస్తాయి. ఈ స్వరమే తెలంగాణ కథగా నిలుస్తుంది. కాబట్టి వేరు కథ అవసరమే, అది భిన్నత్వాన్ని కాపాడుతుంది. ప్రస్తుతం వస్తున్న ఉమ్మడి సంకలనాలలో తెలంగాణాకు సరైన వాటా లభించకపోవడం బహుశా ఇంకో ప్రధాన కారణం.

విభజన అనంతరం తెలంగాణ కథకులకు ఇతివృత్తాల కొరత ఏర్పడినట్టుంది?

ఇది కొంత మేరకు నిజమే కావచ్చు. కానీ విభజన తరువాత కొత్త సవాళ్లు, కొత్త కలలు, పరిపాలనానుభవాలు ముందుకు వచ్చాయి. ఇవన్నీ రచయితలకు పచ్చి పదార్థం అవుతున్నాయి. ఆ కొరత లోనే కొత్త విషయాలు వెతుక్కుంటున్నాడు కథకుడు. కొరత పాక్షికమేననడానికి మా కందీలు సాక్ష్యం.



తెలంగాణ కథా సంకలనాలు ఇప్పటికే చాలా వస్తున్నాయి. ఇంకొకటి ఎందుకు?

మిగతా సంకలనాలలో వేరే వేరే చోట్ల అచ్చయిన కథలను తీసుకుంటున్నారు. మేం మా కోసమే ప్రత్యేకంగా రాయించుకుని సంకలనం వేస్తున్నాం. ప్రతి సంకలనం కాలానికి అద్దం వంటిది. పాతవి ఒక దశను చూపిస్తే, కొత్తవి మారిన వాస్తవాలను పట్టుకుంటాయి. కొత్త రచయితలు, కొత్త శైలులు ప్రదర్శించడానికి సంకలనాలు వేదిక అవుతాయి. అందుకే మరొక సంకలనం అవసరమే. ఇదే కాదు ఇంకా ఇంకా సంకలనాలు రావాలి.



కథ అంటే కథే కదా. ఆంధ్ర కథ, తెలంగాణ కథ అని వేర్వేరుగా ఉంటాయా?

ఉంటాయి. కథను ఉపరితలం నుంచి చూస్తే అందరికీ ఒకటే కానీ అనుభవాలు, భాషా శైలి ప్రాంతానుసారం వేరవుతాయి. ఆంధ్రలోని సామాజిక సమస్యలు ఒకవైపు, తెలంగాణలోని బతుకుబాట్లు మరోవైపు కనిపిస్తాయి. ఈ విభిన్నతే కథను ప్రత్యేకంగా చేస్తుంది. కాబట్టి రెండు వేర్వేరుగా గుర్తింపు పొందుతాయి.

'కథా తెలంగాణం' పేరుతో మీరు చేస్తున్న ప్రయత్నం లక్ష్యం ఏమిటి?

'కథా తెలంగాణం' ఉద్దేశం తెలంగాణ జీవన వాస్తవాలు, భాషా వైవిధ్యాన్ని సాహిత్యంలో స్థిరపరచడం. గ్రామీణ, పట్టణ సమస్యలు, సంస్కృతి, చరిత్ర కథల ద్వారా ప్రతిబింబించాలనేది దీని ధ్యేయం. అంతేకాకుండా కొత్త, పాత రచయితలకు ఇంకొక వేదిక కల్పించడం, తెలంగాణ కథని కాపాడుకోవడం, కొత్త ఊపిరి లూదడం మా లక్ష్యం.

ఇంటర్వ్యూ ■ జయశ్రీ మువ్వా
✆ 90527 33822



- ఉన్న నిధులు రూ.22 కోట్లు
- పనుల కేటాయింపు రూ.48 కోట్లు
- రూ.18 కోట్ల స్టాంప్ డ్యూటీ రాక గందరగోళం
- ఆర్థిక సంక్షోభం దిశగా జడ్పీ పాలన

లోటు.. రూ.26 కోట్లు

జిల్లా పరిషత్‌లో లోటు బడ్జెట్

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఆర్థిక పరిస్థితి 2025-26 ఆర్థిక సంవత్సరంలో తీవ్రమైన సంక్షోభ దిశగా సాగుతోంది. రావాల్సిన నిధులు.. వాస్తవంగా అందుతున్న నిధులు.. ముందస్తుగా ఇచ్చిన అనుమతులు ఈ మూడింటి మధ్య భారీ అంతరం జడ్పీ పరిపాలనను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. గణాంకాలను పరిశీలిస్తే ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా దెబ్బతిందా.. అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు రూ.19.51 కోట్లు రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి అందిన మొత్తం కేవలం రూ.8.84 కోట్లు మాత్రమే. అంటే ఇంకా రూ.14.61 కోట్లు రావాల్సి ఉంది. సాధారణంగా ఈ నిధులు దశలవారీగా విడుదలవుతాయని అధికార వర్గాలు చెబుతున్నప్పటికీ, పూర్తిస్థాయి నిధులు ఖాతాల్లో జమ కాకముందే జిల్లా పరిషత్ పరిపాలన విభాగం కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కనిపిస్తోంది.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిషత్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడి చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి.. సీపీడబ్ల్యూ (టైడ్) పథకాల కింద రూ.28.90 కోట్లు, అలాగే అన్‌టైడ్ గ్రాం ట్స్ కింద రూ.5.22 కోట్లు.. మొత్తంగా రూ.34.12 కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతి ఇవ్వడం జరిగింది. కానీ, ప్రభుత్వం నుంచి వాస్తవంగా రావాల్సిన మొత్తం రూ.19.51 కోట్లు కావడం గమనార్హం. ఈ తేడానే ఇప్పుడు జిల్లా పరిషత్ మెడపై రూ.14.61 కోట్ల అప్పు భారంగా మారింది.

జనరల్ ఫండ్.. ఆందోళనకరం

జిల్లా పరిషత్ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన జనరల్ ఫండ్ పరిస్థితి 2025-26లో మరింత బలహీనంగా కనిపిస్తోంది. బడ్జెట్ అంచనాల ప్రకారం జనరల్ ఫండ్ కింద రూ.20.90 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.18 కోట్లు ప్రధాన ఆదాయ వనరు. అయితే వాస్తవ పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. స్టాంప్ డ్యూటీ కింద ప్రభుత్వం విడుదల చేయాల్సిన రూ.18 కోట్లపై ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వచ్చినా ఇప్పటి వరకు స్పష్టత లేదు. అసలు ఇస్తారో లేదో తెలియని సందిగ్ధం నెలకొంది. జడ్పీ చైర్‌పర్సన్ స్టాంప్ డ్యూటీ విడుదల చేయాలని కోరుతూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా ప్రయోజనం ఉన్నట్లు కనిపించడం లేదు. ఆదాయం ఆశించిన స్థాయిలో రాకపోవడంతో, జనరల్ ఫండ్‌కు వాస్తవంగా లభ్యమయ్యే మొత్తం కేవలం రూ.2.90 కోట్లు మాత్రమే మారింది. ఇంత తక్కువ ఆదాయం ఉన్నప్పటికీ, జిల్లా పరిషత్ రూ.14.17 కోట్ల విలువైన పనులకు జనరల్ ఫండ్ నుంచి ముందస్తు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో జనరల్ ఫండ్‌లోనే రూ.11.27 కోట్ల బడ్జెట్ లోటు ఏర్పడింది.

మొత్తం ఆర్థిక లోటు..

గణాంకాలను కలిపి పరిశీలిస్తే.. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.14.61 కోట్లు, జనరల్ ఫండ్‌లో రూ.11.27 కోట్లు మొత్తం కలిపి సుమారు రూ.26 కోట్ల మేర బడ్జెట్ లోటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో నమోదైంది. ఈ లోటు కేవలం లెక్కల పరమైంది మాత్రమే కాదు. ఇది భవిష్యత్తులో పనుల నిలుపుదల, బిల్లుల (మిగతా 6లో)



మహోత్సవాలకు హాజరైన విశ్వాసులు

ప్రతి ఒక్కరిపై దేవుని ఆశీర్వాదం



- దేవునిపై విశ్వాసం.. విజయానికి తొలి మెట్టు
- బైబిల్ మిషన్ మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్క రిపైనా దేవుని ఆశీర్వాదం, మహోత్స వాల ఆశీస్సులు ఉండాలని బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ డాక్టర్ జే శామ్యూ ల్‌కిరణ్ తెలిపారు. 88వ బైబిల్ మిషన్ మూడు రోజుల మహోత్సవాలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఆదివారం ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా శామ్యూల్‌కిరణ్ వాక్యోపదేశం చేశారు. మహోత్సవాలలో పాల్గొనడం ద్వారా దేవుని ఆశీర్వాదం, దీవెన, అన్ని అంశాలలో విజయం సాధించడానికి ఒక మార్గంగా భక్తులు విశ్వసిస్తారన్నారు. భిన్న సంస్కృతులు, ప్రాంతాలు, భాషలు, కు లాలను విడనాడి ఒకే పందిరి కింద సమైక్య తను చాటడం సంతోషించ దగ్గ విషయమని చెప్పారు. దైవ క్రమశిక్షణ కలిగి ఎదుటివారిపై ప్రేమ చూపడం ద్వారా దేవుని వారసులుగా స్థానం సంపాదించవచ్చన్నారు. దుష్ట హృదయం లేకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. దేవునిపై ఆధారపడటం ద్వారా దీవెనలతో పాటు, అన్ని అంశాల్లో విజేతలుగా నిలుస్తారని చెప్పారు. తొలుత బైబిల్ మిషన్ జాయింట్ సెక్రెటరి జే ఆగమనరావు, డి.సుధా కర్ తదితరులు దైవసందేశాలు అందించారు.

పోటెత్తిన మహోత్సవాల ప్రాంగణం

రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతో పాటు సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ తదితర దేశాల నుంచి పెద్దసంఖ్య లో తరలివచ్చిన విశ్వాసులతో మహోత్సవాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సండే స్కూల్ విద్యార్థుల ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో బైబి ల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పి.జాన్‌దేవదాసు, సెక్రటరి కె.ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరి ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

6 తను రగిల్చిన మంటలకే ఆహుతై..

- వివాహేతర బంధం, అనవసరపు ఆవేశంతో ముగిసిన జీవితం

ఓటుతో ప్రతీ ఒక్కరికీ సమానత్వం

- ఓటర్ల దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ అన్సారియా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, జేసీ శ్రీవాస్తవ, కమిషనర్ అశోక్

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటుతో ప్రతీ ఒక్కరికి సమానత్వం లభించిందని కలెక్టర్ తమీమ్‌అన్సారియా తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్స వాన్ని ఆదివారం గుంటూరులో ఘనంగా నిర్వహించారు. ఓటరు అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఓటరుగా సమాజాన్ని తీర్చిదిద్దడంలో ప్రజలు కీలక పాత్ర వహించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, తప్ప కుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి కోరారు. గుంటూరు కమిషనర్ మయూర్‌అశోక్ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని, దానిని ప్రతీ ఒక్క రూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ ఏసీ చల్లా ఓబులేసు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీపీవో బి.వి. నాగసాయి కుమార్, డీఈవో షేక్ సలీం బాషా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యారావు, ప్రతినిధులు నాయుడు ఓంకార్, కంచర్ల శివరామయ్య, కాం గ్రెస్, బీఎస్పీ, జనసేన, ఆప్ ప్రతినిధులు బిళ్ళా సునీల్, సి.హెచ్.వాసు, త్రినాథ్, డాక్టర్ సేవకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం

- ముస్తాబైన పోలీసు కవాతు మైదానం



అమరావతిలో సిద్ధమైన రిపబ్లిక్ డే వేడుకల గ్రౌండ్

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి స్థానిక పోలీసు కవాతు మైదానం ముస్తాబైంది. సోమవారం జరిగే వేడుకలకు ఆది వారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు కలెక్టర్ అన్సారియా జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం జిల్లా అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల గురించి సందేశాన్ని ఇస్తారు. ఆ తర్వాత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. చివరగా విధి నిర్వహణల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను కలెక్టర్ ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగుస్తుంది. అమరావతి రాజధానిలో రాష్ట్ర స్థాయి వేడుకల దృష్ట్యా జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాలను కుదించా రు. ఉత్తమ సేవలు అందించిన 351 మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ గణతంత్ర దినోత్సవ పురస్కారాలను అందించనున్నారు. అమరావతి రాజధాని లోని ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం మువ్వన్నెల విద్యుత్ దీపా ల అలం కరణతో కళకళలాడుతున్నది. సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆదివారం రాత్రి రాజధాని అమరావతిలోని ఏపీసీఆర్‌డీఏ భవనంతో పాటు గుంటూరు కలెక్టరేట్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకలకు సిద్ధమైన వేదిక



గుంటూరు కలెక్టరేట్‌కి గణతంత్ర శోభ

సూర్య యంత్రం



తెనాలి, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): రథ సప్తమి పర్వదినం. తెనాలిలో భారీ సూర్య యంత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ భారీ సప్తవర్ణ సహస్ర దళ సూర్య యంత్రాన్ని గురుస్వామి హరిబాబు భక్తులతో కలిసి 3 రోజులు శ్రమించి తీర్చిదిద్దారు. సూర్య నారాయణుడిని పూజించే అనేక యంత్రాల్లో ఇది 108వదని.. వెయ్యి దళాలు, 20 క్వింటాళ్ల బియ్యం, 5 డబ్బాల నూనె, పుష్పాలు, రంగులతో తీర్చిదిద్దినట్లు ఆయన వివరించారు. తమ గురువు రామ్‌దాస్ గురుస్వామి అనుగ్రహంతోనే.. మొదటిసారి దీనిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇందుకు ఆడిటోరియంలో అవకాశం ఇచ్చిన వి.ఎస్.ఆర్ అండ్ ఎన్.వి.ఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్ దంపతులు సూర్య యంత్రానికి పూజలు చేశారు.

ఘనతంత్రం

● గణతంత్ర వేడుకలకు సర్వాంగ సుందరంగా రాయపూడి పరేడ్ గ్రౌండ్.. ● చేరుకోవాలి ఇలా..

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న 77వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వేడుకలకు.. రాయపూడి గ్రామంలోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు చేశారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఉన్నత అధికారులు వేడుకల్లో పాల్గొననున్నారు.



వీవీఐపీ, వీఐపీ గ్యాలరీ

● జంగారెడ్డి గూడెం ఏఎస్పీ ఆర్.సుస్మిత పరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై 22 శాఖల శకటాలు ప్రదర్శన ఇస్తాయి.

● వేడుకలకు హాజరయ్యే వీవీఐపీలు, వీఐపీలు, ప్రముఖులు, ప్రజల వాహనాల రాకపోకలకు.. కోసం పోలీసు అధికారులు ప్రత్యేకంగా రూట్ మ్యాప్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, కలెక్టర్ అన్సారియా

రూపొందించారు.

● రూట్ - 1లో వీవీఐపీ, ఏఏ, ఏ1, ఏ2 పాసులు ఉన్నవారు లోటస్ కరకట్ట మీదుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ ఎడమవైపు నుంచి వేడుకల మైదానానికి చేరుకోవాలి.

● రూట్ నెంబర్ - 2లో బీ1, బీ2 పాస్‌లు ఉన్నవారు, ఎమ్మెల్యే క్వార్టర్స్ ముందుకు వెళ్లి వెస్ట్ బైపాస్ రోడ్డు నుంచి చేరుకోవాలి.

● గుంటూరు నుంచి సాధారణ వాహనాలు మురుగన్ హోటల్ సెంటర్ నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా పాతవెలగపూడి రోడ్డు జంక్షన్ నుంచి ఈ4 రోడ్ పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.

● విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజ్ వెలగపూడి, మోదు లింగాయపాలెం, ఈ4 రోడ్ పార్కింగ్‌కి వెళ్లాలి.

● గొల్లపూడి నుంచి సాధారణ వాహనాలు విజయవాడ - వెంకట పాలెం, మోదులింగాయ పాలెం, ఈ 4 రోడ్ పార్కింగ్‌కి ప్రదేశానికి వెళ్లాలి.

● తుళ్లూరు నుంచి సాధారణ వాహనాలు తుళ్లూరు - ఈ 6 వెస్ట్ పార్క్ రోడ్డు ఈ ఫోర్ జంక్షన్ నుంచి ఈ4 పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.

● హైకోర్టు లాయర్స్ వాహనాలు ప్రకాశం బ్యారేజ్, వెలగపూడి, ఈ4 రోడ్డు పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.

తను రగిల్చిన మంటలకే ఆహుతై..

● వివాహేతర బంధం, అనవసరపు ఆవేశంతో ముగిసిన జీవితం



కె. దుర్గా(ఫైల్ ఫొటో)

చేబ్రోలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒక వివాహేతర బంధం చివరకు.. నిండు ప్రాణం తీసింది. క్షణికావేశం, అదుపుతప్పిన భావోద్వేగాలు ఓ యువతి జీవితం అర్థాంతరంగా ముగిసింది. చేబ్రోలు మండలం సుద్ధపల్లిలో ప్రియుడి భార్య, కుమారుడు, తల్లిపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో ప్రియురాలు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. తెనాలి సీఎం కాలనీకి చెందిన కె. దుర్గా (27) జీవితం చివరి క్షణాలు విషాదకరంగా ముగిశాయి. సుద్ధపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌తో కొనసాగిన వివాహేతరబంధం, వారి మధ్య పెరిగిన అనుమానాలు, విభేదాలు కుటుంబాల్లో మంటలు రేపాయి. శనివారం రాత్రి మల్లేష్ ఇంటికి వచ్చిన దుర్గ..అతని భార్య అర్చన, కుమారుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఈ ప్రయత్నంలో దుర్గ కూడా మంటల్లో గాయపడింది. స్థానికులు మంటలను అదుపు చేసే క్రమంలో మరో ఆరుగురు గాయపడ్డారు. మొదట ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ దుర్గ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు. మల్లేష్ భార్య అర్చన సహా పలువురు చికిత్స అనంతరం ఇంటికి చేరుకోగా, ఒకరు ఆసుపత్రిలోనే ఉన్నారు. దుర్గకు కొడుకు ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాల్మన్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం

● తిరుపతి ఎంపీ గురుమూర్తి



మాచవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హత్యకు గురైన మందా సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాడుతూనే ఉంటుందని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆదివారం పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో మందా సాల్మన్ సంస్మరణ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి వైసీపీ నాయకులు తరలి వచ్చారు. ముందుగా వారంతా సాల్మన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి విలేకరులతో మాట్లాడుతూ, అవసరమైతే రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయమై చర్చిస్తామని చెప్పారు. పేద వాడైన సాల్మన్‌ను హత్య చేయడం అత్యంత పాశవిక చర్య అని ఆయన పేర్కొన్నారు. సాల్మన్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిన్నెల్లి గ్రామంలో జరుగుతున్న దాడులు, ప్రతి దాడులను ఇప్పటికైనా పోలీసు యంత్రాగం కట్టుదిట్టం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సాల్మన్ హత్య ఉదంతాన్ని ఢిల్లీ వరకు తీసుకు వెళ్లి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, మాజీ మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, శైలజానాథ్, మేకతోటి సుచరిత, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు



సిద్ధం చేసిన ఎడ్లపోటీల గరడీ

రెంటచింతల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం ఎడ్ల బలప్రదర్శనకు సిద్ధమైంది. మండల కేంద్రంలోని కానుకమాత తిరునాళ్లను పురస్కరించుకుని సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రెండు తెలుగురాష్ట్రాల స్థాయిలో పోటీలు జరగనున్నాయని.. కానుకమాత కోడెగిత్తల కమిటీ నిర్వాహకులు వైఎల్ మర్రెడ్డి వెల్లడించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలు తెలిపారు. 300 మీటర్ల పొడవు.. 8 విభాగాల్లో నిర్వహించే పోటీలకు 72 రకాల బహుమతులుంటాయని పేర్కొన్నారు. పందేలకు 130 జతల ఎడ్లు వస్తాయని, ప్రథమ బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ద్విచక్ర వాహనం ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పాల్గొన్న ప్రతి జతకు.. మొత్తం రూ.26.50 లక్షల బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రాంగణంలో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశామని, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. గొంటు సుమంత్‌రెడ్డి, ఏరువ జోజిరెడ్డి, బి.రామకృష్ణ, ఎం.శౌరెడ్డి, రాయపరెడ్డి, ఎం.రాజారెడ్డి, కె.జోసఫ్‌రెడ్డి, ఇన్నారెడ్డి, కోటిరెడ్డి, గాదె కస్పారెడ్డి, ఫాతిమా మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో.. ప్రధాన్ హాస్పిటల్స్ ప్రారంభం

● అధిక సంఖ్యలో హాజరైన నగర ప్రముఖులు, వైద్యులు



హాస్పిటల్స్ వద్ద డాక్టర్ పులివర్తి వెంకటేష్, కుటుంబ సభ్యులు



ప్రధాన్ హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న పులివర్తి సుధారాణి

గుంటూరు మెడికల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీఆర్ క్లబ్ ఎదురుగా లక్ష్మీపురం నాల్గవ లైన్‌లో నూతనంగా అత్యాధునిక వసతులతో నిర్మించిన ప్రధాన్ హాస్పిటల్స్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పులివర్తి శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆయన భార్య పులివర్తి సుధారాణి ఆసుపత్రిని ప్రారంభించారు. శేషగిరిరావు కుమారుడు హాస్పిటల్ ఎండీ డాక్టర్ పులివర్తి వెంకటేష్ నేతృత్వంలో ప్రధాన్ హాస్పిటల్స్‌లో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు లభిస్తాయి. ప్రారంభోత్సవం కార్యక్రమానికి నగరానికి చెందిన రాజకీయ, వైద్య ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 50 పడకలతో షేరింగ్ రూమ్‌లతో పాటు డీలక్స్, సూట్ రూమ్‌లు ప్రధాన హాస్పిటల్స్‌లో అందుబాట్లో ఉన్నాయి. ఇన్‌ఫెక్షన్‌లు సోకకుండా నివారించేందుకు లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లతో పాటు అడ్వాన్స్‌డ్ ఎనస్థీషియా వర్క్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల పలువురు డాక్టర్ పులివర్తి వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రధాన్ హాస్పిటల్స్‌లో జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఎనస్థీషియా వంటి పలు రకాల వైద్యసేవలు లభిస్తాయని తెలిపారు. గర్భిణులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రూమ్‌లోనే ప్రసవం చేసే సౌకర్యంతో పాటు అదే బెడ్‌పై ఆపరేషన్ థియేటర్‌కు తరలించే వసతులు కల్పించినట్లు వివరించారు. నెలలు నిండకుండా జన్మించే నవజాత శిశువులను సంరక్షించేందుకు నియోనేటల్ ఐసీయూతో పాటు చిన్నారుల కోసం పీడియాట్రిక్ ఐసీయూను నిర్మించినట్లు చెప్పారు. అత్యాధునిక ప్రాణాధార వైద్య పరికరాలతో నిర్మించిన 12 పడకల ఐసీయూలో రోగులకు ఇన్‌ఫెక్షన్‌లు సోకకుండా ఐసోలేషన్ పడకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మొహమ్మద్ నసీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వైవీ ఆంజనేయులు, కిలారు రోశయ్య, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, మాజీ మేయర్ రాయపాటి మోహనసాయికృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా అధ్యక్షుడు కోట మాల్యాద్రి, కాటూరి విద్యా సంస్థల చైర్మన్ కాటూరి సుబ్బారావు, వైద్యులు వై లక్ష్మణస్వామి, వై సురేంద్రకుమార్, కొండబోలు వరప్రసాద్, రాజునాయుడు, కే రవిబాబు, చే బ్రోలు విశ్వేశ్వరరావు, విజయసారధి, కళ్యాణ్‌చక్రవర్తి, పీ నాగేంద్ర ప్రసాద్, నిమ్మల శేషయ్య, యర్రా రాజేష్ పాల్గొన్నారు.

అమృత్ భారత్ రైలులో టిక్కెట్ ధర వేరు

● సూపర్‌ఫాస్టు టిక్కెట్‌తో రైలు ఎక్కితే ఫైన్ తప్పదు
● అవగాహన కల్పించని రైల్వే శాఖ

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ మీదగా కొత్తగా పట్టాలెక్కిన అమృత్ భారత్ రైలు టిక్కెట్ ధర, సాధారణ రైళ్ల టిక్కెట్ చార్జీలు వేరు. ఈ విషయంపై ఇప్పటి వరకు రైల్వే శాఖ ప్రయాణికులకు అవగాహన కల్పించ లేదు. మెయిల్/ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే అమృత్ భారత్ రైలులో జనరల్, స్లీపర్ క్లాస్ ఛార్జీలు కాస్త ఎక్కువగా ఉంటాయి. ఈ విషయం తెలియక ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు టిక్కెట్ తీసుకొని అమృత్ భారత్ రైలు ఎక్కేస్తే టీసీలు ఫైన్ రాసే అవకాశం ఉంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్‌లో 50 కిలోమీటర్ల వరకు జనరల్ సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఒకటే చార్జీ ఉంటుంది. బేస్ చార్జీ రూ.31 రౌండ్ ఆఫ్ చేసి రూ.35గా వసూలు చేస్తారు. సూపర్ ఫాస్ట్ చార్జీ రూ.50గా ఉంది. స్లీపర్ క్లాస్‌కు 200 కిలోమీటర్ల వరకు బేస్ ఫేర్ రూ.130, రిజర్వేషన్ ఛార్జీ రూ. 20 ఉంటుంది. అదే సూపర్ ఫాస్టుకు అదనంగా మరో రూ. 30 ఉంటుంది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో 50 కిలోమీటర్ల వరకు బేస్ ఫేర్ వచ్చి రూ.36.. రౌండ్ ఆఫ్ చేసి రూ. 40గా వసూలు చేస్తారు. 51 నుంచి 300 కిలోమీటర్ల వరకు ప్రతీ ఐదు కిలోమీటర్లకు శ్లాబు మారిపోతుంది. ఈ రైలులో గుంటూరు నుంచి చర్లపల్లికి ప్రయాణించాలంటే రూ. 125 వరకు ఉంటుంది. స్లీపర్ క్లాస్ అయితే రూ.225గా ఉంది. గుంటూరు నుంచి తిరువనంతపురానికి చూసుకొంటే శబరి సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ టిక్కెట్ రూ.635 కాగా.. అమృత్ భారత్ వీక్లీ రైలుకు వచ్చేసరికి రూ. 685 అంటే రూ. 50 అదనంగా ఉంది. గత శనివారం అమృత్ భారత్ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు గుంటూరుకు వచ్చినప్పుడు కూడా మైకులో దీనికి సంబంధించి ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ప్రయాణికులకు అవగాహన కల్పించలేదు.

మార్పులు అవసరం

నంబరు 17042 తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం సాయంత్రం 5.30కి బయలుదేరి గురువారం సాయంత్రం 4.43కి తెనాలి వస్తుంది. ఇక్కడి నుంచి 25 నిమిషాల వ్యవధిలోనే గుంటూరుకు చేరుకోవచ్చు. అయినప్పటికీ 57 నిమిషాల సమయాన్ని కేటాయించారు. గుంటూరు నుంచి సత్తెనపల్లికి 39 నిమిషాలలో ఎక్స్‌ప్రెస్/ సూపర్ ఫాస్టు రైళ్లు వెళుతుంటాయి. అలాంటిది గంటా 9 నిమిషాల సమయాన్ని కేటాయించారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రిసిడెన్స్ కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించారానన్న అనుమానాలు కలుగుతోన్నాయి. 17041 చర్లపల్లి - తిరువనంతపురం నార్త్ అమృత్ భారత్ రైలుకు కూడా గుంటూరు నుంచి తెనాలికి గంటా 13 నిమిషాల సమయాన్ని కేటాయించారు. దీని వలన తెనాలి హోంలో ఈ రైలుని ఎక్కువ సేపు నిలిపేసే అవకాశం ఉంది. వీటిని సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర


● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	162, 171, 183
చికెన్ విత్ స్కిన్(కిలో)	314.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	324.00

ఎల్‌వీఆర్ క్లబ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా ముద్దన



ముద్దన నాగేశ్వరరావు

యడ్లపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా ముద్దన నాగేశ్వరరావు ఎంపికయ్యారు. మండలంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన ముద్దన రెండు దశాబ్దాలుగా క్లబ్ సభ్యుడిగా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. గతేడాది నవంబరులో జరిగిన క్లబ్ పాలకవర్గ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా ముద్దనను ప్రతిపాదించినప్పటికీ.. రాజీలో భాగంగా ఆయన పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. దీనితో ముద్దనను ప్రత్యేక ఆహ్వానితుడిగా క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముద్దన క్లబ్ పాలకవర్గ సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. అలాగే పొత్తూరి శ్రీనివాసరావు కూడా ప్రత్యేక ఆహ్వానితుడిగా, మన్నవ చంద్రమౌళి ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. నాగేశ్వరరావును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, మండల టీడీపీ నాయకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

తెనాలిలో నకిలీ సిగరెట్ల గుట్టురట్టు

● రూ.18.43 లక్షల విలువైన సిగరెట్లు సీజ్



సిగరెట్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్

గుంటూరు సిటీ, తెనాలి క్రైం జనవరి 25(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం, మండల పరిధిలో అనుమతి లేని సిగరెట్ల అక్రమ నిల్వలు, అమ్మకాలపై సంయుక్త తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుంటూరు రీజినల్ విజిలెన్స్, రాష్ట్ర జీఎస్టీ (స్టేట్ ట్యాక్స్), రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. మార్కెట్ ఏరియాలోని రావి అంజయ్య వీధిలోని చైతన్య జనరల్ స్టోర్స్‌లో బిల్లులు లేని, వివిధ బ్రాండ్‌లకు చెందిన సిగరెట్లను అక్రమంగా నిల్వ చేసి, విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో కౌతవరపు నమ్మయ్య, ఉయ్యూరు సుబ్బారావు గుప్తాలకు సంబంధం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. నందులపేట దేవినేనివారి వీధిలో నివాసముంటున్న వేములపల్లి మురళీకృష్ణ ఇంటిలో తనిఖీలు నిర్వహించి, నిల్వ చేసిన సిగరెట్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన సిగరెట్ల అంచనా విలువ మొదటి తనిఖీలో రూ.6,40,000, రెండో తనిఖీలో రూ.12,03,200గా అధికారులు అంచనా వేశారు. మొత్తం విలువ రూ.18,43,200గా నిర్ణయించారు. తదుపరి విచారణకు తెనాలి వన్‌టౌన్, టూటౌన్ పట్టణ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. స్థానిక సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ విజయ్‌కుమార్ నకిలీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ పల్లపు శివాజీ, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు, తెనాలి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డీఆర్వో ఖాజావలికి రాష్ట్రస్థాయి అవార్డు



సీఎస్ చేతుల మీదగా అవార్డు అందుకొంటున్న ఖాజావలి

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి ఉత్తమ ఎలక్టోరల్ విధానాలను అమలు చేసినందుకు గాను రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్తమ ఎలక్టోరల్ విధానాలను అమలు చేశామన్నారు. మున్ముందూ పకడ్బందీగా ఓటరు జాబితా తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీఈవో వివేక్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాష్ట్రస్థాయి మట్టి కుస్తీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీ వీరాంజనేయ మల్లయుద్ధ వ్యాయామశాల కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఇండియా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ ఆజా, పాండు రంగారావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మావో శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా జ్యోతి ప్రజ్వలనచేసి పోటీలను ప్రారంభించారు.

లోటు.. రూ.26 కోట్లు

(5వ పేజీ తరువాయి)

చెల్లింపుల్లో ఆలస్యం, కాంట్రాక్టర్లపై భారం వంటి అనేక సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని స్పష్టం అవుతుంది.

ముందస్తు అనుమతులు... ఎవరి బాధ్యత?

ఆర్థిక నియమావళి ప్రకారం, వాస్తవ ఆదాయం స్పష్టంగా నిర్ధారణ కాకముందే భారీ పనులకు అనుమతులు ఇవ్వడం సాధారణంగా సిఫారసు చేయబడదు. అయినప్పటికీ ఈ స్థాయిలో ముందస్తు అనుమతులు ఇవ్వడం వెనుక ఆర్థిక వాస్తవాలను విస్మరించడమే కారణం అన్న వాదన వినపడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. వాస్తవ ఆదాయాన్ని బట్టి వ్యయ నిర్ణయాలు తీసుకోకపోతే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మరింత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి జారే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

అంతా గందరగోళంగా ఉంది

జడ్పీ ఆర్థిక పరిస్థితి గందరగోళం ఉంది. కోట్ల రూపాయల పనులకు ముందుగానే అనుమతి ఇస్తున్నారు. వచ్చే నిధులకు ఇచ్చే అనుమతులకు అసలు పొంతన ఉండటం లేదు. సమాచార హక్కు చట్టం ప్రకారం తీసుకున్న వివరాలు కూడా జిల్లా పరిషత్ ఆర్థిక పరిస్థితి బాగా లేదన్న విషయం అర్థమవుతోంది. ఇప్పటికైనా వాస్తవాలపై లోతుగా చర్చ జరగాలి.

– పి.ఓబుల్ రెడ్డి, జడ్పీటీసీ, రొంపిచర్ల



రోడ్డుపై ఉన్న నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మయూరి అశోక్

సీఎం పర్యటన మార్గంలో గుంతలు వెంటనే పూడ్చాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరుకార్పొరేషన్,జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 30న ప్రభుత్వ వైద్యశాలలో నూతన భవన ప్రారంభోత్సవానికి వచ్చే అవకాశం ఉన్నందున, సదరు పర్యటన మార్గంలో రోడ్లపై గోతులు ఉండకుండా ప్యాచ్ వర్క్స్, డ్రెయిన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపులో జీఎంసీ అధికారులు సమన్వయంతో 2 రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఆదివారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి నగరంపాలెం వైపుగా జీజీహెచ్ వరకు విభాగాధిపతులతో కలిసి పర్యటించి, తీసు కోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. చాలా ప్రాంతాల్లో నిర్మాణ వ్యర్థాలను గమనించామని, వాటిని తొలగించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, వేణుగోపాల్, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటికి ఎన్‌టీఏ నాయకులు విజ్ఞప్తి

గుంటూరు(విద్య),జనవరి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యపై కలిసి ప్రభుత్వా నికి ప్రాతినిధ్యం చేయమని సంఘం నాయకులు కోరారు. పీఎఫ్ అనేది ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా ఉండాలి అని, గత ప్రభుత్వ హయాంలో 2022 నుంచి రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయులను స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణ కిందకు తీసుకొని వచ్చిన తర్వాత నుంచి పీఎఫ్ ఎకౌంట్లు లేక మున్సిపల్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం చాలా సందర్భాల్లో బకాయిలను పీఎఫ్ అకౌంట్లకు జమ చేస్తుందని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం లేకపోవడం వల్ల త్రిశంకు స్వర్గంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సాయి విశ్వనాథ్, అసోసియేట్ అధ్యక్షుడు పి.లలితబాబు, ఉపాధ్యక్షుడు ఏవీ కృష్ణారావు, గుంటూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవీ రామయ్య, బి.జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పేద వృద్ధులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తున్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని మాస్టర్ మైండ్స్ సంస్థల అధినేత మట్టుపల్లి మోహన్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముట్లూరు, ఎల్ఐసీ గాంధీ త్రి కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో వృద్ధులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి పెన్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఈ రోజున 300 మంది వృద్ధులకు రూ.1,500 చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల రూపాయలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మద్దు జయలక్ష్మి, సత్యవతి బాపనారాయణ, డాక్టర్ దేవి వైష్ణవి, శ్రీనన్నారాయణ హరిత, సంబూరి కృష్ణమూర్తి హనుమ, యమున తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న మద్దు రామకృష్ణయ్య, పాల్గొన్న మట్టుపల్లి మోహన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బోధనేతర సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

గుంటూరు (విద్య) జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది నూతన రాష్ట్ర కార్య వర్గ ఎన్నిక ఆదివారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా విద్యాసాగర్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పం, చిత్తూరు జిల్లా), కార్యదర్శిగా జి మురళి (ఎస్ ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ), కోశాధి కారిగా షేక్ అబ్దుల్ కరీం (బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మదనపల్లి), సహాధ్యక్షుడిగా ఈ.అశోక్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొవ్వ), ఉపాధ్యక్షు లుగా సేవా ప్రవీణ్ కుమార్ (ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తూర్పుగోదావరి జిల్లా), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏ చైతన్య (ఆర్జెడి కార్యాలయం గుంటూరు), సంయుక్త కార్యదర్శిగా ఉమామహేశ్వరి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), బి.బాలాజీ (ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాయల్పాడు, అన్నమయ్య జిల్లా), జివి ఉమామహేశ్వరి (ఎస్ ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ), జోనల్ కార్యదర్శిగా కె శివప్రసాద్(అనంతపురం), ఎల్.సునీత (విజయనగరం) ఈసీ సభ్యులుగా వి దుర్గానాథ్ (తిరువూరు), సురేష్ చంద్ర (సీతానగరం), వై.అభిషేక్ (పాలకొల్లు) ఎన్నికయ్యారు.

వేడుకగా తెలుగు భాషా సేవా పురస్కార ప్రదానం



డాక్టర్ కత్తి వేంకటేశ్వర్లుకు భాషా సేవా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్, పూర్వపు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా రోడ్డు, భారతీయ విద్యా భవన్లో ఆదివారం కృతజ్ఞతాంజలి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేది నుంచి గుంటూరులో జరిగిన తెలుగు మహాసభల్లో పురస్కారాలు అందుకోని వారికి ప్రత్యేకంగా ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా ఏపీ అధికార భాష కమిషన్ పూర్వపు రాష్ట్ర సభ్యుడు డా.కత్తి వెంకటేశ్వర్లుకు భాషాసేవా పురస్కారాన్ని సమర్పిస్తున్నా మని చెప్పారు. మిగిలిన వారికి కూడా ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. అనంతరం డాక్టర్ కత్తి వేంకటేశ్వర్లుకు భాషా సేవా పురస్కారాన్ని డాక్టర్ గజల్ శ్రీనివాస్, పూర్వపు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో సభల సమన్వయకర్త రామచంద్రరాజు, సుధాకర్‌నాయు డు, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, మేకల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భారతమాత పూజా దినోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంక టేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణమండపం వేదికగా సంస్కార భారతి ఆధ్వర్యంలో గత నెల నుంచి ప్రతి ఆదివారం జరి గే భారతమాత పూజా దినోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సంద ర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు, అనేక నృత్య కార్యక్ర మాలు, దేశభక్తుల వేషధారణ జరిగింది. ముగింపు కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సి పాల్ మల్లికార్జునరెడ్డి, డాక్టర్ శేషయ్య, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూ ల్ ఉపాధ్యాయులు కృష్ణవేణి, రేణుకాదేవి, విద్యావేత్త నూతలపాటి తిరుపత య్యలు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం అతిథులను సంస్కార భారతి అధ్యక్షుడు శ్రీధర్ ఘనంగా సత్కరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 10కే వాక్

● కిక్కిరిసిన ప్రారంభ వేదిక

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



10కే వాక్ లో ప్రసంగిస్తున్న ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ

గుంటూరు(క్రీడలు) జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం నడక.. గుంటూరు కోసం నడక అనే నినాదంతో 16 సంవత్సరాలుగా గుంటూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 10కే వాక్ ఉల్లాసంగా, ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. ఉదయం 6 గంటల ప్రారంభ సమయానికి చిన్న, పెద్ద వయస్సుల పురుషులు, మహిళలు, బాలబాలికలు వేలాదిగా తరలిరావడంతో ప్రారంభవేదిక కిక్కిరిసిపోయింది. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. విద్యానగర్ ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ నడక పోటీలు కొరిటిపాడు, అమరావతి రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఆర్టీవో ఆఫీస్, జేకేసీ కళాశాల రోడ్డు మీదుగా రింగ్ రోడ్డు వరకు వచ్చి అక్కడ నుంచి ప్రారంభ వేదిక వరకు సాగింది.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి : ఎంపీ లావు

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ యువత ప్రధానంగా శారీరక వ్యాయామంపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఇటువంటి కార్యక్ర మాలు నిర్వహించడం ద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందని, రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని, క్రీడా ఆంధ్రప్రదేశ్‌గా చేసే లక్ష్యంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈగల్ టీం ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన డ్రగ్స్ వ్యాపారం భారతదేశానికి పెనుముప్పుగా మారుతుందని, యువత ఇటువంటి వాటిని ముందుగా గమనించి జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీ నారాయణ, నక్కా ఆనందబాబు, రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ సజీల, రాయపాటి శైలజ, జనసేన నాయకుడు గాదె వెంకటేశ్వరరావు, వల్లూరి జయప్రకాష్ కన్వీనర్ కోయి సుబ్బారావు, తిలక్ బాబు, మలినేని పెరుమాళ్ళు, టీవీ రావు, మాజీ డీజీపీ ఎంవీ రావు, నరసరాజు, చిట్టాబత్తుని చిట్టిబాబు, పిల్లి మాణిక్యరావు, బీజేపీ నేత తిరుపతిరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో : ఆలపాటి రాజేంద్రప్రసాద్

డ్రగ్స్ వద్దు బ్రో, గంజాయికి బానిస అవ్వద్దు అంటూ ఎమ్మెల్సీ, పోటీల నిర్వాహకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ నినాదాన్ని పెద్ద ఎత్తున ప్రచారంలోకి తీసుకు వచ్చే విధంగా వేలాదిగా తరలివచ్చిన జన సమూహంతో పలుమార్లు అనిపించారు.

సినీ తారల సందడి...

పోటీలకు విచ్చేసిన వారిని ఉత్తేజపరిచేందుకు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీ తారలు రాజేంద్రప్రసాద్, కామ్నా జర్నలాని నగర ప్రజలను అలరించారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఇటు వంటి కార్యక్రమాలు పదేపదే నిర్వహించడం ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తి పెరుగు తుందన్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సమూహాన్ని తనదైన సినీ డైలాగులతో ఉత్తేజపరిచారు. వీరితోపాటు జబర్దస్త్ నటులు, మిమిక్రీ కళాకారులు కార్యక్రమాన్ని రక్తి కట్టిం చారు.

10కే వాక్ విజేతలు

నగరంలో ఆదివారం ఉదయం నిర్వహించిన 10కే వాక్ విజేతలను అధికారులు ప్రక టించారు. పురుషులు, మహిళలు, బాల బాలికల వివిధ వయస్సు విభాగాలకు ఈ పోటీ లు నిర్వహించారు. పురుషుల విభాగంలో వరుసగా శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, హరిబాబు మహిళల విభాగంలో లలిత, పుష్పజ, జబీనా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. 26 సంవత్సరాల పై విభాగంలో పురుషుల్లో అంకమ్మ, కృష్ణ కిషోర్, గురుబ్రహ్మం మహిళల్లో నూర్జహాన్, వాణి, స్రవంతి వరుస స్థానాల్లో నిలిచారు. 16 సంవత్సరాల పై బడిన బాలుర విభాగంలో నరసింహారెడ్డి, చరణ్‌రెడ్డి, ప్రశాంత్ చౌదరి బాలికల్లో జుబేరియా, పర్వీన్, హీన వరుస స్థానాల్లో నిలవగా 15 సంవత్సరాల బాలుర విభాగంలో షేక్ మహమ్మద్, రిష్విత్, సందీప్ కుమార్ బాలికల్లో కీర్తన, హేమశ్రీ, జ్యోతిశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అనంతరం జరిగిన బహుమతి కార్యక్రమంలో ముఖ్యఅతిథులు విజేతలకు ప్రశంస పత్రాలను, జ్ఞాపికలు, నగదు బహు మతులను అందజేశారు. వీరితో పాటు మొదటి పది స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ పోటీలను అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, టెక్నికల్ అధికారులు జీవీఎస్ ప్రసాద్, జీజే కిషోర్, బి.రామకృష్ణ, జి.సాంబశివరావు, పి.వెంకటేశ్వర్లు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు సమర్థవంతంగా నిర్వ హించారు.



10కే వాక్ లో అభివాదం చేస్తున్న సినీ నటులు రాజేంద్రప్రసాద్, కామ్న జెఠ్మలానీ



10కే వాక్ లో పాల్గొన్న యువతీ, యువకులు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లను రద్దు చేసినట్టు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో....

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరగాల్సిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) రద్దు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి గణతంత్ర్య వేడుకలు జరగనున్నాయి. ఆ తరువాత జిల్లా స్థాయి గణతంత్ర్య వేడుకలు పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉండాల్సి అవసరం ఉంటుందన్నారు.

వేద, దివ్యాంగ పాఠశాలలకు నిత్యావసరాల వితరణ



అంధ విద్యార్థులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సిరిపురపు శ్రీధర్

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప సేవా సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేట శ్రీసాయి దీన జన సేవాసమితి దివ్యాంగ పాఠశాల, సంపత్‌నగర్ శ్రీశృంగేరి వేద పాఠశాలలోని విద్యార్థులకు నిత్యావసర సరుకులను సమాఖ్య అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ అందజేశారు. కార్యక్రమంలో కుందుర్తి భాస్కర్ శర్మ, పాతూరి శ్రీనాథ్, పన్నాల సత్యనారాయణమూర్తి, దీక్షితులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బాల వికాస తరగతులు

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లోని శ్రీసాయినాథ సన్నిధానం ప్రాంగణంలో ఆదివారం శ్రీసత్యసాయి బాల వికాస తరగతులు ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజ రైన ఆలయ గౌరవ అధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్ మాట్లాడుతూ 5 నుంచి 14 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు నైతిక విలువలు, మానవ తా సంబంధ అవసరాలు క్రమశిక్షణ, దేశభక్తి, హిందూమత సంస్కృతి తది తర అంశాలపై తరగతులు, ఆటలు, పాటలు పిల్లల్లో సృజనాత్మకత పెంచేం దుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఆదివారం ఉద యం 10 గంటలకు ఈ తరగతులు జరుగుతుయాన్నారు.

వెల్ఫేర్ సొసైటీ టాక్సీ డ్రైవర్ అదృశ్యం

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని స్తంభాలగరువులో గల వెల్ఫేర్ సొసైటీలో టాక్సీ డ్రైవర్ గా పని చేస్తున్న కోయ మొహిద్దీన్ (53)అదృశ్యమయ్యాడు. ఆయన కుమార్తె ఆయేషా కృష్ణా జిల్లా గుడివాడలో నివాసం ఉంటుంది. గత నెల 27న ఆయేషా తన తండ్రికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమె గుంటూరు వచ్చి వెల్ఫేర్ సొసైటీలో అడగ్గా మొహిద్దీన్ 26న రెండు రోజులు పని ఉందని చెప్పి వెళ్ళి ఇప్పటివరకు తిరిగి రాలేదని చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులపై టాస్క్ ఫోర్స్ బృందం దాడులు

నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చినపలకలూరు గ్రామం క్వారీ పక్క గల పత్తి పొలాలలో పేకాట ఆడుతున్నారని టాస్క్ ఫోర్స్ సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది దాడి చేసారు. నల్లపాడు ఎస్‌బి సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న వారిపై రైడ్ చేసి, 7 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 7 టూ వీలర్స్, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.5,010 నగదు సీజ్ చే శారు. పోలీసుల రాకను గమనించి పారిపోయిన కొంతమంది పేకాట రాయుళ్ళ వివరాలు కూడా సేకరించి వారిపై చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు తెలిపారు.

రైల్వే బోర్డు ఆదేశాలు లేనందు వల్లనే!

● గుంటూరు డివిజన్ ఏసీఎం వినయ్‌కాంత్

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కి స్వాగతం పలికే విషయంలో తమకు రైల్వే బోర్డు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని గుంటూరు రైల్వే డివిజనల్ ప్రజా సంబంధాల అధికారి వినయ్‌కాంత్ తెలిపారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో అమృత్ భారత్ వచ్చింది... వెళ్లింది అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఈ రైలుకు దక్షిణ మధ్య రైల్వే పరిధి లో ఎలాంటి ప్రారంభోత్సవం/స్వాగత కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం తీసుకోలేద న్నారు. రైల్వేలో ప్రారంభోత్సవాలు, స్వాగత కార్యక్రమాలు రైల్వే బోర్డు జారీ చేసే మార్గ దర్శకాలకు అనుగుణంగానే జరుగుతాయని తెలిపారు.

వైభవంగా అమ్మవార్ల కొలుపుల మహోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనగర్, ఆరో లైన్‌లో కొలువైన త్రిశక్తి పీఠం శ్రీరేణుకమ్మ, పెద్ద అంకమ్మ, నాగేంద్ర స్వామి వార్ల 40వ వార్షిక కొలుపుల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల నడుమ దేవతమూర్తులను వాహనంపై అలంకరించి మంగళ వాయిద్యాలు, కనక తప్పట్లతో ఊరేగింపుగా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్ని త్రిశక్తి పీఠం నిర్వాహకుడు కస్తూరి యలమంద వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సౌర హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు దేవాల యాల్లో ఆదివారం రథసప్తమి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సూర్యనారాయణ మూల విరాట్‌కు వేద పండితులు క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్య జలాభిషేకం, అరుణ పారాయణం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తు న పాల్గొని స్వామి దర్శనం చేసుకుని, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

● స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై ఆదివారం ఉదయం రథసప్తమి పురస్కరించుకొని సూర్యభగవానునికి సువాసినులచే విశేష పొంగలి నివేదన జరిగింది. డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి నిర్వహణలో ఆదిత్య హృదయ పారాయణ, లలిత సహస్రనామ పారాయణ జరిగాయి.

● టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ హైస్కూల్లో విద్యార్థులతో సూర్య నమస్కారాలు నిర్వహించారు. హిందూ హైస్కూల్స్ అండ్ కాలేజ్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జీ శివరామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ ఆరోగ్య జ్ఞాన ప్రదాత సకలప్రాణి కోటి మనుగడకు కారణ భూతుడైన ప్రత్యక్ష భాగనునికి కృతజ్ఞతలు తెలపాలన్నారు.

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆదిత్య హృదయ పారాయణం చేస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీ లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా రథసప్తమి పురస్కరించుకుని వేద పండితులు ఆదిత్య హృదయ పారాయణం చేశారు.



ఇస్తేమాలో పాల్గొనేందుకు కడప చేరుకున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ నేతలు

శాంతి, సహనం, కరుణ మార్గాలు చూపే ఇస్లాం

● కడప ఇస్తేమా ప్రార్థనల్లో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజోతి): ఇస్లాం శాంతి, సహనం, కరుణ మార్గాలను చూపుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. కడప నగర శివారులో జరుగుతున్న అంతర్జాతీయ తబ్లిక్ జమాత్ దీని ఇస్తేమా కు మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, గుంటూరు తూర్పు మైనారిటీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 40 ఏళ్ల తర్వాత కడపలో అంతర్జాతీయ ఇస్తేమా నిర్వహణకు కూట మి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తెలిపారు కార్యక్రమానికి విచ్చేసిన లక్షల మంది కి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించిందన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ వ్యాప్తంగా ఇస్తేమాకు మత గురువులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు హాజరయ్యారని ఎమ్మెల్యే తెలిపారు. వారి ప్రసంగాలు సర్వమానవాళిని సన్మార్గంలో నడిపే విధంగా ఉన్నాయన్నారు. ప్రత్యేక ప్రార్థనలకు విచ్చేసిన వారి కోసం వలంటీర్లను నియమించి, వారికి సేవలందించారని తెలిపారు. అల్లాహ్ చెప్పిన విధంగా ఎదుటి వారికి సాయం చేయాలనే సందేశాన్ని మత గురువులు అందించారన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు చెప్పారు.



ఫీనిక్స్ మాల్‌లో వైద్య విద్యార్థుల ఫ్లాష్ మాబ్

ఫీనిక్స్ మాల్‌లో వైద్య విద్యార్థుల ఫ్లాష్ మాబ్

● సైన్స్ ఎగ్జిబిషన్‌పై ప్రచారం కోసం...

గుంటూరు మెడికల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కాలేజీలో 30 సంవత్సరాల తర్వాత మళ్లీ భారీ స్థాయిలో నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్ (మెడికల్ ఎగ్జిబిషన్)పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని జీటీ రోడ్‌లో గల ఫీనిక్స్ మాల్‌లో ఆదివారం వైద్య కళాశాల విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌పై ప్రజల్లో అవగాహన కోసం మెడికోలు మాల్ లో ఆకస్మికంగా చేపట్టిన ఫ్లాష్‌మాబ్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మెడికల్ ఎగ్జిబిషన్‌ను ఫిబ్రవరి 3న రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ ప్రారంభిస్తారు. సుమారు రూ.2 కోట్ల భారీ వ్యయంతో ఈ విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం కాలేజీ డెవలప్‌మెంట్ ఫండ్స్ వినియోగించుకొనేందుకు డీఎంఈ డాక్టర్ రఘునందన్ అనుమతి మంజూరు చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది

● విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

గుంటూరు(విద్య), జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ఓటు వేయడం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. ఆదివారం కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత రాజకీయ అవగాహన కలిగి చైతన్యవంతు లుగా మారాల్సిన అవసరం ఉందని డాక్టర్ రాధిక సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా విద్యార్థినులతో ప్రమాణం చేయించారు. వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో ప్రమాణం చేయించారు.



విద్యార్థినులతో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు

ఘనంగా స్నేహ పరిమళ రజతోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతిరోడ్డు, హిందు కాలేజీ ఫార్మసీ కళాశాలలో ఆదివారం స్నేహ పరిమళ రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుదీర్ఘ కాలంగా ఒకే కంపెనీలో పనిచేసి, పదవీ విరమణ పొందిన మెడికల్ రిప్రజెంటేటివ్‌లను, మేనేజర్‌లను ఘనంగా సత్కరించారు. దాదాపు 200మందికి పైగా సీనియర్ ఉద్యోగులను సత్కరించి, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ, ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాల్ని ఘనంగా డాక్టర్ కాకాని పృథ్వీరాజ్, డాక్టర్ ఎస్వీ రమణ. లక్ష్మీ పతి, సింగం లక్ష్మీ నారాయణ, తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉండే సీనియర్ ఉద్యోగులు హాజరయ్యారు.

వేడుకగా సంగీత కళాకారుల సంఘ వార్షికోత్సవం

గుంటూరు(తూర్పు), జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, అన్నదాన సమాజం ఆడిటోరియంలో జిల్లా సంగీత కళాకారుల సం ఘ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత సంస్థ వ్యవస్థాపక అధ్య క్షుడు ముద్దు వెంకటస్వామి ఆధ్వర్యంలో కందుకూరి రవి బృందంచే అనురా గం విరిసేనా పేరున సంగీత విభావరి నిర్వహిలాచారు. గాయనీ, గాయకులు సుధీర్, మల్లేశ్వరరావు గాయత్రి, సౌజన్య, సుభాషిణి తదితరులు పి.సుశీల, ఘంటసాల పాటలను ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరికి కీబోర్డ్ పై కే రవిబాబు, తబలాపై పీ బాలాజీ, ఎస్ వెంకట్, పాడ్స్‌పై ఏ రమణ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మిరియాల గోపి, అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పైలట్ కల నెరవేర్చుకోవచ్చు!



ఆకాశంలో విమానం చూడగానే అందులో మరీ ముఖ్యంగా మేఘాల మధ్య ప్రయాణించాలని చిన్న పిల్లలు అనుకుంటారు. వారిలో కొందరికి పైలట్‌గా మారి, ఆ విమానాన్ని తామే నడిపితే అన్న ఆలోచన కూడా రావచ్చు. అయితే ఈ రోజు ఆ కలను నిజం చేసుకోవచ్చు. కొద్ది వారాల క్రితం ఇండిగో సంక్షోభం తరవాత పైలట్లకు ఉన్న డిమాండ్ చాలా మందికి అర్థమై ఉంటుంది. వేగంగా వృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పైలట్లకు అవకాశం కల్పిస్తోంది. అపురూపమైన ఈ కెరీర్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పైలట్ కావాలనుకునే యువత టెన్త్ తరవాత సైన్స్ స్ట్రీమ్ అందునా ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ వైపు మొగ్గుచూపాలి. ఏవియేషన్‌కు ఈ సబ్జెక్టులే వెన్నెముక. పైలట్ శిక్షణ పొందేందుకు ఈ రెండు సబ్జెక్టుల్లో పట్టు తప్పనిసరి. పైలట్ కావాలని కలలుకనేవారికి దేహదారుఢ్యం, క్రమశిక్షణ, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలి. వైద్యపరంగానూ ఫిట్‌నెస్ అవసరం. డీజీసీఏ నిర్దేశించిన మెడికల్ పరీక్షలను క్లియర్ చేయాలి. స్పష్టమైన కంటిచూపు, అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండటం చాలా అవసరం.

- పైలట్ అయ్యేందుకు ముందుగా ఫిజిక్స్, మేథ్స్‌తో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు డీజీసీఏ అనుమతించిన ఫ్లయింగ్ శిక్షణ సంస్థలో సభ్యులుగా చేరాలి. ఒకటి తరవాత మరొక దశలోకి అంటే స్టూడెంట్ పైలట్ లైసెన్స్(ఎస్‌పీఎల్) నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్(సీపీఎల్) వరకు థియరీ పరీక్షలు పాస్ కావాలి. నిర్దేశిత గంటల మేరకు గగనయానాన్ని పూర్తి చేయాలి. సీపీఎల్ సాధించిన విద్యార్థులు - పైలట్లుగా నిర్దేశిత ఎయిర్‌క్రాఫ్ట్ శిక్షణ పొందాలి. తదుపరి ఎయిర్‌లైన్స్‌లో కో-పైలట్లుగా నియమితులవుతారు.
- ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేయగలిగితే ఈ రంగాన్ని ఎంచుకునే విద్యార్థులకు మేలు కలుగుతుంది. అకడమిక్‌గా గట్టి పునాది పడుతుంది. ప్రయోగశాలల్లో ప్రాక్టికల్‌గా అర్థమవుతుంది. ఐఐటీ, ఎన్ఐటీ సహా గీతమ్ వంటి డీమ్డ్ యూనివర్సిటీలో ఈ కోర్సు చదివితే ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ కూడా లభిస్తుంది. పైలట్ కాబోయే వారికి ఈ కోర్సు టెక్నికల్ ఎడ్జ్‌ను అందిస్తుంది. ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించిన వ్యవహారాలు తెలుస్తాయి. సేఫ్టీ, క్వాలిటీ కూడా అర్థమవుతుంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లకు సంబంధించి పటిష్టమైన సాంకేతిక అవగాహన ఉంటుందని భావించే ఎయిర్‌లైన్స్ సంస్థలు కూడా ఈ ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులను తీసుకునేందుకు ఉత్సుకతను కనబరుస్తున్నాయి.
- ఏరోస్పేస్ విద్యార్థులు బలమైన పైలట్లుగా రూపొందుతారు. ఎందుకంటే, ఎయిర్‌క్రాఫ్ట్ వ్యవస్థలు, పనితీరుపై వారికి మంచి అవగాహన ఉంటుంది. డీజీసీఏ థియరీ పరీక్షలకు ఉద్దేశించి బలమైన పునాది పడుతుంది. ఎయిర్‌లైన్ శిక్షణ, టైప్ రేటింగ్‌కు సంబంధించి అత్యున్నత విశ్వాసం కలిగి ఉండొచ్చు. పైలట్ కాదనుకుంటే ఇంకొన్ని అవకాశాలు - ఏవియేషన్, డిఫెన్స్, డ్రోన్లు, స్పేస్ రీసెర్చ్‌లోకి వెళ్ళవచ్చు. తద్వారా కెరీర్‌లో ఫ్లెక్సిబిలిటీ అలాగే సుదీర్ఘకాలిక ఉద్యోగ భద్రతకు అవకాశం కూడా కలుగుతుంది.
- కొత్తగా అల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఈ ఏడాదిలోనే సర్వీసులు ఆరంభించేందుకు పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) పొందాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శంక్ ఎయిర్ ఇప్పటికే అనుమతులు సాధించింది. ఉత్తర భారతంలోని విమానయాన సౌకర్యం అందుబాటులో లేని ప్రాంతాలకు ఇది విస్తరించే యోచనలో ఉన్నట్టు సమాచారం.
- వైమానిక రంగాన్ని మరింతగా విస్తరించే యత్నంలో భారత ప్రభుత్వం ఉంది. 2030 నాటికి ఏటా ముప్పయ్ లక్షల మంది ప్రయాణికులతో ప్రపంచంలోనే మూడో పెద్ద ఏవియేషన్ మార్కెట్‌గా అవతరించనుందని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్(ఐఏటీఏ) అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్టు వేల సంఖ్యలో పైలట్లు మన దేశానికే అవసరమవుతారని నిపుణులు చెబుతున్నారు.
- పెద్ద కలలు కనడమే కాదు, క్రమశిక్షణకు తోడు సంబంధిత సరైన చదువులు, ప్రాక్టికల్ శిక్షణ పొందిన యువతకు ఈ రంగం సదా ఆహ్వానం పలుకుతోందని చెప్పవచ్చు.

పైలట్ శిక్షణ సంస్థలు కొన్ని

- చైమ్స్ ఏవియేషన్ అకామీ, మధ్యప్రదేశ్
- రెడ్‌బర్డ్ ఫ్లయిట్ ట్రైనింగ్ అకాడమీ, బెంగళూరు
- ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ(ఐజీఆర్‌ఏయూ), ఫర్సత్‌గంజ్ ఎయిర్‌ఫీల్డ్, అమేథి, యూపీ
- దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఫ్లయింగ్ ట్రైనింగ్ స్కూళ్ళు (ఈ సంస్థలు డీజీసీఏ నిర్దేశించిన ఎయిర్‌లైన్ ప్రమాణాలు, అవసరాల మేరకు విద్యార్థులను సన్నద్ధం చేస్తాయి)
- నేషనల్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎఫ్‌టీఐ), గోండియా, మహారాష్ట్ర



- డాక్టర్ మహ్మద్ అక్తర్ ఖాన్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి,
గీతమ్ డీమ్డ్ యూనివర్సిటీ,
హైదరాబాద్.

దిక్సూచి

క్రాఫ్ట్స్ అండ్ డిజైన్‌లో కోర్సులు



క్రాఫ్ట్ అలాగే డిజైన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎదగాలనే లక్ష్యంతో ఏర్పాటైన సంస్థ ఐఐసీడీ. ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్ అండ్ డిజైన్ దీని పూర్తి స్వరూపం. స్వతంత్రప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో పీపీపీ మోడల్‌లో 2007 నుంచి పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ పలు కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోర్సులు: స్పెషలైజేషన్స్(హార్డ్ మెటీరియల్ డిజైన్, సాఫ్ట్ మెటీరియల్ డిజైన్, ఫైర్డ్ మెటీరియల్ డిజైన్, ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్, జ్యువెలరీ డిజైన్, క్రాఫ్ట్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్)

బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్: నాలుగేళ్ళు - ఎనిమిది సెమిస్టర్లు - పై స్పెషలైజేషన్లలో అన్నింటిలో కలిపి 180 సీట్లు - ఇంటర్ లేదా తత్సమా పరీక్ష ఉత్తీర్ణులు ఉత్తీర్ణత.

మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్: రెండేళ్ళు - నాలుగు సెమిస్టర్లు - పై స్పెషలైజేషన్లలో అన్నింటిలో కలిపి 60 సీట్లు - డిజైన్/ ఆర్కిటెక్చర్‌తో డిగ్రీ ఉత్తీర్ణత.

పీజీ డిప్లొమా ఇన్ డిజైన్ ఫౌండేషన్: ఒక ఏడాది కోర్సు - 20 సీట్లు - ఏ డిసిప్లిన్‌లో అయినా డిగ్రీ ఉత్తీర్ణత

ఎంపిక: ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష, వాట్సాప్ వీడియో కాల్‌తో పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://www.iicd.ac.in/

అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఏంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ - ఎంబీఏలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

సీట్లు: 75

అర్హత: ఏదైనా డిసిప్లిన్‌లో డిగ్రీ ఉత్తీర్ణత

ఎంపిక: 2025 క్యాట్ లేదా మ్యాట్ లేదా 2026 సీఎంఏటీకి హాజరై ఉండాలి. వీటి నుంచి షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటాయి.

వెబ్‌సైట్: www.uohyd.ac.in

అప్రెంటిస్‌షిప్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) చెన్నై యూనిట్ 84 అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు: డిప్లొమా అప్రెంటిస్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్) 10, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్) 64, బీకామ్/బీబీఏ/బీబీఎం 10

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్, బీకామ్/బీబీఏ/బీబీఎంలో ఉత్తీర్ణత

ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 5, 6, 7తేదీల్లో(బెల్, చెన్నై)

మరిన్ని వివరాల కోసం: For clarifications regarding NATS registration, please contact 044 - 2233 8135 / 142

యూసీఐఎల్, జాడుగూడ మైన్స్

యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్(జార్ఖండ్ రాష్ట్రం - జాడుగూడ మైన్స్)లో అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: మైనింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఫైనాన్స్ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, టర్నర్, కార్పెంటర్, ప్లంబర్ తదితరాలు

ఖాళీల వివరాలు: ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ 269, డిప్లొమా టెక్నీషియన్ 60. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ 35


అర్హత: ఖాళీలను అనుసరించి ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణత

ఎంపిక: విద్యార్హతలో సాధించిన మెరిట్ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు

మరిన్ని వివరాల కోసం: trade: https://apprenticeshipindia.gov.in/ technician and diploma and graduation apprenctice: https//nats.education.gov.in/student register.php

జాబ్ కార్నర్



న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ - సివిల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ తదితర విభాగాల్లో 114 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు: సైంటిఫిక్ అసిస్టెంట్/బి(సివిల్) - 2, స్టైపెండరీ ట్రైనీ/ టెక్నీషియన్ - 95, ఎక్స్‌రే టెక్నీషియన్ - 2, అసిస్టెంట్ గ్రేడ్-1 - 15

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 4

వెబ్‌సైట్: www.npcilcareers.co.in

NPCIL

నిట్, వరంగల్‌లో నాన్‌టీచింగ్ స్టాఫ్

వరంగల్‌లోని నిట్ నాన్ టీచింగ్ స్టాఫ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు: సూపరింటెండెంట్ - 2, టెక్నికల్ అసిస్టెంట్ - 11, సీనియర్ అసిస్టెంట్ - 2, సీనియర్ టెక్నీషియన్ - 7, జూనియర్ అసిస్టెంట్ - 3, టెక్నీషియన్ - 14

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతకు తోడు అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://nitw.ac.in/Careers/

చిత్రజ్యోతి

SINCE 1965

వెండితెర వెలుగులకు పద్మవైభవం



గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో సినీరంగం మెరిసింది. భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన దిగ్గజాలకు కేంద్రం అత్యున్నత పురస్కారాలతో పట్టం కట్టింది. దివంగత బాలీవుడ్ నటుడు 'హీమ్యాన్' ధర్మేంద్రకు మరణానంతరం దేశ రెండో అత్యున్నత పురస్కారం 'పద్మ విభూషణ్' ప్రకటించారు.



యాక్షన్, ఎమోషన్, రొమాన్స్‌లను సమపాళ్లలో పండించి 'హీ మ్యాన్'గా కోట్లాది మంది గుండెల్లో గూడుకట్టుకున్న దివంగత నటుడు ధర్మేంద్రను కేంద్రం 'పద్మ విభూషణ్'తో గౌరవించింది. గతేడాది ధర్మేంద్ర మనల్ని విడిచి వెళ్లారు. కళారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించారు. పంజాబ్ నుంచి ముంబైకు వచ్చి, ఎలాంటి సినీ నేపథ్యం లేకుండానే స్టార్‌డమ్ సాధించిన నటుడు ధర్మేంద్ర. 1960ల్లో తన సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఆయన 'షోలే, ధరమ్ వీర్, సీతా ఔర్ గీతా, చుప్కే చుప్కే' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించారు. మూడొందలకు పైగా చిత్రాల్లో నటించారు. హీరో అంటే కండలు తిరిగిన దేహంతో ఉండాలనే ట్రెండ్‌కు ఆయనే ఆద్యుడు. ఎంపీగా ప్రజా సేవలోనూ పాలుపంచుకున్నారు. ధర్మేంద్రకు పద్మ విభూషణ్ పురస్కారం దక్కడం పట్ల ఆయన సతీమణి హేమమాలిని హర్షం వ్యక్తం చేశారు.

మలయాళ మెగాస్టార్‌కు పద్మ భూషణ్



దక్షిణాది సినిమా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన దిగ్గజ నటుడు, మలయాళ మెగాస్టార్ మమ్ముట్టిని ప్రతిష్ఠాత్మక 'పద్మభూషణ్' వరించింది. ఐదు దశాబ్దాలుగా వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన నటనా పటిమకు కేంద్రం పట్టం కట్టింది. న్యాయవాదిగా కెరీర్‌ను ప్రారంభించి, ఆ తర్వాత నటుడిగా మారి సినీరంగంలో అత్యున్నత స్థానాన్ని అందుకున్న మమ్ముట్టి ప్రస్థానం అద్భుతం. నాలుగొందలకు పైగా చిత్రాల్లో నటించిన ఆయన, మూడుసార్లు ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకోవడం విశేషం. 'మదిలుకల్, ఒరు వడక్కన్ వీరగాథ, అంబేద్కర్' వంటి చిత్రాలు ఆయన నట విశ్వరూపానికి నిదర్శనాలు. 70 ఏళ్ల వయసులోనూ యువ నటులకు పోటీగా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ఆయన దూసుకుపోతున్నారు.

90వ దశకాన్ని ఉర్రూతలూగించిన స్వరం



తన మధురమైన స్వరంతో మూడు దశాబ్దాల పాటు భారతీయ సినీ సంగీత ప్రపంచాన్ని ఏలిన ప్రముఖ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్‌ను 'పద్మ భూషణ్'తో సత్కరించారు. ఆమె గొంతునుంచి జాలువారిన వేలాది మెలోడీ గీతాలకు దక్కిన గుర్తింపు ఇది.

ఆరేళ్ల వయసులోనే ఆకాశవాణిలో పాటలు పాడడం మొదలుపెట్టిన అల్కా 'తేజాబ్' సినిమాలోని 'ఏక్ దో తీన్' పాటతో సంచలనం సృష్టించారు. హిందీతో పాటు తెలుగు బెంగాలీ సహా 20కు పైగా భాషల్లో ఇరవై వేలకు పైగా పాటలు పాడారు. ఉత్తమ గాయనిగా రెండు జాతీయ అవార్డులు, ఏడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆమె గొంతు ఈ నాటికీ శ్రోతలకు ఆరాధ్యమే.

బహుముఖ సేవలకు గుర్తింపు



తెలుగు చిత్ర పరిశ్రమలో సౌమ్యుడిగా పేరుగాంచిన సీనియర్ నటుడు, నిర్మాత మాగంటి మురళీ మోహన్‌ను 'పద్మశ్రీ' వరించింది. హీరోగా నట ప్రస్థానం ప్రారంభించి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, నిర్మాతగా, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరిశ్రమకు ఆయన అందించిన బహుముఖ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం వరించింది. 1973లో 'జగమే మాయ' చిత్రంతో తెరంగేట్రం చేసిన మురళీ మోహన్, 350కు పైగా చిత్రాల్లో నటించారు. జయభేరి ఆర్ట్స్ పతాకంపై నాణ్యమైన చిత్రాలను నిర్మించారు. పరిశ్రమకు పెద్దగా, ఎందరో కళాకారులకు అండగా నిలిచారు. గతంలో రాజమండ్రి ఎంపీగా ఆయన సేవలందించారు. పద్మశ్రీ పురస్కారం దక్కిన సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 'నేను సినీ జీవితంలోకి ప్రవేశించి, 52 ఏళ్లు అవుతోంది. నా సేవలను గుర్తించి కేంద్రం పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం ఆనందం కలిగించింది. చేతనైనంత వరకూ పేదలకు సాయం చేయాలనేదే నా ఆశయం' అని చెప్పారు.

ప్రతిభకు పట్టం



చాక్లెట్ బాయ్‌గా పరిచయమై, విలక్షణ నటుడిగా, దర్శకుడిగా ఎదిగిన ఆర్. మాధవన్‌ను కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది. భాషా భేదం లేకుండా, దక్షిణాది, ఉత్తరాది ప్రేక్షకులను సమానంగా మెప్పించిన ఆయన ప్రతిభకు ఈ అవార్డు నిదర్శనం.

మణిరత్నం 'సఖి' (అలైపాయుతే) సినిమాతో అమ్మాయిల కలల రాకుమారుడిగా మారిన మాధవన్ ఆ ఇమేజ్‌లో ఇరుక్కుపోకుండా ప్రయోగాలు చేశారు. '3 ఇడియట్స్, విక్రమ్ వేద' లాంటి సినిమాల్లో ఆయన నటన అద్భుతం. ఆయన స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. శాస్త్ర సాంకేతిక విషయాలపై ఆయనకున్న అవగాహన, సినిమాపట్ల ఆయనకున్న అంకితభావం ఆయనను ఈ స్థాయికి చేర్చాయి.

నవ్వుల రేడుకు పద్మ పురస్కారం



తెలుగు తెరపై హాస్యానికి కొత్త నిర్వచనం చెప్పి, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ ప్రశంసలు అందుకున్న 'నట కిరీటి' రాజేంద్రప్రసాద్‌ను కేంద్రం పద్మశ్రీతో గౌరవించింది. హీరోగా ఒక తరాన్ని నవ్వించి, ఇప్పుడు తండ్రి, తాత పాత్రల్లో అలరిస్తున్నారు.

వంశీ దర్శకత్వంలో వచ్చిన 'లేడీస్ టైలర్' చిత్రం రాజేంద్రప్రసాద్ కెరీర్‌ను మలుపుతిప్పింది. 'అహ నా పెళ్లంట, అప్పుల అప్పారావు' చిత్రాలతో ఆయన కామెడీ కింగ్‌గా మారారు. 'ఆ నలుగురు' సినిమాతో ఆయనలోని పరిపూర్ణ నటుణ్ణి ప్రపంచం చూసింది. రెండొందలకు పైగా చిత్రాల్లో నటించిన ఆయన తెలుగు సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరు.

వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్‌కుమార్ రస్తోగి, అరవింద్ వైద్య, సతీశ్ షా (మరణానంతరం) ప్రముఖ బెంగాలీ నటుడు ప్రసేన్‌జిత్ చటర్జీ, యాడ్ ఫిల్మ్ మేకర్ పియూష్ పాండే (మరణానంతరం)లను పద్మ శ్రీ పురస్కారాలు వరించాయి.



అమరావతిలో తొలిసారి నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకలకు సిద్ధమైన ప్రాంగణం





అమరావతిలో తొలిసారి నిర్వహించనున్న రిపబ్లిక్ డే వేడుకల ప్రాంగణం ముఖద్వారం

రిపబ్లిక్ డే.. స్వేచ్ఛా పోరాటానికి స్ఫూర్తి

రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రదర్శించనున్న శకటాలు







- గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్



అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్వతంత్ర్య స్వేచ్ఛాఫలాలను ఆస్వాదించడానికి దోహదపడిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే రోజు గణతంత్ర దినోత్సవమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. జాతీయ స్వేచ్ఛా పోరాటానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి వంటి గొప్ప ఆదర్శాలకు పునంకితమయ్యే రోజు ఇదని చెప్పారు. రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభదినాన మన దేశ మూల స్తంభాలైన... న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాన్ని సమర్థించడం ద్వారా దేశ నిర్మాణ లక్ష్యానికి మనమంతా కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేద్దామని గవర్నర్ పిలుపునిచ్చారు.

పద్మ అవార్డులు పొందినవారికి గవర్నర్ అభినందనలు

పద్మ అవార్డులు పొందిన రాష్ట్రానికి చెందిన ప్రముఖులకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు లోక్‌భవన్ ఆదివారం ఒక ప్రకటన జారీచేసింది. కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ ఇండో-అమెరికన్ వైద్యుడు డా.నోరి దత్తాత్రేయుడు ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైనందుకు అభినందనలు తెలిపారు. అలానే పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన రాజేంద్రప్రసాద్, మురళీ మోహన్, వెంపటి కుటుంబ శాస్త్రిలకు, మరణానంతరం పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కుటుంబసభ్యులకు కూడా గవర్నర్ అభినందనలు తెలిపారు.

అసెంబ్లీ, సచివాలయాలకు గణతంత్ర శోభ



రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయం

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భవనాలు రాత్రివేళ దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. వీటితో పాటు ప్రాంగణంలోని రోడ్లు, సెంట్రల్ పార్కులో విద్యుత్ వెలుగులు మిరుమిట్లు గొలుపుతూ పండుగ వాతావరణం నెలకొంది. సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఉండే మొదటి భవనాన్ని ప్రత్యేకంగా త్రివర్ణ పతాక వర్ణం ఉట్టిపడేలా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సచివాలయ ప్రవేశ మార్గానికి సమీపంలోని ఐదో బ్లాక్, అసెంబ్లీ భవనాన్ని కూడా ఇదే రీతిలో తీర్చిదిద్దారు. గణతంత్ర వేడుకలకు విజయవాడలోని లోక్ భవన్, ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం సహా ప్రకాశం బ్యారేజ్, ఇతర చారిత్రక ప్రాముఖ్యమున్న భవనాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం 7.30గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎస్ విజయానంద్, 8గంటలకు కౌన్సిల్ భవనం వద్ద శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, 8.15 గంటలకు అసెంబ్లీ భవనం ముందు స్పీకర్ అయన్నపాత్రుడు, 10గంటలకు నేలపాడులోని హైకోర్టు వద్ద చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు.

ఏపీ పోలీసులకు పతకాల పంట

- రాష్ట్రపతి మెడల్ సహా 19 సేవా పతకాలు
- దేశవ్యాప్తంగా 982 మందికి శౌర్య, సేవా పతకాలు

న్యూఢిల్లీ, అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర హోంశాఖ ఆదివారం ప్రకటించిన శౌర్య, సేవా పతకాల్లో ఏపీ పోలీసులు పతకాల పంట పండించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒకరికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం రాగా, 15 మంది పోలీసులు, ముగ్గురు జైళ్లశాఖ అధికారులకు సేవా పతకాలు లభించాయి. దేశవ్యాప్తంగా పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డ్ అండ్ సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్‌లకు చెందిన మొత్తం 982 మందికి హోంశాఖ శౌర్య, సేవా పతకాలు ప్రకటించింది. వారిలో 125 మందికి శౌర్య పతకాలు (గ్యాలెంట్రీ మెడల్స్), 101 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవాపతకాలు, 756 మందికి ప్రతిభా సేవా పతకాలు (మెడల్స్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) దక్కాయి.

డీఎస్పీ రవి మనోహరాచారికి రాష్ట్రపతి మెడల్

రాష్ట్రానికి చెందిన డీఎస్పీ రవి మనోహరాచారికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం దక్కింది. పోలీస్ సర్వీస్ విభాగం కింద 15 మంది ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. పోలీసుల్లో విక్రమరావు కామవరపు (ఎస్ఐ), కృష్ణమోహన్ సింగాల (అడిషనల్ ఎస్పీ), నరసింహారావు కుందేటి (సీఐ), శివరెడ్డి రాయపు (డీఎస్పీ), శ్రీనివాసరెడ్డి (ఏఎస్ఐ), రంగయ్య గల్లా (హెడ్ కానిస్టేబుల్), జయరాం కటారి (ఆర్మ్‌డ్ ఎస్ఐ), గంగాధరరావు (ఏఎస్ఐ), నరసింహులు (హెడ్ కానిస్టేబుల్), వెంకటకృష్ణ మునీశ్వరరావు (ఆర్మ్‌డ్ ఎస్ఐ), అబ్రహం అన్నాలదాసు (ఏఎస్ఐ), రామకృష్ణ కొప్పిశెట్టి (ఏఎస్ఐ), మల్లికార్జునరావు (అసిస్టెంట్ కమాండెంట్), షేక్ షఫీయుల్లా (ఎస్ఐ), రామారావు (అసిస్టెంట్ కమాండెంట్) ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. జైళ్లశాఖ నుంచి రవిబాబు గొల్లపోతు (జైలర్), వెంకట కృష్ణప్రసాద్ (చీఫ్ హెడ్ వార్డర్), జి. ఆనందరావు (హెడ్ వార్డర్)కు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. ఇది క్రమ శిక్షణ, వృత్తి నైపుణ్యం, ప్రజాసేవకు లభించిన గౌరవం అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అభిప్రాయపడ్డారు.

కేంద్ర సర్వీసుల్లోని తెలుగువారికీ గౌరవం

సీఆర్‌పీఎఫ్, సీబీఐ, బీఎస్ఎఫ్ వంటి కేంద్ర సర్వీసుల్లో పనిచేస్తున్న తెలుగువారు కూడా పతకాలు దక్కించుకున్నారు. సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కె.విశ్వనాథ్‌గౌడ్‌కు శౌర్య పతకం, సీబీఐ హెడ్‌కానిస్టేబుల్ రాముకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, సీబీఐ జాయింట్ డైరక్టర్ వెంకట సుబ్బారెడ్డి, బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ జయకుమార్, సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐ వై.నాగేశ్వర్‌రావు, కేంద్ర హోంశాఖలో అసిస్టెంట్ డైరక్టర్ శైలేంద్రరావుకు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. త్రివిధ దళాలలో పనిచేస్తున్న తెలుగువారు పతకాలకు ఎంపికయ్యారు. ఎయిర్‌మార్షల్ సీతేపల్లి శ్రీనివాస్‌కు పరమ్ విశిష్ట సేవా పతకం, వైస్ అడ్మిరల్ కుదరవల్లి శ్రీనివాస్, ఎయిర్ వైస్ మార్షల్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, ఎయిర్ వైస్ మార్షల్ వాడపల్లి రవి సత్యనారాయణ రాజుకు అతి విశిష్ట సేవా పతకం, ఆర్మీ మేజర్ గుమ్మడి శ్రీనివాస్‌కు, నేవీ రేర్ అడ్మిరల్ శ్రీనివాస్, సరిహద్దు రహదారుల అభివృద్ధి బోర్డు సివిల్ ఇంజనీర్ ఆర్.శ్రీనివాసరావు విశిష్ట సేవా పతకాలను ప్రకటించారు.



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎస్ విజయానంద్, రాష్ట్ర ఎన్నికల మాజీ ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రధానం

- ఎన్నికలకు ప్రజలు ప్రధానం.. ఓటు.. హక్కు కాదు బాధ్యత
- జాతీయ ఓటర్ల దినోత్సవంలో సీఎస్ విజయానంద్

విజయవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రధానం, ఎన్నికలకు ప్రజలు ప్రధానం, ప్రజాస్వామ్య పటిష్ఠానికి ఓటు హక్కు వినియోగమే పునాది' అని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. భారత ఎన్నికల సంఘం 1950 జనవరి 26న స్థాపించబడిన సందర్భంగా ప్రతి ఏటా అదే తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఓటింగ్ ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, యువ ఓటర్లను ప్రోత్సహించడం, వారి హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. 'ఈ ఏడాది "నా భారత్-నా ఓటు" థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటు వేయడం హక్కు మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత. ప్రతి ఓటూ ప్రజాస్వామ్య భారత నిర్మాణానికి బలమైన పునాది వేస్తుంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. దీని బలం పౌరుల భాగస్వామ్యంలోనే ఉంది. యువత ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకుని, ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలి' అని పిలుపిచ్చారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఓటు నమోదు చేసుకోవడానికి జనవరి 1వ తేదీని మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారని.. ఇప్పుడు కొత్తచట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు సంవత్సరంలో నాలుగు తేదీల్లో (జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1) ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కేవలం ఎపిక్ కార్డు ఉంటే ఓటువేసే హక్కు రాదని, ఓటరు జాబితాలో అభ్యర్థి పేరు ఉందో లేదో సీఈవో వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఓటు వేయడం రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రకారం లభించే భావప్రకటన, వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఒక వ్యక్తి సాధారణంగా ఎక్కడ నివసిస్తుంటే అక్కడ ఓటుహక్కు కల్పించాలని.. వ్యక్తి పుట్టిన చోటు, ఉద్యోగం చేసే చోటు వేర్వేరుగా ఉండవచ్చని.. తన ఓటు ఎక్కడ ఉండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను అతడికివ్వాలని తెలిపారు. తర్వాత నూతనంగా ఓటు నమోదు చేసుకున్న నలుగురికి ఎపిక్ కార్డులు అందజేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యంపై మతం, కులం, జాతి, భాషాపరమైన ప్రలోభాలకు నవ్వకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని కార్యక్రమానికి హాజరైన వారితో సీఎస్ ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ ఎన్నికల నిర్వహణ అవార్డులను పలు జిల్లాల కలెక్టర్లకు అందించారు. అంతకుముందు భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వర్చువల్‌గా మాట్లాడారు. '2025 ఎన్నికల కమిషన్‌కు గణనీయమైన విజయాలు, ఆవిష్కరణల సంవత్సరంగా నిలిచింది. ఓటర్ల జాబితాలో కచ్చితత్వాన్ని, సమగ్రతను పెంపొందించడం, ఓటింగ్ ప్రక్రియను ప్రతి ఓటరుకు మరింత సులభంగా అందుబాటులోకి తెచ్చి.. ఎన్నికల సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడమే ఈసీ లక్ష్యం' అని తెలిపారు.

ఎడారీకరణ.. నియంత్రణ..!

అనంతపురం జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో ఇసుక మేటల విస్తరణ కట్టడి

- కుంటల నిర్మాణాలతో భూగర్భ జలాల పెంపు
- కరువు కట్టడికి జల సంరక్షణ చర్యలు
- మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకం
- 'మన్‌కీ బాత్'లో ప్రస్తావించిన ప్రధాని



దర్గాహొన్నూరులో విస్తరించిన ఇసుక మేటలు



రైతులు సాగుచేసిన సపోటా పంట

రాయదుర్గం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కరువుకు చిరునామాగా ఉన్న అనంతపురం జిల్లాలో ఎడారి ఛాయలు కనిపిస్తున్నాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలోని వేదవతి హగరి నది పరీవాహక ప్రాంతంలో విస్తరిస్తున్న ఇసుక మేటలే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ ప్రభావంతో ఓవైపు భూగర్భజలాలు అడుగంటిపోతుండగా.. మరోవైపు సారవంతమైన భూములు చౌడుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అధికారులతో పాటు ప్రజలు చేపడుతున్న చర్యలతో పరిస్థితులు మెరుగవుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యాన పంటల సాగు, జిల్లాలో ఎడారీకరణను నియంత్రించే చర్యల్లో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో నీటి కుంటల నిర్మాణాలతో భూగర్భ జలాల పెంపు, మొక్కల పెంపకం లాంటి అంశాల గురించి ప్రధాని మోదీ ఆదివారం తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇసుక మేటలను నియంత్రించేందుకు నీటి యాజమాన్య సంస్థ, అటవీ శాఖ చేస్తున్న కృషి గురించి వివరించారు. భూగర్భ జలాల పెంపుతో పాటు వర్షం నీటి నిల్వ కేంద్రాలను పెంచుకోవడంపై అభినందించారు.

ఇసుక తరలింపునకు చర్యలు

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో 4 వేల ఎకరాలకుపైగా ఇసుక మేటలు విస్తరించాయి. ఏటా పడమటి వైపు నుంచి వీచే గాలులతో తూర్పు వైపున ఇసుక మేటలు విస్తరించి సాగు భూములను కప్పేస్తున్నాయి. రైతులు పంటలు పండించలేక బీడు భూములుగా వదిలేస్తున్నారు. ఇసుక విస్తరణను నియంత్రించేందుకు 22 గ్రామాల ప్రజలు ఏటా నానా ఇబ్బందులు పడుతుంటారు. ఇసుక మేటల నియంత్రణకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు చేపట్టారు. నల్ల రేగడి పొలాల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు ఇసుక దోహదపడుతుందని రైతులు భావించడంతో ఇసుక తరలింపునకు 2014 నుంచి అనుమతించారు. ప్రభుత్వం ద్వామా ఆధ్వర్యంలో రైతులకు చేయూతనందిస్తోంది.

మొక్కల పెంపకంతో కట్టడి

ఉద్యాన పంటల సాగుతో ఇసుక మేటల విస్తరణ కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. రాజస్థాన్ ప్రభుత్వ బృందం జిల్లాలో పర్యటించి, ప్రభుత్వానికి ఓ నివేదిక అందించింది. ఇసుక మేటలు విస్తరణను కట్టడి చేసేందుకు పరీవాహక ప్రాంతంలో మొక్కలు పెంచాలని సూచించింది. ఆ మేరకు మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు తక్కువ సమయంలో ఎక్కువ ఎదుగుదల పొందేలా మియావాకీ పద్ధతి దోహదపడుతుంది. అటవీ, నీటి సంరక్షణ శాఖల ఆధ్వర్యంలో పరీవాహక ప్రాంతంలో గోరింటాకు, సరుగుడు లాంటి మొక్కలతోపాటు ఇసుకపై అల్లుకుపోయే మొక్కలను నాటి ఇసుక మేటల విస్తరణను కట్టడి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.60 కోట్ల దాకా నిధులను మంజూరు చేసి, చర్యలను వేగవంతంగా చేశాయి.

సపోటా సాగుతో కొంతమేర నియంత్రణ



ఉద్యాన పంటల సాగుతో పొలంలో ఇసుక విస్తరణను కట్టడి చేయవచ్చనే అధికారుల సూచనతో ఏడేళ్ల క్రితం సపోటా సాగు చేశా. ఇప్పుడు అధిక దిగుబడి ఇస్తోంది. ప్రభుత్వమే బోరు వేయించి, డ్రిప్ సౌకర్యం కల్పిస్తోంది. పంట సాగుతో ఇసుక బాగా తగ్గిపోయింది.

- తిప్పేస్వామి, దర్గాహొన్నూరు, బొమ్మనహాళ్ మండలం

రంగుల విదేశీ అతిథులు



ప్రతి ఏటా జనవరిలో వచ్చే విదేశీ అతిథుల కిలకిలరావాలు.. పచ్చని చెట్లపై రంగురంగుల పక్షుల సందడి! ఇది ఎక్కడో పక్షుల సంరక్షణ కేంద్రంలో కాదు.. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం వెంకటాపురం గ్రామంలో కనిపించే కనుల విందైన దృశ్యం. ఎక్కడో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే 'పెయింటెడ్ స్టార్క్స్' అనే పక్షులు ఈ గ్రామాన్ని దశాబ్దాలుగా తమ సురక్షిత విడిదిగా మార్చుకున్నాయి. జనవరి మాసంలో గ్రామానికి వచ్చే ఈ పక్షులు ఎత్తైన చెట్లపై గూళ్లు నిర్మించి, గుడ్లు పెడతాయి. మే-జూన్ నాటికి పిల్లలు పెద్దవయ్యాక తిరిగి వాటిని తీసుకొని వెళ్లిపోతాయి. ఈ పక్షులు ప్రధానంగా చేపలను ఆహారంగా తీసుకుంటాయి. దాహం వేసిన సమయంలో గ్రామంలోని ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండే నీటిని తాగుతాయి. వేటగాళ్లు ఎవరూ గ్రామంలోకి రాకుండా.. గ్రామస్తులే రక్షణ కవచంగా నిలుస్తున్నారు. అయితే ప్రస్తుతం కోతుల కారణంగా పక్షుల గుడ్లు నాశనమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనంతలో జల సంరక్షణ భేష్!


- కరువు జిల్లాలో ప్రజలు, యంత్రాంగం సంయుక్త కృషితో నీటి వనరుల అభివృద్ధి
- 7 వేలకు పైగా మొక్కలు కూడా నాటారు
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే జలవనరుల పునరుద్ధరణ సాధ్యమని ప్రధాని మోదీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన జలసంరక్షణ చర్యలను ఆదివారం తన 'మన్ కీ బాత్' ప్రసంగం సందర్భంగా ప్రశంసించారు. అనంతపురం జిల్లాలో జరిగిన నీటి సంరక్షణ పనులను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "తీవ్ర కరువుతో, ఎర్ర నేలలతో ఎడారిని తలపించే అనంతపురంలో నీటి ఎద్దడి ప్రధాన సమస్యగా ఉండేది. అక్కడ ఎక్కువ ప్రాంతాల్లో వర్షాలు పడవు. అందుకే.. అక్కడి ప్రజలు అనంతపురాన్ని ఎడారితో పోలుస్తారు. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో స్థానిక ప్రజలు, యంత్రాంగం కలిసి నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అవి నీటితో కళకళలాడుతున్నాయి. దీనితోపాటు 7 వేలకు పైగా మొక్కలు నాటారు. తద్వారా అనంతపురంలో నీటి సంరక్షణతోపాటు పచ్చదనం కూడా పెరిగింది. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి మొత్తం పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించబడింది. అక్కడి ప్రజలు, పాలకులు చేసిన ఈ సామూహిక కృషి ఎంతో గర్వకారణం" అని మోదీ కొనియాడారు. అలాగే యూపీలోని ఆజంగఢ్ ప్రజలు తమ ప్రాంతంలో ప్రవహించే తంసా నదిని పునరుద్ధరించిన తీరును అభినందించారు. కాలుష్యం, పూడిక, చెత్తాచెదారంతో నిండిన ఆ నదిని ఓ ఉద్యమంలా శుభ్రం చేశారన్నారు. దేశ ప్రజల్లో ఉన్న సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించుకునే తత్వం అద్భుతమని పేర్కొన్నారు.

అనంత జలసంరక్షణపై మీ స్పందనకు వందనం!

- మోదీకి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు



అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో జలసంరక్షణ చర్యల గురించి ప్రధాని మోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. నీటి సంరక్షణలో అనంతపురం ప్రజలు చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రయత్నాలను హైలెట్ చేసినందుకు మోదీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ కింద నిర్దేశించుకున్న పది సూత్రాల్లో నీటి భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొన్న సీఎం.. సాంప్రదాయ నీటి నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించి నీటి వనరులను సంరక్షిస్తున్నామని పేర్కొన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ సందేశం నీటి భద్రతా మిషన్‌లో మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తుందని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆ 'సామాన్యులకు' పద్మశ్రీ

సమాజాన్ని జాగృతం చేసిన 54 మంది సామాన్యులకు కేంద్రం గుర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 25: పేరు, ప్రచారం కోసం కాకుండా సమాజానికి ఏదైనా చేయాలనే ఆశతో తమ జీవితాన్ని త్యాగం చేసిన సామాన్యుల కృషిని కేంద్రం గుర్తించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, సమాజసేవ, కళలు ఇలా తాము ఎంపిక చేసుకున్న రంగంలో అసామాన్య కృషి చేస్తున్న 54 మంది సామాన్యులను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. ఇందులో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేసిన బుద్రి తాటి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న మహారాష్ట్రకు చెందిన రఘువీర్ తుకారామ్ ఖేడ్కర్ ఉన్నారు. అలాగే, 88 ఏళ్ల వయస్సులో పారిశుధ్యం, పరిసరాల పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి ఇంద్రజీత్ సంధును కూడా కేంద్రం పద్మశ్రీకి ఎంపిక చేసింది. హైదరాబాద్‌కు చెందిన జన్యు శాస్త్రవేత్త కుమారస్వామి తంగరాజ్, అవయ దానానికి సంబంధించిన డొనేట్ లైఫ్ సంస్థ వ్యవస్థాపకులు గుజరాత్‌కు చెందిన నీలేశ్ వినోద్‌చంద్ర మండేవాలా కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. వీరితోపాటు బుండేలి యుద్ధకళ శిక్షకుడైన మధ్యప్రదేశ్‌కు చెందిన భగవాన్‌దాస్ రాయికర్, సిలంబం యుద్ధ క్రీడను అభివృద్ధి చేసిన పుదుచ్చేరికి చెందిన పజనీవేల్ కూడా జాబితాలో ఉన్నారు. అలాగే, హిందీ ప్రచారం కోసం 60ఏళ్లకు పైగా శ్రమిస్తున్న సీనియర్ జర్నలిస్టు కైలాష్ చంద్రపంత్, కశ్మీరీ సాహితీవేత్త షఫీ షౌక్, త్రిపురకు చెందిన కోక్‌బరక్ భాషను ప్రచారం చేస్తున్న నరేశ్ దేబ్‌బర్మ కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. ఇత్తడిని చెక్కి వివిధ ఆకృతులను రూపొందించడంలో నిపుణులైన చిరంజీ లాల్ యాదవ్(యూపీ), కాంస్య కళా శిల్పి రాజస్తపతి కలియప్ప గౌండర్(తమిళనాడు), జమ్దానీ నేత విధానంపై వేలాది నేత కార్మికులకు శిక్షణనిచ్చిన హరియాణాకు చెందిన ఖేమ్ రాజ్ సుంద్రియాల్ సేవలను కూడా ప్రభుత్వం గుర్తించింది. సుమంగళి సేవా ఆశ్రమ్ ద్వారా మహిళా సాధికారతతోపాటు చిన్నారుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కర్ణాటకకు చెందిన ఎస్జీ సుశీలమ్మ, మహిళలకు కాంతా ఎంబ్రాయిడరీపై శిక్షణనిస్తోన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన త్రిప్తి ముఖర్జీ సేవలను కూడా గుర్తించింది.



సుశీలమ్మ

ఉచిత గ్రంథాలయం



కర్ణాటకకు చెందిన అంకె గౌడ(75) ఒకప్పుడు బస్ కండక్టర్‌గా పని చేసేవారు. 20 భాషలకు చెందిన 20 లక్షలకు పైగా పుస్తకాలతో 'పుస్తక్ మానె' అనే పేరుతో ఆయన ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అత్యంత అరుదైన మను లిపికి చెందిన పుస్తకాలను కూడా సేకరించి తన గ్రంథాలయంలో పెట్టి అందరికీ ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు. ప్రజలు పుస్తక పఠనం వైపు దృష్టి పెట్టేలా ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది.

ఆసియాలోనే తొలి తల్లిపాల బ్యాంక్



ముంబైకి చెందిన పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ అర్మిడ ఫెర్నాండేజ్.. శిశు మరణాలను తగ్గించేందుకు, తల్లి పాల కొరత సమస్యను పరిష్కరించేందుకు ఆసియాలోనే తొలిసారిగా ఓ తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేశారు. ఆమె చేసిన ఈ కృషికి ప్రతిగా ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది.

సంగీతం, నాట్యం, జానపదం..

నట సంకీర్తన కళాకారుడైన మణిపూర్‌కు చెందిన యుమ్నాం జాత్ర సింగ్(100), బిహార్‌కు చెందిన జానపద నాట్యకారుడు విశ్వబంధు, రాజస్థానీ జానపద కళాకారుడు గఫ్రుద్దీన్ మెవాటీ జోగీ, గుజరాత్ సంప్రదాయ సంగీత కళా రూపకం మన్‌భట్ కళాకారుడు ధార్మిక్‌లాల్ చునిలాల్ పాండ్యా, తమిళనాడుకు చెందిన భజన పాటల గాయకులు ఒత్వూరు తిరుత్తణి స్వామినాథన్, కబ్రీ జానపదం, ఆధునిక సంగీత రంగంలో విశేష కృషి చేస్తున్న అసోంకు చెందిన పోకిల లెక్తిపి, ఢోలక్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన గుజరాత్‌కు చెందిన మిర్ హజ్‌భాయ్ కసమ్‌భాయ్‌కు కేంద్రం పద్మశ్రీ ప్రకటించింది.



యుమ్నాం జాత్ర సింగ్

గిరిజన భాషలు, కళలు సంస్కృతి



వెదురు, సొరకాయతో తయారుచేసిన తార్పా అనే గిరిజన సంగీత పరికరం తార్పాను వాయించే మధ్యప్రదేశ్‌కు చెందిన 90 ఏళ్ల వృద్ధుడు భిక్ల్యా లదక్య దిండా, అంతరించిపోతున్న అల్గోజా అనే వాయిద్య పరికర సంగీత కళాకారుడు తాగారామ్ భీల్ కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. కాగా, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిసా, అసోం రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, నేపాల్‌లో ఉండే సంతాల్ తెగ వారు సంతాళి భాష మాట్లాడుతుంటారు. ఈ సంతాళి భాష పుస్తక రచయిత, స్వర కర్త చరణ్ హెంబ్రామ్(ఒడిసా) కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. నీలగిరి ప్రాంతంలో శతాబ్దాల చరిత్ర కలిగిన కురుంబ అనే గిరిజన చిత్రలేఖన కళకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆర్ కృష్ణన్(తమిళనాడు), అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పురాతన నిషి తెగ సంస్కృతి రక్షణకు పని చేస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన నిషీ గుబిన్, గిరిజనుల మాటలను రికార్డింగ్ చేసి వాటిని సంరక్షిస్తున్న ఒడిసాకు చెందిన మహేంద్ర కుమార్ మిశ్రా కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు.

వైద్య రంగంలో సేవకులు



పురాతన టిబిటెయిన్ వైద్యానికి ప్రాచుర్యం కల్పిస్తున్న లద్దాఖ్‌కు చెందిన పద్మా గుర్మీత్, బ్లాక్ ఫీవర్ నిర్ధారణకు అతి తక్కువ ఖర్చుతో చేసే పరీక్షను అభివృద్ధి చేసిన శ్యామ్ సుందర్(ఉత్తరప్రదేశ్), వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత అయిన హీమోఫిలియా రంగంలో చేసిన విశేష కృషికి గాను సీనియర్ హెమటాలజిస్ట్ సురేశ్ హంగావడి(కర్ణాటక)ను గుర్తించిన కేంద్రం వారికి పద్మశ్రీ ప్రకటించింది. బస్తర్ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టు కింద గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేసిన రామచంద్ర గోడ్‌బోలే, సునీత గోడ్‌బోలేలు కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. అలాగే, పురాతన ఔషధాలు, ఆధునిక వైద్య విధానాలతో పశువైద్యం చేస్తోన్న తమిళనాడుకు చెందిన శాస్త్రవేత్త పుణ్యమూర్తి నటేశన్‌కు కూడా కేంద్ర గుర్తింపు లభించింది.

పర్యావరణం, వ్యవసాయం



పత్తి సాగుకు సంబంధించి దాదా లడ్ అనే విధానాన్ని అభివృద్ధి చేసిన వ్యవసాయ రంగ ఆవిష్కర్త మహారాష్ట్రకు చెందిన షిరిరంగ్ దేబ్ లాడ్, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేసేందుకు పలు ఆవిష్కరణలు చేసిన యూపీకి చెందిన రఘుపత్ సింగ్, పశు సంరక్షణ, పాడి పరిశ్రమలో సహకార స్ఫూర్తితో ప్రగతి సాధించేందుకు కృషి చేసిన తెలంగాణకు చెందిన మామిడి రామారెడ్డి (మరణానంతరం) కూడా పద్మశ్రీకి ఎంపికయ్యారు. కేరళకు చెందిన 92 ఏళ్ల పర్యావరణ వేత్త కొల్లక్కయిల్ దేవకీ అమ్మ, సంప్రదాయ పద్ధతుల్లో అడవుల పెంపకానికి విశేష కృషి చేసిన మేఘాలయకు చెందిన హోలీ వార్, నీటి నిల్వ, సద్వినియోగానికి సంబంధించి చెక్ డ్యామ్‌లు, గట్లు, వంటి నిర్మాణాలను 75,000కు పైగా నిర్మించిన మధ్యప్రదేశ్‌కు చెందిన మోహన్ నగార్ కృషికి కూడా కేంద్ర గుర్తింపు లభించింది. వీరితోపాటు మరికొందరు సామాన్యులను కూడా కేంద్రం పద్మశ్రీకి ఎంపిక చేసింది.

ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ

- పాట్నా సమావేశంలో లాలూ ప్రకటన
- పరాజయానికి పట్టాభిషేకమంటూ బీజేపీ ఎద్దేవా

పాట్నా, జనవరి 25: రాష్ట్రీయ జనతాదళ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్ నియమితులయ్యారు. పాట్నాలో జరిగిన ఆర్జేడీ జాతీయ కార్యవర్గ సమావేశంలో భార్య రబ్రీదేవి, కుమార్తె మిసా భారతి, పార్టీ సీనియర్ నేతల సమక్షంలో ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ ప్రకటన చేశారు. లాలూ చిన్న కుమారుడైన తేజస్వీ యాదవ్ విపక్ష మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా ఇటీవలే బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తలపడ్డారు. విపక్ష కూటమి చిత్తుగా ఓడిపోయి ఎన్డీయే ఘన విజయం సాధించింది. పరాజయానికి తేజస్వీ వైఖరే కారణమని లాలూ కుమార్తె, తేజస్వీ సోదరి రోహిణీ ఆచార్య ఆరోపించారు. ఒకప్పుడు బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడిన ఆర్జేడీ నేడు కుట్రదారులు, అక్రమ చొరబాటుదారుల చేతుల్లోకి వెళ్లిపోయిందంటూ ఆమె ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. లాలూ వాదమనేదే లేకుండా చేశారని వాపోయారు. ఎన్నికల్లో పరాజయంపై ప్రశ్నించినందుకు తననే దూషించి ఇంటినుంచి గెంటేశారని గతంలో ఆమె ఆరోపించారు. మరోవైపు తేజస్వీ యాదవ్‌ను ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించడం పరాజయానికి పట్టాభిషేకం చేసినట్లుందని బీజేపీ ఎద్దేవా చేసింది. అవినీతి, నేరమయ వారసత్వ రాజకీయాల పార్టీ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా తేజస్వీకి పట్టం కట్టిందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.

దేశంలోనే అతిపెద్ద దోపిడీ?!

400 కోట్ల నగదు ఉన్న 2 కంటైనర్లు మాయం!!

కర్ణాటకలోని బెళగావి పరిధిలో ఘటన

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలో పరిధిలోని.. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం బోర్లాఘాట్‌లో రూ.400 కోట్లు ఉన్న రెండు కంటైనర్లు దోపిడీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్ర సంచలనం రేపుతున్న ఈ వ్యవహారంలో అసలు.. ఈ నగదు ఎవరిదనే విషయంపై ఇంకా ఎలాంటి స్పష్టతా రాలేదు. ఇదే నిజమైతే దేశంలో ఇంత పెద్ద దారి దోపిడీ ఇదేకావచ్చు. ఈ దోపిడీపై నాసిక్‌కు చెందిన సందీప్ దత్త పాటిల్ అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు మహారాష్ట్ర పోలీసులు వివరాల కోసం తమకు లేఖ రాశారని, దీంతో తాము కూడా దర్యాప్తు చేస్తున్నామని బెళగావి ఎస్పీ రామరాజన్ ఆదివారం మీడియాకు తెలిపారు. 'గత అక్టోబరు 16న విరాట్‌గాంధీ అనే వ్యక్తి ఆదేశాలతో విశాల్‌నాయుడు, మరికొందరు తనను కిడ్నాప్ చేసినట్లు సందీప్ దత్త అనే వ్యక్తి మహారాష్ట్రలోని నాసిక్ పరిధిలో గల ఘోటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై నాసిక్‌లో కేసు నమోదైంది. అయితే ఆలస్యంగా జనవరి 6న నాసిక్ ఎస్పీ నుంచి మాకు ఒక లేఖ వచ్చింది. దాని ద్వారానే భారీ నగదు దోపిడీ అంశం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సమగ్ర దర్యాప్తునకు మేము ప్రత్యేక బృందాన్ని నాసిక్‌కు పంపించాం. అయితే, దర్యాప్తు చేస్తున్న మహారాష్ట్ర సిట్ బృందం.. మా పోలీసులకు సరైన వివరాలు ఇవ్వలేదు. అలాగే, భారీ ఎత్తున నగదు కంటెయినర్లలో ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారనే విషయంలోనూ స్పష్టత లేదు. దోపిడీ జరిగినట్లు చెబుతున్న ప్రాంతం గోవా, మహారాష్ట్ర, కర్ణాటకకు సరిహద్దుగా ఉంది. మూడు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేయాల్సి ఉంది. గోవా నుంచి బెళగావి మీదుగా మహారాష్ట్రకు సదరు నగదు రవాణా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నగదు ముంబై-థానె ప్రదేశంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారి కిశోర్‌శెట్టికి చెందినదిగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు గోవాకు చెందిన బాలాజీ ట్రస్టు అనే ధార్మిక సంస్థకు చెందినదిగా కూడా ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో జయేశ్ కదం, విశాల్‌నాయుడు, సునిల్‌దుమాల్, విరాట్‌గాంధీ, జనార్ధనథాయ్ గుడెను నిందితులుగా నాసిక్ పోలీసులు గుర్తించారు. ఇటీవలే విరాట్ గాంధీని అరెస్టు చేసినట్లు నాసిక్ రూరల్ ఏఎస్పీ ఆదిత్యమిర్ఖేల్కర్ మాకు సమాచారం ఇచ్చారు. కేసులో పలు అనుమానాలు ఉన్నాయి. దేనిపైనా స్పష్టత లేదు. దోపిడీకి గురైన సొమ్ము నిజంగా రూ.400 కోట్లో కాదో స్పష్టత లేదు. కానీ, ఈ దోపిడీ బెళగావి జిల్లా పరిధిలో జరిగినట్టు నిర్ధారణ అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తాం. మహారాష్ట్ర పోలీసులకు సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నాం' అని బెళగావి ఎస్పీ వివరించారు. కాగా, ఆ నగదు రద్దయిన రూ.2వేల నోట్లుగా ప్రచారం జరుగుతోంది. రద్దయిన నోట్లే అయితే, అవి చెల్లవు గనుక, కేసే ఉండదని కొందరు చెబుతుండగా, దీనివెనుక రాజకీయ ప్రమేయం ఉండొచ్చనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

కల్లోల ప్రపంచంలో భారత్ శాంతిదూత

గణతంత్ర ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జనవరి 25: ఘర్షణలు నెలకొన్న ప్రస్తుత ప్రపంచానికి భారత్ శాంతిదూతగా మారిందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. మానవజాతి భవిష్యత్తు భద్రంగా ఉండేలా చూసేందుకు శాంతి సందేశాన్ని వినిపిస్తోందని చెప్పారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ పరిస్థితులను వివరిస్తూ విశ్వశాంతి కోసం ప్రార్థనలు చేయడం భారతీయ నాగరికతలో భాగమని, దాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో జాతి భద్రతకు కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూరే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రపతి ముర్ము తన ప్రసంగంలో 'నారీ శక్తి'ని ప్రధానంగా ప్రస్తావించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి మహిళల పాత్రే కీలకమని చెప్పారు. "గ్రామీణ స్వయం సహాయక బృందాలు, అంతరిక్షం, రక్షణ...ఇలా అన్నిరంగాల్లో ఆధునిక భారత చరిత్రను కుమార్తెలే రాస్తున్నారు" అని పొగిడారు. మహిళల ఆధారిత అభివృద్ధి జాతి ప్రాధాన్యతగా మారిందని నొక్కి చెప్పారు. మహిళా క్రికెట్ చరిత్రలో గత ఏడాది బంగారు అధ్యాయమని ప్రశంసించారు. వరల్డ్ కప్ గెలిచి గర్వకారణంగా నిలిచారని అన్నారు. డిజిటల్ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రపంచానికే భారత్ నాయకత్వం వహిస్తోందని ముర్ము చెప్పారు.

నేడు గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

- నిలిచిపోనున్న ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువుల డెలివరీ

న్యూఢిల్లీ, జనవరి 25 : ఒక్క క్లిక్‌తో ఆహార పదార్థాలను చేతికి అందించే స్విగ్గీ, జొమాటో సేవలు సోమవారం నిలిచిపోనున్నాయి. అలాగే, నిత్యావసర వస్తువులను గుమ్మం ముందుకు తెచ్చే జెప్టో, బ్లింకింట్ వంటి యాప్‌లు నో సర్వీస్ మెసేజ్‌లతో దర్శనమివ్వనున్నాయి. అంతేకాదు, ర్యాపిడో, ఓలా, ఊబర్ వంటి యాప్‌లతో పాటు లాజిస్టిక్స్, ఈ-కామర్స్, డొమెస్టిక్ హెల్ప్ వంటి అనేక గిగ్ యాప్‌ల సేవలకు అంతరాయం కలగనుంది. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గిగ్ వర్కర్లు దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మెకు దిగుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం వర్కర్లంతా గిగ్ యాప్‌ల నుంచి లాగౌట్ చేస్తారు. తద్వారా డెలివరీలు, వాహన రైడ్‌లు, గృహ అవసర సేవలకు వారు దూరంగా ఉంటారు. దీంతో గిగ్ యాప్‌ల సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. పనికి తగిన గౌరవం, సామాజిక గుర్తింపు, గిగ్ రంగంలో అవసరమైన రక్షణ హక్కులు కల్పించాలన్నదే వారి ప్రధాన డిమాండ్. తమ సామాజిక, ఆరోగ్య భద్రత, బీమా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరుతున్నారు. తమ వివరణ కోరకుండా ఇష్టానుసారంగా అకౌంట్‌ను బ్లాక్ చేసే విధానంపై నిషేధం విధించాలని, ఫిర్యాదులను సరైన విధానంలో పరిష్కరించే మార్గదర్శకాలను రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా వర్కర్లు వేధింపులు, ఇబ్బందులకు గురైనప్పుడు వారికి వెంటనే ఉపయోగపడేలా యాప్‌లలో ఎమర్జెన్సీ బటన్‌ను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అంతేకాదు, ఫిబ్రవరి 3న దేశవ్యాప్త ఆందోళనలకు వారు సిద్ధమవుతున్నారు.

15 నిమిషాలే టైం..

మా డిమాండ్లకు ఒప్పుకుంటారా.. చస్తారా?

- మదురో కిడ్నాప్ సమయంలో వెనెజువెలా నేతలకు అమెరికా సైనికుల అల్టిమేటం
- ఓ సమావేశంలో స్వయంగా చెప్పిన తాత్కాలిక అధ్యక్షురాలు



కారకస్, జనవరి 25: సైనిక ఆపరేషన్ ద్వారా ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి నాటి వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరిస్‌ను అపహరించిన అమెరికా.. ఆ సమయంలో ఇతర వెనెజువెలా నేతలను ఎంతగా భయభ్రాంతులకు గురిచేసిందో తెలిపే వీడియో ఒకటి తాజాగా బయటకు వచ్చింది. మదురోను అపహరించిన ఏడు రోజుల తర్వాత వెనెజువెలా ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తన మంత్రివర్గ సహచరులతో రహస్య సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో మదురోను అపహరించిన సమయంలో తమకు ఎదురైన అనుభవాలను వివరించారు. ఆ సమావేశానికి సంబంధించిన వీడియో లీక్ కావటంతో ఇప్పుడు సంచలనంగా మారింది. మదురో దంపతులను అమెరికా సైనికులు అపహరించిన తర్వాత వారి డిమాండ్లను తమ ముందు ఉంచి 15 నిమిషాల్లో వాటికి అంగీకరించకపోతే చంపేస్తామని బెదిరించినట్లు డెల్సీ తెలిపారు. 'అధ్యక్షుడి (మదురో)ని అపహరించిన మరు నిమిషం నుంచే బెదిరింపులు మొదలయ్యాయి. వారి డిమాండ్లపై స్పందించేందుకు డియోస్డాడో (అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి)కు, జార్జ్ (రోడ్రిగ్జ్ సోదరుడు, ఆ దేశ కాంగ్రెషనల్ ప్రెసిడెంట్)కు, నాకు 15 నిమిషాల సమయమే ఇచ్చారు. ఒప్పుకోకపోతే మమ్మల్ని చంపేస్తామన్నారు. మదురో దంపతులను కిడ్నాప్ చేయలేదని, చంపేశామని తెలిపారు. దీంతో మేము ముగ్గురం కూడా మరణించటానికే సిద్ధపడ్డాం' అని సమావేశంలో రోడ్రిగ్జ్ చెబుతున్న వీడియో క్లిప్ వైరల్‌గా మారింది. దేశంలో శాంతిని కాపాడటం, మదురో దంపతులను విడిపించటం, రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకోవటం అనే మూడు లక్ష్యాల సాధన కోసమే అమెరికాతో సంయమనంతో మెలుగుతున్నామని ఆమె చెప్పారు. అయితే, రోడ్రిగ్జ్ తనను తాను గొప్ప వ్యక్తిగా, దేశ రక్షకురాలిగా ప్రచారం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆ దేశ రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వంలో అత్యున్నత స్థానంలో ఉన్నవారి మధ్య అంతర్గత పోరాటం వల్లనే మదురో దంపతులను అమెరికా అపహరించగలిగిందని పేర్కొంటున్నారు.

ఆ రహస్య ఆయుధం 'డిస్కంబాబులేటర్'

ఈ నెల 3న వెనెజువెలా ఆపరేషన్‌లో వాడింది అదేనన్న ట్రంప్

వాషింగ్టన్, జనవరి 25: వెనెజువెలాలో సైనిక చర్య సమయంలో అమెరికా సైనికులు వాడిన రహస్య ఆయుధం పేరును ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఎట్టకేలకు బయటపెట్టారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన.. ఆ ఆయుధం పేరును 'డిస్కంబాబులేటర్' అని తెలిపారు. 'అది డిస్కంబాబులేటర్. అంతకుమించి దాని గురించి మాట్లాడటం నాకు ఇష్టంలేదు. వెనెజువెలా గగనతల రక్షణ వ్యవస్థను, రాడార్లను అది నిర్వీర్యం చేసింది. వాళ్లు ఒక్క రాకెట్‌ను కూడా ప్రయోగించలేకపోయారు. రష్యా, చైనాల నుంచి తెచ్చుకున్న ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించలేకపోయారు. వాళ్లు వారి ఆయుధాల మీటలు నొక్కినా ఒక్కటి కూడా పనిచేయలేదు' అని ట్రంప్ వివరించారు. ఈ నెల 3న అర్ధరాత్రి కేవలం 20 మంది అమెరికా సైనికులు డ్రోన్లు, హెలికాప్టర్లతో వెళ్లి వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిలియాలను అపహరించిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో అమెరికా సైనికులు ఏదో కొత్త తరహా ఆయుధం ప్రయోగించారని మదురో మాజీ బాడీగార్డు ఒకరు ఇటీవల చెప్పగా దానిపై తీవ్ర చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, వెనెజువెలా చమురును తాము ఇప్పటికే తీసేసుకున్నామని ట్రంప్ తెలిపారు. వెనెజువెలా నుంచి వివిధ దేశాలకు వెళ్తున్న 7ఆయిల్ ట్యాంకర్లను అమెరికా ఇటీవల స్వాధీనం చేసుకుంది. దీనిపై ట్రంప్ మాట్లాడుతూ..'వారివద్ద(వెనెజువెలా) ఎలాంటి చమురు లేదు. దాన్ని మేము తీసేసుకున్నాం. ఇప్పటికే దాన్ని శుద్ధి కూడా చేశాం' అని పేర్కొన్నారు.

మనాలీలో పర్యాటకుల నరకయాతన

- గడ్డకట్టే చలిలో 24 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్

సిమ్లా/మనాలీ, జనవరి 25: హిమాచల్‌ప్రదేశ్ మంచులో ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చిన వేలాది మంది పర్యాటకులు గడ్డకట్టే చలిలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. వరుస సెలవులతో పర్యాటకుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ముఖ్యంగా మనాలీ, సిమ్లా వంటి పర్యాటక ప్రాంతాల్లో వాహనాలు 24గంటలకు పైగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయాయి. రోడ్లపై సుమారు 7-8 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో పర్యాటకులు మైనస్ డిగ్రీల చలిలో వాహనాల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 685 రహదారులు మూతపడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 3 రోజులు పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడి సజీవ దహనం



ఢాకా, జనవరి 25: బంగ్లాదేశ్‌లో మరో హిందూ యువకుడు హత్యకు గురయ్యాడు. రాత్రి వేళ నిద్రిస్తున్న సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పటించారు. నర్సింగిడి పట్టణంలో శుక్రవారం రాత్రి చంచల్ చంద్ర భౌమిక్ అనే 23 ఏళ్ల యువకుడు ఈ దారుణ హత్యకు గురయ్యాడు. కుమిల్లా జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆ యువకుడు పనులు ముగించుకొని గ్యారేజీలో నిద్రిస్తుండగా కొందరు వ్యక్తులు షట్టర్ వద్ద పెట్రోలు పోసి నిప్పటించారు. సీసీటీవీ కెమెరా ఫుటేజీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

అమెరికా దాడి భయంతో బంకర్‌లోకి ఖమేనీ?

న్యూఢిల్లీ, జనవరి 25: అమెరికా సైనిక దళాల మోహరింపు నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ బంకర్‌లోకి వెళ్లిపోయినట్టు వార్తలు వెలువడుతున్నాయి. అమెరికా ఏ క్షణమైనా దాడికి దిగవచ్చనే ఉద్దేశంతో సైన్యం ఆయనను టెహ్రాన్‌లోని అత్యంత సురక్షిత బంకర్‌లోకి తరలించిందని.. టెహ్రాన్‌లోని వివిధ ప్రాంతాలకు చేరుకోగలిగేలా సొరంగాలు ఆ బంకర్‌కు అనుసంధానమై ఉన్నాయని ఇరాన్‌లోని ప్రతిపక్ష న్యూస్ చానల్‌ను ఉటంకిస్తూ టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ కథనం ప్రచురించింది. కాగా, ఖమేనీ బంకర్‌లోకి వెళ్లారన్న వార్తలను భారత్‌లోని ఇరాన్ రాయబారి ఖండించారు.

హెచ్-1బీ వీసాదారులకు షాక్!

- వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027కు వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 25: వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది హెచ్-1బీ వీసాదారులకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూల కోసం ఏడాదిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా ఈ ఏడాదికి సంబంధించిన వారి ఇంటర్వ్యూ స్లాట్లు 2027కు వాయిదా పడ్డాయి. భారత్‌లోని అమెరికా రాయబార కేంద్రాల్లో బ్యాక్‌లాగ్స్ భారీగా పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు పూర్తిగా లభ్యం కాకపోవడంతో ఇప్పటికే ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు వాయిదా వేసి 2027కు మార్చినట్లు తెలిసింది. దీనివల్ల భారత్‌కు చెందిన ఐటీ నిపుణులపై ప్రభావం పడనుంది. గతేడాది డిసెంబరులోనే ఈ జాప్యం మొదలైంది. దీంతో అప్పట్లో అపాయింట్‌మెంట్లను 2026 మార్చికి మార్చారు. ఆ తర్వాత జూన్‌కు, ఆపై అక్టోబరుకు వాయిదా వేశారు. మళ్లీ ఇప్పుడు 2027కు మార్చారు. ఈ పరిస్థితి ఇప్పట్లో మెరుగుపడే అవకాశం లేదని ఇమ్మిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. ఇంటర్వ్యూ తేదీలు నిరంతరం వాయిదా పడుతున్నందున ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్-1బీ ఉద్యోగులు స్టాంపింగ్ కోసం భారత్‌కు వెళ్లొద్దని సూచిస్తున్నారు. 'అమెరికన్ బజార్' సంస్థ కూడా 2027 వరకూ సాధారణ అపాయింట్‌మెంట్లు కూడా అందుబాటులో లేవని వెల్లడించింది. స్టాంపింగ్ కోసం గత నెల భారత్‌కు వచ్చిన వారి ఇంటర్వ్యూలు కూడా రద్దైనట్టు పేర్కొంది. ఇప్పటికే వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూల కోసం భారత్‌కు వచ్చిన వేలాది మంది వృత్తి నిపుణులు ఇక్కడే చిక్కుకుపోయారు. వీరిలో కొందరి భార్యాపిల్లలు అమెరికాలోనే ఉన్నారు. దీంతో ఎంప్లాయ్‌మెంట్ కాంట్రాక్టులు, హౌసింగ్ అగ్రిమెంట్లలో సమస్యలు తలెత్తుతున్నాయి.

వెటరన్ జర్నలిస్ట్ మార్క్ టులీ మృతి

- బీబీసీ బ్యూరో చీఫ్‌గా భారత్‌లో సేవలు
- చంద్రబాబుపై తన రచనల్లో ప్రశంసలు

న్యూఢిల్లీ, జనవరి 25: వెటరన్ బ్రిటీష జర్నలిస్ట్, బీబీసీ మాజీ బ్యూరో చీఫ్ సర్ విలియం మార్క్ టులీ(90) ఆదివారం మృతి చెందారు. స్థానికంగా ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మార్క్ టులీ మృతి చెందినట్లు ఆయన సన్నిహిత మిత్రుడు సతీష్ జాకబ్ తెలిపారు. కోల్‌కతాలో 1935 అక్టోబరు 24న బ్రిటీష్ దంపతులకు జన్మించిన మార్క్ టులీ బీబీసీ బ్యూరో చీఫ్‌గా భారత్‌లో 22 ఏళ్లు పనిచేశారు. బీబీసీ రేడియో 4 కార్యక్రమం 'సమ్‌థింగ్ అండర్‌స్టుడ్' సమర్పకుడిగానూ వ్యవహరించారు. రచయితగా భారత్‌పై అనేక పుస్తకాలు రాశారు. పలు డాక్యుమెంటరీల రూపకల్పనలోనూ పాల్గొన్నారు. 2002లో బ్రిటీష్ నైట్‌హుడ్ అవార్డు అందుకున్నారు. 2005లో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ అందుకున్నారు. బీబీసీ బ్యూరో చీఫ్‌గా భారత్‌కు సంబంధించిన అనేక ముఖ్య ఘటనలను ఆయన కవర్ చేశారు. మార్క్ టులీ రాసిన 10 పుస్తకాల్లో భారతే ప్రధాన అంశం. కాగా హైదరాబాద్‌ను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా రికార్డు చేశారు. 'ఇండియా ఇన్ స్లో మోషన్' అనే పుస్తకంలో ఆయన 'క్రియేటింగ్ సైబరాబాద్' అనే ప్రత్యేక అధ్యాయాన్ని పొందుపరిచారు. చంద్రబాబుతో పాటు పలు సమావేశాల్లోనూ మార్క్ టులీ పాల్గొన్నారు. కాగా మార్క్ టులీ మృతికి ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.



సరదాకు అర్థమే తెలియదు!

- పరిపాలన ఆధునికీకరణలో చంద్రబాబు కృషి భేష్
- ఆయన వినూత్న సంస్కరణలను రికార్డు చేసిన మార్క్ టులీ

న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో జన్మించి ఆదివారం కన్నుమూసిన బ్రిటిష్ జర్నలిస్టు, బీబీసీ మాజీ బ్యూరో చీఫ్ సర్ విలియం మార్క్ టులీ (90) దాదాపు ఏడు దశాబ్దాలపాటు భారత రాజకీయాలను సమర్థంగా విశ్లేషించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్‌ను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా రికార్డు చేశారు. సరదా అన్న పదానికి అర్థమే తెలియని చంద్రబాబు.. అనుక్షణం కష్టపడి పనిచేస్తారని.. సొంత పార్టీ, అధికార యంత్రాంగంపై ఆయనకు పూర్తి పట్టుందని విశ్లేషించారు. చంద్రబాబు ఈ-గవర్నెన్స్‌ను ప్రారంభించిన కాలంలో టులీ హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చంద్రబాబుతో ఒక రోజంతా గడిపారు. 'ఇండియా ఇన్ స్లో మోషన్' అనే పుస్తకంలో 'సైబరాబాద్ సృష్టి'పై ప్రత్యేక అధ్యాయాన్ని పొందుపరిచారు. హైదరాబాద్‌ను ప్రధాన ఐటీ నగరంగా మార్చేందుకు, పరిపాలన ఆధునికీకరణ, వినూత్న సంస్కరణలు, వ్యాపార అనుకూల వాతావరణం ఏర్పరిచేందుకు చంద్రబాబు చేసిన కృషిని తొలిరోజుల్లో రికార్డు చేసిన ఘనత టులీకే దక్కింది. అయితే ఎంతవేగంగా సంస్కరణలు అమలు చేయాలనుకున్నా అధికార యంత్రాంగం మందకొడి వైఖరివల్ల చంద్రబాబు విజయం సాధించలేకపోయారని అభిప్రాయపడ్డారు.


విరిసిన తెలుగు పద్మాలు!

వివిధ రంగాల్లో చేసిన కృషిని వరించిన పద్మశ్రీ పురస్కారం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వైద్య రంగం నుంచి కళా రంగం వరకు విశిష్ట సేవలు అందించిన తెలుగువారిని ప్రతిష్ఠాత్మకమైన 'పద్మ' పురస్కారాలు వరించాయి. వైద్య రంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ జీవీ రావు, డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, విద్యా రంగంలో మామిడాల జగదీశ్‌కుమార్, విద్యావేత్త మామిడాల జగదీశ్‌కుమార్, క్షిపణి శాస్త్రవేత్త గడ్డమణుగు చంద్రమౌళి, కూచిపూడి కళాకారిణి దీపికారెడ్డి, ప్రసిద్ధ సంస్కృత పండితుడు వెంపటి, అభినవ అన్నమయ్య గరిమెళ్ల, పాడి పరిశ్రమలో విప్లవం సృష్టించిన మామిడి రాంరెడ్డి తదితరులకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది.

అభినవ అన్నమయ్య గరిమెళ్ల



సంగీతానికే అంకితమై పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో జన్మించారు. 600కు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరిచి వెలుగులోకి తెచ్చిన ప్రసిద్ధ గాయకుడు ఆయన. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా పనిచేస్తూ భక్తి సంగీతానికి సేవలందించారు. శాస్త్రీయ సంగీతాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో అపూర్వ కృషి చేశారు. సంగీత స్వరకర్త, శాస్త్రీయ సంగీత గాయకులు కళారత్నగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల 1976లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరి, 2006లో రిటైరయ్యారు. అన్నమయ్య కీర్తనలు స్వరపరచడం, ఆలపించడం, రికార్డు చేయడం, పుస్తక ప్రచురణకు జీవితాన్ని అంకితం చేశారు. తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియను ప్రవేశపెట్టిన ఘనత గరిమెళ్లకే దక్కుతుంది. హరి సంకీర్తన ద్వారా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. 300 కీర్తనలు నాన్‌స్టాప్‌గా పాడిన ఘనత ఆయనది. 6వేలకు పైగా కచేరీలు చేశారు. సిలికానాంధ్ర సంస్థ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన లక్ష గళార్చనలో ప్రధాన గాయకులు. ఆ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కించుకుంది. 2020లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. వెయ్యికి పైగా కీర్తనలు రచించి, స్వరపరిచి జనబాహుళ్యం లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠం ఆస్థాన సంగీత విద్వాంసుడిగా సేవలు అందించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి సోదరి కుమారుడైన ఆయన సినిమా అవకాశాలు వచ్చినా శాస్త్రీయ సంగీతానికి, తిరుమల శ్రీవారి సేవకే అంకితమయ్యారు. అభినవ అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల గతేడాది మార్చి 9న గుండెపోటుతో కన్నుమూశారు.

'మచ్చలేని' సర్జరీతో డాక్టర్ జీవీ రావు



ప్రపంచంలోనే అత్యుత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుల్లో ఒకరైన ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు(గుడూరు వెంకటరావు) పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏఐజీ ఆస్పత్రి సహ వ్యవస్థాపకుడైన ఆయన.. 12 వేలకుపైగా జీర్ణాశయ శస్త్రచికిత్సలు, 16 వేలకుపైగా ఎండోస్కోపీ చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించారు. పేషెంట్ల శరీరంపై ఎలాంటి మచ్చలూ పడకుండా, శస్త్రచికిత్స బయటికి కనబడకుండా 'నో స్కార్ సర్జరీ'ని పరిచయం చేశారు. ఈ విధానంలో ప్రపంచంలోనే మొట్టమొదటి ట్రాన్సోరల్ ఎండోస్కోపిక్ అపెండెక్టమీ సర్జరీ చేశారు. భారత మొట్టమొదటి సర్జికల్ సిమ్యులేటర్‌ను అభివృద్ధి చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌తో కలిసి పనిచేశారు. మధుమేహం, ఫ్యాటీ లివర్, ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ) వంటి సమస్యలపై అవగాహన కల్పించేందుకు కృషిచేశారు. పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో మొబైల్ ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. టెలీమెడిసిన్ నెట్‌వర్క్ దూరప్రాంతాల్లోని గ్రామాలను ఏఐజీ ప్రత్యేక వైద్య కేంద్రాలతో అనుసంధానం చేసి, వైద్య సేవలను అందిస్తున్నారు. తన సేవలకు గుర్తింపుగా డాక్టర్ బీసీ రాయ్ జాతీయ అవార్డు, ది ఎకనామిక్ టైమ్స్ ఇన్‌స్పైరింగ్ డాక్టర్స్ ఆఫ్ ఇండియా అవార్డు, జేసీ అవుట్‌స్టాండింగ్ ఇంటర్నేషనల్ యంగ్ పర్సన్ అవార్డుతోపాటు పదుల సంఖ్యలో ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి గౌరవ ఫెలోషిప్‌లు పొందారు. పద్మశ్రీ అవార్డు సమాజంపై తన బాధ్యతను మరింత పెంచిందని డాక్టర్ జీవీ రావు ఈ సందర్భంగా చెప్పారు. తన వృత్తి జీవితమంతా మద్దతుగా నిలిచిన డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానని పేర్కొన్నారు.

భారత అంకాలజీకి మార్గదర్శకం.. విజయ్



భారత్‌లో క్యాన్సర్ చికిత్సల రంగానికి మార్గదర్శకుడిగా నిలిచిన అపోలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పాల్వొండ విజయ్ ఆనంద్‌రెడ్డిని పద్మశ్రీ వరించింది. వైద్య పరీక్షల నివేదికలు, రోగి శరీరతత్వం ఆధారంగా తన అనుభవాన్ని మిళితం చేసి.. ప్రతి క్యాన్సర్ రోగికి ప్రత్యేకంగా చికిత్స అందించడం ఆయన ప్రత్యేకత. 20వేల మందికి పైగా క్యాన్సర్ రోగులకు చికిత్స చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయ్ ఆనంద్‌రెడ్డి ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చేశారు. తర్వాత అంకాలజీలో, రేడియేషన్ థెరపీలో ఎండీ చేశారు. ఆయన ఉమ్మడి ఏపీలో తొలి బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్, దేశంలో తొలిసారిగా ఇంట్రాకరోనరీ బ్రాకీ థెరపీ, రెటినోబ్లాస్టోమాకు తొలి ఇంట్రాఆర్టీరియల్ కీమోథెరపీ, కంటి క్యాన్సర్‌కు తొలి ఇంట్రా-ఆక్యులర్ బ్రాకీథెరపీ, గ్లియోమా, పెనిస్ క్యాన్సర్ బాధితులకు ఇంటర్‌స్టీషియల్ ఇంప్లాంట్ చికిత్సలు, ప్రోస్టేట్ క్యాన్సర్‌కు అల్ట్రా సౌండ్ గైడెడ్ ఇంప్లాంట్ చికిత్స నిర్వహించారు. ప్రోస్టేట్, రొమ్ము క్యాన్సర్ల చికిత్సలో తక్కువ వ్యవధితో రేడియేషన్ వినియోగించే విధానాలను అభివృద్ధి చేశారు. 2003లో క్యూర్ ఫౌండేషన్ స్థాపించి.. పేద క్యాన్సర్ రోగులకు ఉచితంగా/తక్కువ ఖర్చుతో పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నారు.

విద్యావేత్తకు విశిష్ఠ పురస్కారం

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన విద్యావేత్త మామిడాల జగదీశ్‌కుమార్‌ను పద్మశ్రీ వరించింది. మిర్యాలగూడలో డిగ్రీ, హైదరాబాద్‌లో పీజీ చేసిన ఆయన.. మద్రాస్ ఐఐటీలో ఎంఎస్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1991 నుంచి 1994 వరకు కెనడాలోని వాటర్‌లూ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరియల్ పరిశోధన చేశారు. ఢిల్లీ ఐఐటీలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. నానో ఎలక్ట్రానిక్స్ విభాగంలో పరిశోధనల కోసం కృషిచేశారు. 2016 జూన్ 24 నుంచి 2019 జూన్ 23 వరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఇన్‌చార్జి చైర్మన్‌గా, 2022 ఫిబ్రవరి 4 నుంచి 2025 ఏప్రిల్ 7వరకు చైర్మన్‌గా పనిచేశారు. ఈ సమయంలో దేశవ్యాప్తంగా యూనివర్సిటీలు, కాలేజీలలో విద్యా ప్రమాణాల పెంపు కోసం కృషి చేశారు.

పాడికి ప్రోత్సాహం... పద్మశ్రీ పురస్కారం

పశుపోషణ, డెయిరీ రంగాల్లో విశేష సేవలందించిన మామిడి రామారెడ్డికి మరణానంతరం పద్మశ్రీ పురస్కారం దక్కింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన మామిడి రామారెడ్డి.. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఆయన తండ్రి భోజారెడ్డి రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆ బాటలో రాజకీయాల్లోకి ప్రవేశించి శంషాబాద్ సర్పంచ్‌గా, రాజేంద్రనగర్ పంచాయతీ, రాజేంద్రనగర్ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు, అభివృద్ధిపై దృష్టిపెట్టారు. రాజకీయాలను వదిలేసి, 'సీడీఎఫ్'(కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్) ఏర్పాటుచేశారు. పశుపోషణ, పాడి నిర్వహణ, పొదుపు అంశాల్లో లక్షలాది మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.

నోరి దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్

(మొదటి పేజీ తరువాయి)

ఇలా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 133 మంది ప్రముఖులకు 131 పురస్కారాలు (ఇందులో రెండు డ్యుయో కేసులు.. అంటే, ఒకే రంగంలో కృషి చేసిన ఇద్దరికి కలిపి ఇచ్చిన అవార్డులున్నాయి) ప్రకటించింది. వీరిలో ఐదుగురికి పద్మవిభూషణ్.. 13 మందికి పద్మ భూషణ్.. 113 మందికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. ఈ 131 మందిలో 19 మంది మహిళలు కాగా.. ఆరుగురు విదేశీ/ప్రవాస/భారతీయ మూలాలున్న/ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కేటగిరీకి చెందిన వ్యక్తులు. అలాగే.. 16 మందికి మరణానంతరం ఈ పురస్కారాలను ప్రకటించారు. సాంకేతికంగా చూస్తే ఏపీ నుంచి నలుగురికి, తెలంగాణ నుంచి ఏడుగురికి పద్మశ్రీ అవార్డులు వచ్చాయి. కానీ, అవార్డులు వరించినవారిలో మొత్తం 14 మంది తెలుగువారు ఉన్నారు.



దత్తాత్రేయుడు

ఏపీ నుంచి... పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నవారిలో.. అన్నమయ్య కీర్తనలెన్నింటికో స్వరకల్పన చేసిన ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతర పురస్కారం), ప్రముఖ సినీనటులు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, ప్రముఖ సంస్కృత పండితుడు, అంతర్జాతీయ సంస్కృత అధ్యయనాల సంస్థకు అధ్యక్షుడిగా ఉన్న వెంపటి కుటుంబ శాస్త్రి ఉన్నారు. నోరి దత్తాత్రేయుడు కృష్ణాజిల్లాకు చెందినవారే అయినప్పటికీ ఆయనకు అమెరికా కోటాలో పద్మభూషణ్ ప్రకటించారు.

తెలంగాణ నుంచి.. డీఆర్డీవోలో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆకాశ్ క్షిపణి వ్యవస్థను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిన గడ్డమణుగు చంద్రమౌళి, ప్రముఖ మెటీరియల్ సైంటిస్ట్ కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, హ్యూమన్ జెనెటిక్స్ అండ్ పాపులేషన్ స్టడీస్‌లో విస్తృతంగా కృషి చేసిన సీసీఎంబీ సైంటిస్ట్ కుమారస్వామి తంగరాజ్, కూచిపూడి నృత్య కళాకారిణి దీపికా రెడ్డి, ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు గూడూరు వెంకట్‌రావు, మూడు దశాబ్దాలుగా రేడియేషన్ ఆంకాలజిస్టుగా సేవలందిస్తున్న విజయ్ ఆనంద్ రెడ్డి, తెలంగాణ ప్రాంతంలో డెయిరీ రంగాన్ని ఆధునీకరించి అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించిన మామిడి రామారెడ్డికి (మరణానంతరం) పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించారు. తెలంగాణకే చెందిన ప్రముఖ విద్యావేత్త, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు (ఈయన స్వగ్రామం నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాల) ఢిల్లీ కోటాలో, హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, ఐఐటీ బాంబేలో విద్యనభ్యసించి, ఇన్ఫోసిస్ సహా పలు కంపెనీల్లో పనిచేసిన ప్రముఖ సాంకేతిక నిపుణులు, ప్రసార భారతి సీఈవో, రాజ్యసభ టీవీ సీఈవోగా కూడా పనిచేసిన శశిశేఖర్ వెంపటికి కర్ణాటక కోటాలో పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి.

పద్మ విభూషణులు



ఎన్ రాజం



నారాయణన్



అచ్యుతానందన్



కేటీ థామస్

ఆ ఐదుగురిలో..: పద్మ అవార్డుల్లో అత్యున్నతమైన పద్మవిభూషణ్ వరించిన ఐదుగురిలో ముగ్గురు కేరళకు చెందినవారే కావడం విశేషం. ఆ ముగ్గురూ.. కమ్యూనిస్టు దిగ్గజ నేత, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ (మరణానంతరం), సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్, సీపీఐ నేత పి.నారాయణన్. మిగతా ఇద్దరిలో ఒకరు.. ఇటీవలే మరణించిన బాలీవుడ్ వెటరన్ సూపర్‌స్టార్ ధర్మేంద్ర కాగా, మరొకరు ప్రముఖ వాయులీన విద్వాంసురాలు ఎన్.రాజం. పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న 13 మందిలో మన నోరి దత్తాత్రేయుడితో పాటు.. ప్రముఖ గాయని అల్కా యాజ్ఞిక్, మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి, ఝార్ఖండ్ ముక్తిమోర్చా పార్టీ వ్యవస్థాపకుడు శిబు సోరేన్ తదితరులున్నారు.

ప్రధాని మోదీ శుభాకాంక్షలు

పద్మ పురస్కారాలు వరించినవారికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. విభిన్న రంగాల్లో దేశానికి వారు చేసిన సేవ ఎంతో గొప్పదని కొనియడారు. వారి కృషి, అంకిత భావం సమాజ నిర్మాణాన్ని సుసంపన్నం చేయడానికి దోహదపడ్డాయని 'ఎక్స్' వేదికగా ఆయన ప్రశంసించారు.

సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ అభినందనలు

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పద్మ అవార్డులకు ఎంపికైన వారందరికీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఆయా రంగాల్లో అత్యున్నత స్థానాలను అధిరోహించేందుకు వారు చేసిన స్ఫూర్తిదాయక ప్రయాణానికి దక్కిన ఫలితమే పద్మ అవార్డు అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ పురస్కారాల ఎంపికలో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రమాణాలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్నాయని పవన్ పేర్కొన్నారు. తెలుగు వారికి పద్మ అవార్డులు దక్కడం చాలా ఆనందంగా ఉందని, తెలుగు పద్మాలందరికీ అభినందనలు అని మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు.

క్యాన్సర్‌పై యుద్ధభేరి.. నోరి

మంటాడ నుంచి మ్యాన్‌హ్యాటన్ వరకూ దత్తాత్రేయుడి విజయయాత్ర

విజయవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికీ విశ్వరూపం దాలుస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై యుద్ధభేరిని మోగించి.. దాన్ని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకూ మార్గనిర్దేశం చేస్తున్న ప్రపంచ ప్రఖ్యాత రేడియేషన్ ఆంకాలజిస్ట్.. డాక్టర్ నోరి దత్తాత్రేయుడు! జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో నేతలకు ఆత్మీయ వైద్యుడైన ఆయన.. కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం మంటాడ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా పూర్తి చేసిన ఆయన.. మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల(నేషనల్ కాలేజీ)లో పీయూసీ, కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. ఆ తర్వాత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేశారు. ఐదు దశాబ్దాలుగా ప్రముఖ ఆంకాలజిస్ట్‌గా విశిష్ట సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని టాప్ 5 క్యాన్సర్ వైద్య నిపుణులలో ఆయన ఒకరు. 9రకాల క్యాన్సర్‌లకు చికిత్సలు అందిస్తున్న వైద్యుడిగా ప్రసిద్ధి పొందారు. భారత్‌తో పాటు అనేక దేశాల్లో క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను స్థాపించడానికి కృషి చేశారు. ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న ఆయన.. అప్పుడప్పుడూ తన స్వగ్రామాన్ని సందర్శిస్తుంటారు. దత్తాత్రేయుడు సతీమణి సుభద్ర కూడా డాక్టర్. వీరికి ఇద్దరు సంతానం. వైద్యరంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్ ' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని నిరుడు మార్చిలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యాన్సర్ చికిత్సకు సంబంధించి విశేష సేవలందిస్తున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడి కృషిని గుర్తించి.. కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2015లో పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

లోకం తీరు



ఆకాశ్ శాస్త్రవేత్తకు.. ఆకాశమంత గౌరవం



రక్షణ రంగంలో కీలకమైన క్షిపణి శాస్త్రవేత్త గడ్డమణుగు చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన ఆయన.. వరంగల్ ఆర్ఈసీలో మెకానికల్ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. దాదాపు 34 ఏళ్లపాటు డీఆర్‌డీఓలో శాస్త్రవేత్తగా పనిచేసి 2018లో రిటైరయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తగా చంద్రమౌళి ఆకాశ్ క్షిపణి అభివృద్ధిలో మాజీ రాష్ట్రపతి, క్షిపణి శాస్త్రవేత్త అబ్దుల్ కలాంతో కలిసి పనిచేశారు. ఆకాశ్ క్షిపణి ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. ఆయన 2005లో డీఆర్‌డీవో అగ్ని అవార్డు పొందారు. 2007లో మోక్షగుండం విశ్వేశరయ్య అవార్డు, 2013లో డీఆర్‌డీవో సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, 2014లో ఫిక్కీ నుంచి గ్లోబల్ లీడర్ అవార్డును పొందారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

కూచిపూడి నాట్యానికి పద్మం




ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్‌పర్సన్ దీపికా రెడ్డిని పద్మశ్రీ పురస్కారం వరించింది. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ఆమె.. ప్రఖ్యాత నాట్యాచార్యులు వెంపటి చినసత్యం దగ్గర శిక్షణ పొందారు. తన 11వ ఏటనే అరంగేట్రం చేశారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వెయ్యికిపైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. దీపాంజలి నాట్యశిక్షణాలయాన్ని స్థాపించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక ప్రగతి, సమానత్వం, తెలుగు భాష ఔన్నత్యం వంటి సామాజిక అంశాలపైనా నృత్యరూపకాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. అయోధ్య రామాలయ ప్రాంగణంలోనూ నృత్య ప్రదర్శన ఇచ్చారు.

ప్రసిద్ధ సంస్కృత పండితుడు వెంపటి

దేశంలోని మూడు ప్రసిద్ధ సంస్కృత విశ్వవిద్యాలయాలకు ప్రసిద్ధ సంస్కృత పండితుడు ఆచార్య వెంపటి కుటుంబ శాస్త్రి ఉపకులపతిగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నారు. రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ (న్యూఢిల్లీ), సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం (వారాణాసీ), శ్రీ సోమనాథ్ సంస్కృత విశ్వవిద్యాలయం (గుజరాత్) వీసీగానూ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్థాపించిన భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో తొలి ఆచార్యులుగా వ్యవహరించారు. 1950 ఆగస్టు 12న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో వెంపటి జగన్నాథం, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించిన వెంపటి కుటుంబశాస్త్రికి అద్వైత వేదాంతం, దర్శనాలు, కావ్యశాస్త్రం, సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధ సంస్కృత పండితుడిగా పేరుంది. తిరుమలలోని ఎస్వీ వేద పాఠశాలలో రుగ్వేదం అధ్యయనం చేసి ఓరియంటల్ టైటిల్ విద్యాప్రవీణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, మద్రాస్ వర్సిటీల నుంచి చెరొక ఎంఏ పట్టా పొందారు. తిరుపతిలో ఎస్వీ వర్సిటీలో ఎంఏ ఫిలాసఫీ చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. మహారాష్ట్రలోని కాళిదాస సంస్కృత వర్సిటీ ఆయనకు 'ప్రాచ్య విద్యా వాచస్పతి' పేరిట గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2021లో బెంగళూరులోని స్వామి వివేకానంద యోగ అనుసంధాన సంస్థానం గౌరవ డాక్టరేట్‌ను అందించింది. అనేక రచనలతో పాటు, పలు ఇతరుల రచనలను సంస్కృతంలో అనువదించారు. 2014లో రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. దేశ, విదేశాల్లో అనేక పరిశోధనా పత్రాలు సమర్పించారు.

ఊపిరి ఉన్నంత వరకు సంస్కృతాభివృద్ధికి సేవచేస్తా



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- భారతదేశ అస్తిత్వానికి సంస్కృతమే మూలం
- ఆయుర్వేదంతో విడదీయలేని బంధం
- భాషలో పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు
- ఇందులో ఉద్యోగాలకు పోటీ తక్కువ
- 'ఆంధ్రజ్యోతి'తో వెంపటి కుటుంబ శాస్త్రి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

"సంస్కృతాన్ని నేను చాయిస్‌గా తీసుకోలేదు. చాన్స్‌గా భావించి సంస్కృత విద్యలోకి దిగాను. అదే ఇప్పుడు నాకు 'పద్మ' కీర్తిని తీసుకువచ్చింది. ఊపిరి ఉన్నంత వరకు సంస్కృతాభివృద్ధికే నా సేవలందిస్తాను" అని పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన వెంపటి కుటుంబ శాస్త్రి అన్నారు. కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరులో ఆయన జన్మించారు. ఢిల్లీలోని మానవ వనరుల పరిశోధనా సంస్థ ఆధీనంలో ఉండే కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, కాశీలోని సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం, గుజరాత్‌లోని స్వామ్‌నాథ్ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీగా పనిచేశారు. పదవీ విరమణ చేశాక తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రస్తుతం కాంచీపురంలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయ యూనివర్సిటీ చాన్సలర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా పద్మశ్రీ వరించిన నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

సంస్కృతం వైపు మీ అడుగులు పడడానికి స్ఫూర్తి ఎవరు?

అప్పట్లో ఇప్పటి మాదిరిగా చాయిస్‌లు లేవు. ఎనిమిదేళ్ల వయసులో మా నాన్న వెంపటి జగన్నాథం వేద పాఠశాలలో చేర్పించారు. అక్కడి నుంచి సంస్కృతం వైపు వెళ్లాను. అప్పటి నుంచి నా ప్రయాణం సంస్కృతంతోనే సాగుతోంది.

సంస్కృతంలో మీరు చేసిన పరిశోధనలు ఏమిటి? ఏ పరిశోధనలు కీర్తిని తీసుకువచ్చాయి?

16వ శతాబ్దానికి చెందిన వారణాసి ధర్మసూరిపై నేను పరిశోధనా పత్రం తయారు చేశాను. ఆయన గొప్ప గ్రంథకర్త. ఆయన రాసిన గ్రంథాలపై ప్రత్యేక అధ్యయనం చేశాను. ఇది నాకు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. ఇది కాకుండా అద్వైత వేదాంతంపై పరిశోధనలు చేశాను. తాత్పర్యంపై శాస్త్రీయ నిబంధనలను వివరిస్తూ పత్రాన్ని రూపొందించాను. ఈ పరిశోధన 2019 నుంచి 2022 వరకు సాగింది.

పద్మశ్రీ వరించడంపై మీ అనుభూతి?

సంస్కృతంలో నేను చేసిన కృషికి పద్మశ్రీ రావడం చాలా ఆనందాన్ని కలిగించింది. దీనికి ముందు పలు రాష్ట్రాల్లో గౌరవ పురస్కారాలు అందుకున్నాను. 2014లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి రాష్ట్రపతి పురస్కారాన్ని అందుకున్నాను. బెంగళూరులోని ఎస్వ్యాస, మహారాష్ట్రలో రామ్‌టేకీలోని కవికుల గురు కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయం నుంచి డీలిట్ గౌరవం దక్కింది. డాక్టరేట్‌ల కంటే డీలిట్ హోదా అత్యున్నతమైనది.

ప్రస్తుతం విద్యార్థులకు సంస్కృతానికి సంబంధించి మీరిచ్చే సందేశం?

సంస్కృతాన్ని ఒక సబ్జెక్టుగా తీసుకుని ముందుకు వెళితే ఉపాధి అవకాశాలు లేవనే భావన చాలామందిలో ఉంది. ఇది నా దృష్టిలో తప్పు అని అభిప్రాయం. ఇతర పాఠ్యాంశాలను తీసుకుని చదివే వారి కంటే సంస్కృతం చదివే వారి సంఖ్య తక్కువగా ఉన్న మాట వాస్తవమే. కానీ సంస్కృత భాషలో పట్టు సాధించిన వారికి ఉపాధి అవకాశాలున్నాయి. ఇందులో ఉద్యోగాలకు పోటీ తక్కువగా ఉంటుంది. భారతదేశ అస్తిత్వానికి సంస్కృతమే మూలం. సంస్కృతానికి, ఆయుర్వేదానికి విడదీయలేని బంధం ఉంది. ఆయుర్వేద గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. దేశ సంస్కృతి, జీవనామం సంస్కృతమయం. అందువల్ల సంస్కృత భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతతో పాటు అభివృద్ధి చేయాలన్న సంకల్పం ప్రభుత్వాలకు అవసరం.

శుభాన్షు శుక్లాకు అశోక చక్ర

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు, వైమానిక దళ గ్రూప్ కెప్టెన్

- గగన్‌యాన్ మిషన్‌లో భాగమైన గ్రూప్ కెప్టెన్ బాలకృష్ణన్ నాయర్‌కు కీర్తిచక్ర అవార్డు
- మొత్తంగా 70 మందికి సైనిక పురస్కారాలు

న్యూఢిల్లీ, జనవరి 25: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడు, వైమానిక దళ వింగ్ కమాండర్ శుభాంశు శుక్లాకు కేంద్రం అత్యున్నత సైనిక పురస్కారం 'అశోక చక్ర'ను ప్రకటించింది. ఇస్రో గగన్‌యాన్ మిషన్‌లో భాగమైన మరో గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌ను కీర్తి చక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో మొత్తంగా 70 మందికి సైనిక పురస్కారాలు ప్రకటించింది. మేజర్ అర్షదీప్‌సింగ్, నాయబ్ సుబేదార్ డోలేశ్వర్ సుబ్బా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లను కీర్తిచక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. మరో 13 మందికి శౌర్యచక్ర, ఒక బార్ టు సేన, 44 మందికి సేన, ఆరుగురికి నవ్ సేన, ఇద్దరికి వాయుసేన పురస్కారాలు ప్రకటించింది. ఈ పురస్కారాలకు ఎంపికైన వారిలో ఆరుగురికి మరణానంతరం ప్రకటించారు.

అంతరిక్షానికి భారత ప్రతిష్ఠ

అంతరిక్షంలోకి మనుషులను పంపాలన్న లక్ష్యంలో భాగంగా ఇస్రో గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. అందులో భాగంగా శుభాంశు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, మరో ఇద్దరికి వ్యోమగాములుగా శిక్షణ ఇస్తోంది. అంతరిక్షంలో పరిస్థితులు, ఇబ్బందులు, ప్రయాణానికి సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేసుకోవడం, అనుభవం కోసం వారిలో ఒకరిని ముందే విదేశాల ద్వారా అంతరిక్షంలోకి పంపాలని నిర్ణయించింది. సుఖోయ్, మిగ్, జాగ్వార్ సహా కీలక యుద్ధ విమానాలు నడిపిన అనుభవమున్న శుభాంశు శుక్లాను ఎంపిక చేసి.. యాక్సియం-4 మిషన్ ద్వారా ఐఎస్ఎస్‌కు పంపింది. శుభాంశు శుక్లా అంతరిక్షంలో భార రహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహించారు. ఇస్రో గగన్‌యాన్ ప్రయోగాల కోసం ఆయన అనుభవం, సేకరించిన సమాచారం కీలకంగా మారనుంది. ఈ క్రమంలో ఆయనను అశోక చక్ర పురస్కారానికి ఎంపిక చేసింది. ఇక గగన్‌యాన్‌లో భాగంగా అంతరిక్షంలోకి పంపే బృందంలో కీలక సభ్యుడైన ప్రశాంత్ బాలకృష్ణన్‌కు కీర్తి చక్ర ప్రకటించింది. గగన్‌యాన్ కోసం మరో ఇద్దరు వాయుసేన గ్రూప్ కెప్టెన్లు అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్ శిక్షణ పొందుతున్నారు.



శుభాంశు



బాలకృష్ణన్



అర్షదీప్



డోలేశ్వర్

ధైర్యంగా నిలిచిన పోరాటానికి గుర్తింపు

కీర్తిచక్ర పురస్కారం పొందిన మేజర్ అర్షదీప్ సింగ్ అస్సాం రైఫిల్స్ విభాగంలో పనిచేస్తున్నారు. గత ఏడాది మే 14న భారత్-మయన్మార్ సరిహద్దుల్లో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన శత్రువులతో వీరోచితంగా పోరాడారు. తమ బృందంలో ఒక్కరికి కూడా ప్రాణ నష్టం జరగకుండా చూసుకుంటూనే.. పదుల సంఖ్యలో సాయుధులను మట్టుపెట్టారు. ఇక సైన్యంలోని పారాచూట్ రెజిమెంట్‌లో నాయబ్ సుబేదార్‌గా పనిచేస్తున్న డోలేశ్వర్ సుబ్బా జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ అడవుల్లో ధైర్యంగా ముందు నడిచి ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు.

దేహాన్ని చూసి కాదు.. మహిళగా గౌరవించండి

రక్షణ అంటే ఆంక్షలు కాదు.. పురుషుల ఆలోచనా ధోరణి మారాలి

- వంటింటి సంకెళ్లు తెంచుకుంటేనే మహిళా సాధికారత
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో నటి, రచయిత రోహిణి మొల్లేటి

"రాజకీయాల్లోకి మహిళలు ఆశించిన స్థాయిలో రావడం లేదు. వాళ్లకి ఇంటిపనితోనే సమయం సరిపోతోంది. సమాజం, కుటుంబం అండగా నిలబడితే వారు అద్భుతాలు చేయగలరు. స్త్రీని కేవలం దేహంగా కాకుండా, ఒక మహిళగా గౌరవించినప్పుడే వారికి నిజమైన రక్షణ లభిస్తుంది" అని తేల్చి చెప్పారు ప్రముఖ నటి, రచయిత, రోహిణి మొల్లేటి. తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె.. నటనలోనే కాదు సామాజిక అంశాలపైనా తనదైన ముద్ర వేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఐద్వా 14వ జాతీయ మహసభల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోహిణి.. మహిళా సాధికారత, రక్షణ, నేటి సమాజంలో మారుతున్న విలువలు తదితర అంశాలపై ఆమె అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నమస్కారం రోహిణి గారు. ఐద్వా సభల్లో పాల్గొనడం మీకెలా అనిపిస్తోంది?, గతంలో ఇలాంటి సభలకు హాజరయ్యారా?

నమస్కారం. గతంలో తమిళనాడులో జరిగిన సభల్లో పాల్గొన్నాను. చెన్నైలో మహిళా హక్కుల కోసం పనిచేసే అనేక వేదికల పైన కామ్రేడ్లతో కలిసి నా గళాన్ని వినిపిస్తూనే ఉన్నాను. అయితే, తెలంగాణలో జరుగుతున్న ఐద్వా సభలకు రావడం ఇదే మొదటిసారి. ఇక్కడ ప్రారంభోపన్యాసం చేసే అవకాశం రావడం చాలా గొప్ప బాధ్యత.

దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర పెరుగుతోందా?

రాజకీయాల్లోకి మహిళలు రావాల్సిన స్థాయిలో ఇంకా రావడం లేదనేది నా అభిప్రాయం. వాళ్లు రాజకీయాల్లో రాణించాలంటే తగినంత సమయం దొరకాలి. రాజకీయాలంటే చిన్న విషయం కాదు కదా ?. ఎన్నో చదవాలి. అర్థం చేసుకోవాలి. కానీ, మహిళలు ఇంట్లో పనులతోనే సతమతమవుతున్నారు. వారికి కుటుంబం నుంచి తగిన మద్దతు, తగిన అవకాశాలు లభించినప్పుడే బయటకు వచ్చి అద్భుతాలు చేయగలరు. అలాగే, మహిళలు కూడా ధైర్యంగా ముందుకు రావాలి, సమస్యల మీద అవగాహన పెంచుకోవాలి. ఈ రెండూ ఉంటే అనుకున్నది సాధించవచ్చు.

స్త్రీల వస్త్రధారణ, పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మీరేమంటారు?

స్త్రీల వస్త్రధారణపై చర్చ ఎప్పటినుంచో ఉంది. అయితే, ఇప్పుడు సోషల్‌మీడియా వల్ల ఈ చర్చ పెరుగుతోంది. యువత సహజీవనం, విడిపోవడం వంటి నిర్ణయాలు తీసుకునేముందు.. ఒకరి ఇష్టాలు మరొకరు పూర్తిగా గౌరవించాలి. అప్పుడే వారిద్దరి రిలేషన్ సఫలీకృతమవుతుంది. అభిప్రాయాలు కలవకపోతే అక్కడే ఆగిపోవడం మంచిది. అలాగే, పెళ్లికి ముందే ఒకరి గురించి ఒకరు చర్చించుకోవడం వల్ల అవగాహన పెరుగుతుంది. ఇద్దరికీ ఒక్కటే జీవితం కదా, అందుకే స్పష్టత అవసరం.

స్త్రీ సమానత్వం గురించి మీరు నిరంతరం మాట్లాడుతుంటారు.. ప్రస్తుతం సమాజంలో ఆ మార్పు కనిపిస్తోందా?

మార్పు మొదలైంది కానీ ఇంకా పూర్తిస్థాయిలో లేదు. యువతలో ఈ ధోరణి కొంత మారుతోంది. లింగ భేదం లేకుండా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికీ మహిళలు వంటింటికే పరిమితమవుతున్నారు. వారికి కూడా సొంత ఆశలు, ఆశయాలు ఉంటాయి. వాటిని గుర్తించి, అవి సాధించేలా కుటుంబ సభ్యులు సమయం ఇవ్వాలి. కేవలం 'తల్లి'గానో, 'భార్య'గానో ఆమెను చూడకూడదు. ఇంటి పనులను ఆడ, మగ ఇద్దరూ పంచుకోవాలి. అప్పుడే మహిళలు స్వేచ్ఛగా బయటి ప్రపంచంలోకి రాగలుగుతారు.

మహిళా రక్షణ విషయంలో సమాజం ఏవిధంగా మారాలి ?

మహిళలకు రక్షణ అనేది పురుషుల ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుంది. ఒక స్త్రీని కేవలం ఆమె దేహాన్ని చూసి కాకుండా, ఒక మనిషిగా, మహిళగా గౌరవించడం నేర్చుకోవాలి. ఆడపిల్లలకు 'జాగ్రత్తగా ఉండాలి' అని చెప్పడం కంటే మగపిల్లలకు 'మహిళలతో ఎలా ప్రవర్తించాలో' నేర్పించాలి. సమాజం కూడా ఇందులో పేరెంటింగ్ పాత్ర పోషించాలి. అప్పుడే దాడులు ఆగుతాయి, మహిళలకునిజమైన రక్షణ కలుగుతుంది.

నేటి యువతకు మీరిచ్చే సందేశం ఏమిటి?

ప్రస్తుత యువత మొదటగా వారికున్న హక్కులేంటో తెలుసుకోవాలి. ఎవరైనా సరే ఇతరులకు హాని కలిగించకూడదు. ఒకవేళ ఎక్కడైనా అన్యాయం జరుగుతుందనుకుంటే దాన్ని అడ్డుకునే బాధ్యత కూడా తీసుకోవాలి. భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహనతో, లక్ష్యంతో ముందుకు వెళ్తే కచ్చితంగా విజయం లభిస్తుంది.

సీమలో చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీలంక, తమిళనాడును ఆనుకొని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగిన అల్పపీడన ద్రోణి ఆదివారం ఉత్తర కేరళ, అరేబియా సముద్రం పరిసరాల్లో కొనసాగుతోంది. దీని ప్రభావంతో వీస్తున్న తేమగాలుల కారణంగా తమిళనాడు, కర్ణాటక, వీటికి ఆనుకొని ఉన్న రాయలసీమ, దక్షిణ కోస్తాలో చెదురుమదురు వర్షాలు కురిశాయి. ఉత్తరకోస్తాలో పలు జిల్లాల్లో ఆదివారం ఉదయం పొగ మంచు కురిసింది. కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో చలి స్వల్పంగా తగ్గి పగటి పూట ఎండ పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. సోమవారం రాయలసీమ, దక్షిణ కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

నిధులు రాబట్టాలి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించాల్సిన అంశాలు, కేంద్రంతో జరపాల్సిన సంప్రదింపులపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. 'రాష్ట్రాభివృద్ధిలో ఎంపీల భాగస్వామ్యం కీలకం. మన రాష్ట్రానికి ఇంకేం సాధించవచ్చో ఆలోచించి నిధులు రాబట్టాలి. మీ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. కేంద్రంలోని వివిధ శాఖలతో సంప్రదింపులు జరపడానికి ఎంపీలకు కొన్ని శాఖలను అప్పజెప్పాం. ఆయా శాఖలకు సంబంధించి ఏపీలో జరుగుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలి. మంత్రులు, కార్యదర్శులతో మాట్లాడాలి. రాష్ట్ర అంశాలపై అవగాహనకు ఫిబ్రవరిలో జరిగే కలెక్టర్ల సదస్సులో ఎంపీలు వర్చువల్‌గా పాల్గొనాలి' అని స్పష్టం చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర-రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, పూర్వోదయ పథకం, పోలవరం-నల్లమల సాగర్ ఈ మూడింటినీ బడ్జెట్ సమావేశాల్లో ప్రాధాన్యాంశాలుగా తీసుకోవాలన్నారు.

వివాదాలు వద్దు.. నీళ్లు కావాలి..

కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న క్రమంలో ఏపీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించేలా చూడాలని ఎంపీలతో సీఎం అన్నారు. 'పోలవరం ప్రాజెక్టుకు తాజా అంచనాలు ఇచ్చాం. దీని నిర్మాణంతోపాటు ఆర్ అండ్ ఆర్ పూర్తి చేయాలి. రూ.12 వేల కోట్లు ఇంకా కేంద్రం నుంచి రావాలి. 2027 జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాల్లోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయగలిగితే బావుంటుంది. అలాగే రాష్ట్రంలో నిర్మించతలపెట్టిన నీటి ప్రాజెక్టులపై పొరుగు రాష్ట్రాలతో వివాదాలు అవసరం లేదు. అదే సమయంలో నల్లమలసాగర్ వంటి అంశాలు పార్లమెంటులో ప్రత్యక్షంగానైనా.. పరోక్షంగానైనా ప్రస్తావనకు వస్తే మన వాదనలను గట్టిగా వినిపించాలి. తెలంగాణ కాళేశ్వరం నిర్మించి, మంజీరాకు నీళ్లను తరలించినా ఏపీ అభ్యంతరం చెప్పలేదని కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాలి. అదే సందర్భంలో నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో తెలంగాణ అభ్యంతరం చెప్పడం కరెక్టు కాదని వివరించాలి. ఇక అమరావతి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. రెండో దశ కూడా ప్రారంభం కానుంది' అని వెల్లడించారు. పూర్వోదయ ప్రాజెక్టు కింద రూ.40 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం ఎంపీలకు వివరించారు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు నాలుగు లైన్ల రైల్వే ట్రాక్ వేసేలా చూడాలన్నారు. ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలను రైల్వే శాఖ పెద్ద ఎత్తున చేపట్టేందుకు సిద్ధంగా ఉందని, పార్లమెంటు నియోజకవర్గాల్లో అలాంటివి ఏమైనా ఉంటే గుర్తించి, నిధులు తెచ్చుకోవాలని సూచించారు. వైద్య రంగంలో ప్రస్తుతం ఏపీ రెండో స్థానంలో ఉందని, పీపీపీ పద్ధతుల్లో ఆస్పత్రుల నిర్మాణానికి వీజీఎఫ్ కూడా ఇచ్చేందుకు కేంద్రం సుముఖంగా ఉందని చెప్పారు. దీనిని ప్రతి ఎంపీ దృష్టిలో పెట్టుకుని దానికి అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. సభలో గానీ, క్షేత్రస్థాయిలో గానీ కూటమి లక్ష్యాలకు విఘాతం కలిగించేలా ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవహరించొద్దని ఆదేశించారు. ఈసారి టీడీపీపీ భేటీకి జనసేన, బీజేపీ ఎంపీలను కూడా పిలుద్దామని.. దీనివల్ల మనవాణికి బలం చేకూరుతుందని తెలిపారు. విభజన సమస్యలు, జాతీయ రహదారుల విస్తరణ, సాగరమాల ప్రాజెక్టుల్లో చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలన్నారు. కేంద్రం నుంచి ఏమేరకు నిధులు రాబట్టవచ్చో చూడాలి. రాష్ట్ర స్థాయి అంశాలే కాకుండా జాతీయ స్థాయిలో ఎన్డీయే చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రతిపక్షాలు బీజేపీపై విమర్శలు చేస్తున్న సమయంలో ధీటుగా సమాధానం చెప్పేందుకు చొరవ చూపాలి' అని సూచించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మిగిలిన ఎంపీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి లోకేశ్ సమావేశంలో పాల్గొన్నారు. మరో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు హరీశ్, లక్ష్మీనారాయణ హాజరుకాలేదు.



టీడీపీ ఎంపీలతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు

జీతాలు లేకున్నా మా జీవితాలు మీ చేతుల్లోనే!

ఎంపీలు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని.. పార్లమెంటులో మాట్లాడే సమయంలో తగిన సమాచారంతో మాట్లాడితే వ్యక్తిగతంగా ఎంపీలకు, వారితోపాటు పార్టీకి గౌరవంగా ఉంటుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అరకొర పరిజ్ఞానంతో మాట్లాడితే అభాసుపాలవుతామని.. ఇప్పటికీ కొందరు సబ్జెక్టపరంగా వీక్‌గా ఉన్నారని అలాంటి వారి జీతాలు కట్ చేస్తామన్నారు. ఆ వెంటనే.. అయినా మీ జీతాలు కట్ చేయలేం కదా అని చెప్పారు. కొందరు ఎంపీలు స్పందిస్తూ.. మా జీతాలు మీ చేతుల్లో లేకపోతేం ఏం సార్.. మా జీవితాలు.. మా సీట్లు మీ చేతుల్లోనే ఉన్నాయని అనగా.. సరిగా పనిచేయని వారి విషయంలో అది ఎలాగూ జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు.

ఇకపై ఎంపీలతోనూ బాబు ముఖాముఖి!

వారు కూడా పార్టీ కార్యాలయానికి రావాలి: లోకేశ్



ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్న తరహాలోనే ఇకపై ఎంపీలకూ నిర్వహిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ వెల్లడించారు. టీడీపీపీ సమావేశంలో సీఎం 45 నిమిషాల పాటు ఎంపీలతో మాట్లాడి వెళ్లిపోయారు. అనంతరం రెండున్నర గంటలపాటు ఎంపీలతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. 'కొందరు ఎంపీల పనితీరుపై పార్టీ అధినేత అంత సంతృప్తిగా లేరు. మరికొందరు ఎంపీలు తరచూ వివాదాల్లో తలదూరుస్తున్నారు. వారిని పిలిపించి మాట్లాడాలని చంద్రబాబు నిర్ణయించారు. తరచూ వివాదాలతో రచ్చకెక్కుతున్న, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను గత కొద్ది నెలలుగా సీఎం స్వయంగా పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అదే తరహాలో ఇకపై ఎంపీలతోనూ సీఎం ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తారు. వాటిలో నేనూ పాల్గొంటా' అని తెలిపారు. పార్లమెంటు తొలివిడత సమావేశాలు ముగిసిన వెంటనే వీటిని ప్రారంభిద్దామన్నారు. మంత్రులందరూ ఇప్పటికే పార్టీ కార్యాలయానికి వస్తున్నారని, ఇకపై ఎంపీలు కూడా తప్పనిసరిగా రావాలని కోరారు. నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ఎమ్మెల్యేలకు నడుమ బంధం మరింత బలపడేలా ఎంపీలు వ్యవహరించాలన్నారు. ఎంపీల పనితీరుపై కేంద్రం నుంచి వస్తున్న నివేదికలు బాగున్నా మరింత మెరుగుపరచుకోవాలని తెలిపారు. ఏపీలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధిపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని వెల్లడించారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో ఈ విషయం స్పష్టంగా కనిపించిందన్నారు. అక్కడ తాను వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులతో సమావేశమయ్యానని, వారంతా ఇండియా సరైన మార్గంలో వెళ్తోందని చెప్పడంతోపాటు రాష్ట్రాభివృద్ధి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారని లోకేశ్ ఎంపీలకు వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.

పద్మ వికాసం



కలం పట్టినా, హలం పట్టినా.. సామాజిక మార్పు కోసం నడుంబిగించినా మహిళా శక్తికి సాటిలేదని ఈ ధీరవనితలు నిరూపించారు. తమదైన ముద్రతో సమాజ గమనాన్ని మార్చిన శివశంకరి, ఎస్.జి.సుశీలమ్మ, కొల్లక్కయిల్ దేవకి, విమలా మీనన్‌లను ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాలు వెతుక్కుంటూ వచ్చాయి. అక్షరం, ప్రకృతి, సేవ, కళ.. ఇలా విభిన్న రంగాల్లో వారు చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది.

అక్షర సేతువు



తమిళ సాహిత్య వినీలాకాశంలో ధృవతారగా వెలుగుతున్న శివశంకరిని కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించడం అక్షర లోకానికే గర్వకారణం. ఐదు దశాబ్దాలకు పైగా తన కలం ద్వారా సామాజిక ముఖ చిత్రాన్ని ఆవిష్కరించిన ఆమె కేవలం రచయిత్రిగానే కాకుండా ఒక సామాజిక విశ్లేషకురాలిగా దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారు. అక్షరాల ద్వారా దేశాన్ని ఏకం చేయాలనే ఆమె తపనకు ఈ పౌర పురస్కారం ఒక సముచిత గౌరవం. శివశంకరి రచనలు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. మధ్యతరగతి కుటుంబాలలోని మనో వేదనలు, స్త్రీల అంతరంగ మథనం, సామాజిక దురాచారాలను ఆమె తన రచనల్లో సూటిగా ప్రశ్నిస్తారు. ముఖ్యంగా డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాల వల్ల కుటుంబాలు ఎలా ఛిన్నాభిన్నం అవుతున్నాయో ఆమె కళ్లకు కట్టినట్టు చూపారు. పాఠకుల నాడి తెలిసిన రచయిత్రిగా ఆమె రాసిన అనేక నవలలు వెండితెరపైనా సంచలనం సృష్టించాయి. ఆమె సాహిత్య ప్రస్థానంలో తలమానికం వంటిది 'నిట్ ఇండియా త్రూ లిటరేచర్ ప్రాజెక్ట్'. భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశాన్ని సాహిత్యం ద్వారా ఎలా ఏకం చేయవచ్చో ఆమె నిరూపించారు. ఇందుకోసం ఆమె ఏకంగా 16 ఏళ్లపాటు దేశంలోని నాలుగు దిక్కులా పర్యటించారు. 18 భారతీయ భాషలకు చెందిన ప్రసిద్ధ రచయితలను కలుసుకుని వారి సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేసి నాలుగు భారీ సంపుటాలను వెలువరించారు. ఇది భారతీయ సాహిత్య చరిత్రలో ఒక అరుదైన, సాహసోపేతమైన ప్రయత్నం.

శివశంకరి రాసిన 'సూర్యవంశం' అనే స్మృతి చిత్రాలు ఆమె వ్యక్తిగత ప్రయాణంతోపాటు ఒక తరం సామాజిక మార్పులను రికార్డు చేశాయి. ఈ రచనకు గాను ఆమెకు ఇప్పటికే ప్రతిష్ఠాత్మక 'సరస్వతీ సమ్మాన్' దక్కింది. ఇప్పుడు దక్కిన 'పద్మశ్రీ' పురస్కారం ఆమె నిబద్ధతకు, సాహిత్య కృషికి దేశం సమర్పించిన నీరాజనం. భాషలు వేరైనా, భావం ఒక్కటేనని చాటిచెప్పిన శివశంకరి అక్షర ప్రయాణం రాబోయే తరాలకు గొప్ప స్ఫూర్తిపాఠం.

40 ఏళ్ళ 'మొక్క'వోని దీక్ష



కొల్లక్కయిల్ దేవకీ అమ్మకు ప్రకృతే బడి, గుడి. 'నేల ఎప్పుడూ పచ్చగా ఉంటేనే మనిషికి మనుగడ' అని చెప్పడమే కాదు, పచ్చదనం కోసం నలభయ్యేళ్ళుగా పాటుపడుతున్నారు. రోజుకు ఒక్క మొక్కయినా నాటడాన్ని ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నారు. దేవకీ అమ్మ స్వస్థలం కేరళలోని ముత్తుకులమ్ గ్రామం. 1934లో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆమెకు బాల్యం నుంచి వ్యవసాయ పనులు అలవాటే. వివాహం తరువాత... భర్త గోపాలకృష్ణ పిళ్ళై ఉపాధ్యాయ వృత్తిలో నిమగ్నమైతే... పొలం పనులను దేవకి చూసేవారు. కానీ కారు ప్రమాదానికి గురై, ఆమె పాదాలు బలహీనం కావడంతో... వ్యవసాయ పనులు చేయడం కష్టమయ్యేది. "పొలానికి వెళ్ళకుండా ఇంట్లో కూర్చోవడం ఆమెకు కష్టమయింది. ఇప్పుడే భర్త సూచనతో.... తమ తోటలో మొక్కలు పెంచడం ఆరంభించారు. ఇప్పటివరకూ అయిదువేలకు పైగా మొక్కలు నాటారు. వాననీటి సంరక్షణ పద్ధతులు చేపట్టారు.

నాలుగు దశాబ్దాల ఆమె కృషి ఇప్పుడు ఒక అడవిగా రూపుదిద్దుకుంది. అపురూపమైన ఎన్నో మొక్కలతో కళకళలాడుతోంది. వలస పక్షులకు విడిదిగా మారింది. తొంభయ్యేళ్ళు దాటినా ఇప్పటికీ ఆమెలో ఉత్సాహం, పర్యావరణ పరిరక్షణకోసం ఏదైనా చేయాలనే తపన తగ్గలేదు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని గట్టిగా వ్యతిరేకించే దేవకి తోటలో సేంద్రియ పద్ధతులనే అనుసరిస్తారు. ఆమె చేతుల మీదుగా రూపుదిద్దుకున్న ఆ తోట... ప్రకృతి ప్రేమికులతో పాటు విద్యార్థులను, పరిశోధకులకు సందర్శన స్థలంగా మారింది. ఇప్పుడు జానకి పిల్లలు కూడా ఆమె బాటతోనే... మొక్కల పెంపకం, సంరక్షణ చేస్తున్నారు. 'నారీ శక్తి' అవార్డుతో సహా అనేక పురస్కారాలను అందుకున్న దేవకికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మశ్రీ' అవార్డు... పర్యావరణ పరిరక్షణ దిశగా ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తుందనడంలో సందేహం లేదు.

జగమెరిగిన గురువు



"కళారంగంలో మీరు ఏం సంపాదించారు?" అని ఒక సందర్భంలో ఎదురైన ప్రశ్నకు "వేల మంది శిష్యుల్ని. వారే నా సంపద" అని సగర్వంగా బదులిచ్చారు విమలా మీనన్. నృత్య కళాకారిణిగా, గురువుగా దాదాపు ఆరున్నర దశాబ్దాల అనుభవం ఆమెది. సంప్రదాయానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చే మోహినీ ఆట్టం నృత్యాల్లో ఆహార్యం నుంచి ప్రదర్శన తీరు వరకూ ఆమె పలు ప్రయోగాలు చేశారు. కేరళలోని ఇరింజలకుడ గ్రామంలో 1943 జనవరి ఏడున ఆమె జన్మించారు. సివిల్ ఇంజనీర్ అయిన తండ్రి కృష్ణన్‌నాయర్, తల్లి విశాలాక్షి ఆమె కళాభిరుచిని ప్రోత్సహించారు. చిన్న వయసులోనే నృత్యంతో పాటు కర్ణాటక సంగీతాన్ని కూడా ఆమె అభ్యసించారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న తరువాత... 'కేరళ కళామండలం' సంస్థలో నృత్యంలో నాలుగేళ్ళ డిప్లమా చేశారు. 'కళామండలం విమలా మీనన్'గా ప్రసిద్ధులయ్యారు. మోహినీఆట్టంతోపాటు కేరళలో ప్రత్యేకించి మహిళలు చేసే తిరువతిరకళి, భరతనాట్యం, సుప్రసిద్ధ తెలుగు నృత్యగురువు వెంపటి చినసత్యం దగ్గర కూచిపూడి... ఇలా పలు నాట్యరీతులల్లో ఆమె ప్రావీణ్యం సంపాదించారు. ఒక పాఠశాలలో డ్యాన్స్ టీచర్‌గా పని చేస్తూ ఉండగా... భూటాన్‌లో ప్రభుత్వాధికారి అయిన విశ్వనాథ మీనన్‌తో విమలకు వివాహమయింది. భర్తతోపాటు భూటాన్ వెళ్ళి, అక్కడ నృత్య పాఠాలు బోధించడంతో పాటు పలుప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

స్వదేశానికి వచ్చిన తరువాత తిరువనంతపురంలో 'కేరళ నాట్య అకాడమీ' అనే సంస్థను ప్రారంభించారు. వేలాదిమందిని మోహినీ ఆట్టం, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. దక్షిణాది శాస్త్రీయ నృత్యాలకు చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో గౌరవాలను అందుకున్న విమలకు తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. "నాలుగేళ్ళ వయసు నుంచి 'కేరళ కళామండలం'లో నృత్యం నేర్చుకోవాలని కలలుకన్నాను. అక్కడే పూర్తిస్థాయి నర్తకిగా, కొరియోగ్రాఫర్‌గా రూపుదిద్దుకున్నాను. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. కానీ నృత్యం నేర్పడంలో ఉన్న సంతృప్తి నాకు మరెక్కడా దొరకలేదు. నా విద్యార్థులు ప్రపంచమంతటా ఉన్నారు. నృత్యకళకు గుర్తింపు తీసుకువస్తున్నారు. వారి కారణంగా నా పేరు ప్రపంచమంతా తెలిసింది. ఇంతకన్నా గొప్ప విజయం ఇంకేం ఉంటుంది?" అంటారు విమల.

అనాథల పాలిట అమ్మ



నిశ్శబ్దంగా వేలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపిన వారు కొందరే ఉంటారు. అటువంటి వారిలో ఒకరు కర్ణాటకకు చెందిన ఎస్.జి.సుశీలమ్మ. అనాథలు, అభాగ్యుల పాలిట కల్పవల్లిగా మారిన ఆమెను కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించడం సామాజిక సేవా రంగానికి దక్కిన గౌరవం. దశాబ్ద కాలంగా ఆమె చేస్తున్న నిరంతర కృషికి ఈ అత్యున్నత పురస్కారం ఒక చిన్న గుర్తింపు మాత్రమే.

సుశీలమ్మ సేవా ప్రస్థానం నేటిది కాదు. దాదాపు ఆరు దశాబ్దాల కిందటే ఆమె హృదయం సమాజంలోని అట్టడుగు వర్గాల కోసం ద్రవించింది. కేవలం రూ. 15 నగదుతో ముగ్గురు అనాథ పిల్లలను చేరదీసి ఒక అద్దె ఇంట్లో ప్రారంభించిన ఆమె ప్రయాణం నేడు 'సుమంగళి సేవా ఆశ్రమం' అనే ఒక మహా సంస్థగా రూపాంతరం చెందింది. సంపద లేకపోయినా సేవాగుణం ఉంటే కొండంత పనిచేయవచ్చని ఆమె నిరూపించారు. అనాథ పిల్లలకు ఆమె ఆశ్రయం ఇవ్వడమే కాదు, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజంలో గౌరవప్రదమైన స్థానాల్లో నిలబెట్టారు. సుశీలమ్మ కేవలం పిల్లలకే పరిమితం కాలేదు. గృహహింసకు గురై సమాజం వెలివేసిన మహిళలకు ఆమె ధైర్యాన్ని ఇచ్చారు. సుమంగళి సేవా ఆశ్రమం ద్వారా వేలాదిమంది మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా నిలబడేలా చేశారు. ఒక మహిళ స్వయం సమృద్ధి సాధిస్తే ఒక కుటుంబం మొత్తం బాగుపడుతుందన్న గాంధేయ సిద్ధాంతాన్ని ఆమె ఆచరణలో చూపారు. ఆమె పెంచిన పిల్లలు, ఆమె ఆశ్రయంలో ఆసరా పొందిన మహిళలు నేడు ఆమెను 'అమ్మ' అని పిలుచుకుంటారు.


వయసు పైబడుతున్నా సుశీలమ్మలో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతను పెంచడం, మహిళల ఆరోగ్య రక్షణ, వృద్ధులకు ఆసరా కల్పించడం వంటి అనేక కార్యక్రమాలను ఆమె ఇప్పటికీ పర్యవేక్షిస్తున్నారు. ప్రచార ఆర్భాటం లేకుండా ఆమె చేసిన సేవలు ఎందరికో మార్గదర్శకంగా నిలిచాయి. పద్మశ్రీ పురస్కారం ఆమె ఇంటి తలుపు తట్టడం ద్వారా భారత ప్రభుత్వం ఒక నిబద్ధత కలిగిన సేవామూర్తిని సరైన సమయంలో గుర్తించిందని చెప్పవచ్చు.

మువ్వన్నెల యాసెసరీస్...

రిపబ్లిక్ డే రోజున అందరిలో స్పెషల్‌గా కనిపించాలంటే ఈ యాసెసరీస్‌ను తయారుచేసుకుని ధరిస్తే చాలు...

- మీ చేతి సైజు మెటల్ బ్యాంగిల్స్ మూడింటిని తీసుకోవాలి. ఒకదానికి కాషాయం రంగు ఉన్ని దారాన్ని రెండోదానికి తెల్లని ఊలును, మూడో దానికి ఆకుపచ్చని ఊలు దారాన్ని చుట్టాలి. ఈ మూడింటిని జెండా రంగుల ఆర్డర్‌లో అతికించాలి. మీ దగ్గర లావుపాటి గాజు ఉంటే దాన్ని మూడు భాగాలుగా మార్కు చేసుకుని ఒక





భాగంలో కాషాయం ఊలును రెండో భాగంలో తెల్లని ఊలును, చివరి భాగంలో ఆకుపచ్చని ఊలును చుట్టి అతికించాలి. అంతే తిరంగా బ్యాంగ్ రెడీ!

- వెడల్పాటి హెయిడ్ బ్యాండ్‌ను తీసుకుని దానికి ఒక చివరన కాషాయం రంగు ఊలుదారాన్ని, రెండో చివర ఆకుపచ్చని ఊలుదారాన్ని, మధ్యలో తెల్లని ఊలును చుట్టి అతికించాలి. వీటిమీద అక్కడక్కడ మెరిసే క్రిష్టల్స్‌ను అతికిస్తే అందమైన మువ్వన్నెల బ్యాండ్ రెడీ! ఇలాగే జెండా రంగుల్లో ఉన్న శాటిన్ రిబ్బన్స్ అతికించి కూడా బ్యాండ్ రెడీ చేసుకోవచ్చు.
- ఒక గుండు సూదిని తీసుకుని కోడిగుడ్డు ఆకారంలో ఉండే ఆకుపచ్చని పూసను తరువాత తెల్లని పూసను, ఆపైన కాషాయం రంగు పూసను ఎక్కించాలి. తరువాత గుండుసూదిని కిందికి మడిచి రింగులా చేయాలి. ఇలాగే రెండో దాన్నీ తయారు చేయాలి. వీటిని మీ వద్ద ఉన్న ప్లెయిన్ మెటల్ హూప్స్‌కు హ్యాంగ్ చేయాలి. చక్కని తిరంగా జుంకాలు రెడీ! ఇలాగే థర్మకోల్ బాల్స్‌తో కూడా జుంకాలు సిద్ధం చేసుకోవచ్చు.
- వెడల్పాటి డబుల్‌సైడ్ స్టిక్కర్‌ను తీసుకోవాలి. టిక్‌టాక్ క్లిప్‌కు సరిపడేలా కట్‌చేసి దానికి క్లిప్‌ను గుచ్చి పై భాగాన్ని గమ్‌తో అతికించాలి. దీనికి సరిపడేలా మరికొంత స్టిక్కర్‌ను కట్‌చేసి దాన్ని మూడు సమాన భాగాలుగా పొడవుగా కట్ చేయాలి. వీటికి జెండా రంగులను వేయాలి. టిక్‌టాక్ క్లిప్‌కు పైన కాషాయం స్టిక్కర్, దానికింద తెల్లనిదాన్ని, చివరన ఆకుపచ్చని స్టిక్కర్‌ను అంటించాలి. మధ్యలో చిన్న అశోకచక్రం గీసిన కాగితాన్ని అంటిస్తే సరి, చక్కని బ్రూచ్ రెడీ!

ఆకాశమే హద్దుగా.. ఆస్థా



శత్రువుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే యుద్ధ విమాన గర్జన అది. అనంతమైన నీలి సముద్రంపై గాలిని చీల్చుకుంటూ వెళ్లే యుద్ధ నౌకల పైనుంచి ఎగిరే ఫైటర్ జెట్ అది. నిన్నటి వరకు ఆ కాక్‌పిట్‌లో పురుషులు మాత్రమే కనిపించేవారు. కానీ, ఇప్పుడా రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఆ కాక్‌పిట్‌లో కూర్చున్నది మరెవరో కాదు.. నౌకాదళంలో తొలి మహిళా ఫైటర్ పైలట్ ఆస్థా పూనియా. ఆమె సాధించిన 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' విజయం దేశంలోని ప్రతి అమ్మాయి కలలకు నిలువెత్తు సాక్ష్యం. ఈ అద్భుత ప్రస్థానంపై ప్రత్యేక కథనం.



గతేడాది విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ డేగా వేదికగా జరిగిన రెండో బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్స్ గ్రాడ్యుయేషన్ వేడుక ఒక చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆస్థా పూనియాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాన్ని అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్ (ఎయిర్) రియర్ అడ్మిరల్ జనక్ బెవ్లీ ప్రదానం చేశారు.

నారీ శక్తికి నిలువెత్తు నిదర్శనం

ఒకప్పుడు యుద్ధ విమానాలు నడపడం అనేది పురుషులకు మాత్రమే పరిమితమైన రంగం అనే అపోహ ఉండేది. కానీ, భారత రక్షణ మంత్రిత్వశాఖ, నౌకాదళం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఇప్పుడు మహిళలకు 'ఎలైట్ ఆపరేషనల్ రోల్స్'ను అందుబాటులోకి తెచ్చాయి. ఆస్థా పూనియా నియామకం ద్వారా సైన్యంలో పెరుగుతున్న నారీశక్తి స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధక్షేత్రంలో సైతం మహిళలు సరిసమానంగా పోరాడగలరని, క్లిష్టమైన యుద్ధ విమానాలను అలవోకగా నియంత్రించగలరని ఆస్థా నిరూపించారు.

హిసావాడ నుంచి హాక్ విమానం వరకు

ఆస్థా పూనియా విజయం వెనుక ఒక సామాన్య మధ్య తరగతి యువతి పట్టుదల ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని భాగ్‌పత్ జిల్లాలో ఉన్న హిసావాడ అనే చిన్న గ్రామం ఆమె స్వస్థలం. పచ్చని పొలాలు, ప్రశాంతమైన వాతావరణం ఉండే ఆ గ్రామం నుంచి ఆకాశమంత ఎత్తుకు ఎదగాలన్న ఆమె కల చిన్నప్పుడే మొదలైంది. చిన్నప్పటి నుంచీ విజ్ఞానశాస్త్రంపై ఉన్న ఆసక్తి, కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలం ఆమెను సైన్యం వైపు నడిపించాయి.

దేశమే ఫస్ట్

రాజస్థాన్‌లోని ప్రసిద్ధ వనస్థలి విద్యాపీఠంలో బీటెక్ పూర్తిచేసిన ఆస్థా.. అక్కడి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో తన వ్యక్తిత్వాన్ని మలచుకున్నారు. 'దేశమే ప్రథమం' అనే నినాదాన్ని తన ఊపిరిగా మార్చుకున్నారు. "వనస్థలిలో నేర్చుకున్న క్రమశిక్షణ, దేశభక్తి నన్ను ఈ స్థాయికి చేర్చాయి" అని ఆమె గర్వంగా చెబుతారు.

వారసుల కోసం దారి

భారత వాయుసేనలో అవని చతుర్వేది వంటి వారు సృష్టించిన బాటలో ఇప్పుడు నౌకాదళం తరపున ఆస్థా పూనియా మరో మైలురాయిని అధిగమించారు. సముద్రంపై నుంచి విమానాలను నడపడం, ల్యాండ్ చేయడం అనేది అత్యంత సాహసోపేతమైన ప్రక్రియ, అటువటి కఠినమైన విధులను చేపట్టేందుకు సిద్ధమైన ఆస్థా.. రేపటి తరం యువతులకు గొప్ప స్ఫూర్తి ప్రదాత. నేడు భారతదేశ రక్షణ రంగంలో మహిళలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా యుద్ధ నౌకలు, సరిహద్దు గస్తీలు, ఇప్పుడు ఫైటర్ కాక్‌పిట్‌లలోనూ తమ ముద్ర వేస్తున్నారు. ఆస్థా పూనియా సాధించిన ఈ 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' దేశంలోని కోట్లాదిమంది అమ్మాయిల కలలకు రెక్కలు తొడిగిందనడంలో ఎలాంటి సందేహం లేదు.



వెండి.. సిరుల వెలుగు

పసిడి ధరలు చుక్కలను తాకుతుంటే పెళ్లిళ్లు నిశ్చయమైన ఇళ్లలో టెన్షన్ మొదలైంది. అయితే, కంగారు పడాల్సింది ఏమీ లేదు. పసిడికి ధీటుగా, రాజసం ఉట్టిపడేలా వస్తున్న వెండి ఆభరణాలు ఇప్పుడు ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. తక్కువ ధరలో ఎక్కువ అందాన్ని ఇచ్చే ఈ వెండినగలు మధ్యతరగతి వారి వేడుకల్లో కొత్త కళను తీసుకొస్తాయంటున్నారు జెమాలజిస్ట్, జువెలరీ డిజైనర్ రాధికా మన్నె.



మార్కెట్లో కొత్త ట్రెండ్

ఆధునికత-సంప్రదాయం: టెంపుల్ జువెలరీ, పట్టీలు వంటి పాతకాలపు డిజైన్లకు నేటి తరం అభిరుచులకు తగినట్టుగా మోడ్రన్ టచ్ ఇస్తున్నారు.

ఎకో ఫ్రెండ్లీ: పర్యావరణ స్పృహ పెరగడంతో చాలామంది సస్టెయిన బుల్ సిల్వర్ వైపు చూస్తున్నారు.

డిజైనర్ల చాయిస్: వెండి మెత్తని లోహం కావడం వల్ల కళాకారులు ఇందులో అత్యంత క్లిష్టమైన డిజైన్లను (ఫిలిగ్రీ వర్క్) సులభంగా మలచగలరు.

మన్నిక: నిత్యం ధరించినా వెండి నగలు పాడవవు. అందుకే నేటి యువత ఆఫీస్ వేర్ కోసం మినిమలిస్ట్ వెండి నగలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

సరసమైన ధర: తక్కువ బడ్జెట్‌లోనే హై క్వాలిటీ, స్టైలిష్ లుక్ పొందాలనుకుంటే వెండి ప్రత్యామ్నాయం.





డిజిటల్ విక్రయాలు: ఈ-కామర్స్ పుణ్యమా అని నచ్చిన డిజైన్లను ఇంట్లోనే ఉండి ఆర్డర్ చేసుకునే సౌలభ్యం పెరిగింది.

పెట్టుబడిదారులకు పండుగ

పారిశ్రామిక డిమాండ్: ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీలో వెండి వాడకం తప్పనిసరి. సాంకేతిక రంగం ఎంతగా విస్తరిస్తే వెండికి అంత డిమాండ్ పెరుగుతుంది.

సురక్షితమైన పెట్టుబడి: ద్రవ్యోల్బణం పెరిగినా, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నా బంగారంలా వెండి కూడా ఇన్వెస్టర్లకు అండగా నిలుస్తుంది.

డైమండ్-సిల్వర్ జోడీ

వజ్రం అంటేనే విలాసం.. వెండి అంటేనే వైవిధ్యం. ఈ రెండూ కలిస్తే.. చూసే కళ్లకు పండుగే. ఈ అద్భుత కాంబినేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, డిజైన్ల విశేషాలు మీ కోసం..

జాగ్రత్తలు తీసుకోండిలా

- మురికి పట్టినప్పుడు మెత్తని సోప్ నీటితో కడిగి మృదువైన వస్త్రంతో తుడవాలి.
- గీతలు పడకుండా ఉండేదుకు ఇతర నగలతో కలపకుండా విడిగా భద్రపరచాలి.
- గాఢమైన కెమికల్స్, సెంట్రిఫ్యూగల్ వేడికి దూరంగా ఉంచాలి.

వెండితోనే ఎందుకు?

సాధారణంగా వజ్రాలను బంగారం లేదా ప్లాటినంలో పొదుగుతారు. కానీ వెండితో కలిసినప్పుడు సరికొత్త మెరుపును సంతరించుకుంటాయి.

మన్నిక: వెండి నగలను నిత్యం ధరించినా చెక్కుచెదరవు

తక్కువ ధర.. ఎక్కువ అందం: పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ రోజుల్లో వెండిలో డైమండ్ జువెల్లరీ మధ్య తరగతి వారికి కూడా 'అఫర్డబుల్ లగ్జరీ'ని అందిస్తోంది.

మిరుమిట్లు గొలిపే డిజైన్లు

హాలో సెట్టింగ్: మధ్యలో ఉండే వజ్రం చుట్టూ చిన్న చిన్న వజ్రాలను అమర్చడం వల్ల మరింత వెలుగు కనిపిస్తుంది.

పావే సెట్టింగ్: వెండి పట్టీపై చిన్న వజ్రాలను వరుసగా పేర్చడం వల్ల నగ అంతా మెరుస్తూ ఉంటుంది.

టెన్షన్ సెట్టింగ్: వజ్రం గాలిలో తేలుతున్నట్టుగా వెండి పట్టీల మధ్య అమర్చే ఆధునిక డిజైన్ ఇది.

ఫిలిగ్రీ వర్క్: వెండి తీగలతో అల్లిన పురాతనశైలి డిజైన్లు వజ్రాలకు ఒక వింటేజ్ లుక్‌ను ఇస్తాయి.

డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు భరోసా?

ప్రస్తుత కాలంలో డెస్టినేషన్ వెడ్డింగ్స్ అంటే కేవలం ఆడంబరమే కాదు, ప్రయాణంలో భద్రత కూడా ముఖ్యం. అందుకే ఖరీదైన బంగారు నగలకు బదులుగా అత్యంత ఆకర్షణీయమైన సిల్వర్ జువెలరీని ఎంచుకోవడం ఒక స్మార్ట్ ఆప్షన్. ఎందుకంటే?

భద్రతతో కూడిన స్టైల్: వెండి నగలు చూడటానికి ఎంతో హుందాగా, క్లాసీగా కనిపిస్తాయి. బంగారంతో పోలిస్తే ఇవి దొంగల కంటపడే అవకాశం తక్కువ. కాబట్టి కొత్త ప్రదేశాల్లో, జన సమ్మర్థం ఉన్నచోట కూడా మీరు టెన్షన్ లేకుండా ఎంజాయ్ చేయొచ్చు.

నిర్వహణ సులభం: వెండి నగలను శుభ్రం చేయడం, పాలిష్ చేయడం చాలా సులభం. ఫంక్షన్ జరిగే చోట మీరు వాటిని తక్కువ సమయంలోనే మెరిపించుకోవచ్చు.

గుర్తుంచుకోవాలి: ఖరీదైన నగ అంటే ఎక్కువ ధర ఉండాలని లేదు. అది విలువైన లోహంతో తయారైతే చాలు. ప్రపంచవ్యాప్తంగా బంగారం, ప్లాటినంతోపాటు వెండిని మాత్రమే ప్రీషియస్ మెటల్‌గా గుర్తిస్తారు. కాబట్టి వెండినగలు కూడా బంగారు నగల్లాగే స్వచ్ఛమైనవి, కళాత్మకమైనవి, జీవితకాలం మన్నికనిచ్చేవి.

• రాధికా మన్నె, జెమాలజిస్ట్, జువెలరీ డిజైనర్

తిరంగా సలాడ్

రిపబ్లిక్ డే రోజున బడిలో ఎగురవేసే జాతీయ జెండా విశిష్టత గురించి పిల్లలకు వివరిస్తూ ఉదయాన్నే ఈ తిరంగా సలాడ్ చేసి పెట్టండి. పిల్లలు ఆసక్తిగా తింటారు. దీన్ని ఎలా తయారుచేయాలంటే...

- ఒక కప్పు కేరట్ తురుంలో.. వేయించి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసిన వేరుశనగ గుండ్ల పొడి రెండు చెంచాలు వేసి కలపాలి.
- ఒక కప్పు పనీర్ తురుంలో రెండు క్యాబేజీ ఆకులను సన్నగా తరిగి వేయాలి.
- ఒక కప్పు కీరా ముక్కల్లో రెండు చెంచాల కొత్తిమీర తరుగు, అర కప్పు పాలకూర తరుగు వేసి కలపాలి.



- ఒక పళ్లెంలో పై భాగంలో కేరట్ తురుం దాని కింద పనీర్ తురుం, చివరలో కీరా ముక్కలు వేసి సమంగా పరచాలి.
- కేరట్ తురుం, కీర ముక్కల భాగాల్లో ఒక్కోదానిలో రెండు చెంచాల ఆలివ్ ఆయిల్ వేసి చెంచా నిమ్మరసం చిలకరించి చెంచా నువ్వులు, అర చెంచా మిరియాల పొడి చల్లాలి.
- పనీర్ తురుం భాగంలో పావు కప్పు నానబెట్టిన జీడిపప్పు పలుకులు, చెంచా ఆలివ్ ఆయిల్ వేసి రెండు చెంచాల పెరుగు చిలకరించి అరచెంచా రెడ్ చిల్లీ ఫ్లేక్స్, కొద్దిగా ఉప్పు చల్లాలి. మధ్యలో సన్నగా తరిగిన ఎర్ర క్యాబేజీ ఆకులు లేదా బీట్‌రూట్ చీలికలతో అశోక చక్రం తయారుచేసి పెట్టాలి. అంతే! తిరంగా సలాడ్ రెడీ!